# పునీత పౌలు సందేశ వివరణం

ఫాదర్ పి. జోజయ్య, S.J.
ఆంధ్ర లొయోలా కాలేజి
విజయవాడ - 520 008

ముద్రణానుమతి

**Most Rev. M. Prakash, D.D.**
విజయవాడ పీఠాధిపతులు

ప్రథమ ముద్రణ - ఫిబ్రవరి 11, 2007
ప్రతులు - 3000

# మనవిమాట

సువిశేషకారులకంటె ముందుగా క్రీస్తుని గూర్చి సమగ్రంగా వ్రాసినవాడు పౌలు భక్తుడు. నేడు మనం నమ్మే వేదసత్యాలూ క్రైస్తవ ఆచరణపద్ధతులూ చాలవరకు మొదటలో అమలు పరచినవాడు అతడే.

పౌలు క్రీస్తుని గాఢంగా అనుభవానికి తెచ్చుకొన్న మహాభక్తుడు. క్రీస్తుపట్ల వ్యక్తిగతమైన అనుభవాన్నీ భక్తినీ పెంపొందించుకోగోరేవాళ్లకు అతడు నేటికీ మార్గదర్శకుడుగా వుంటాడు.

క్రైస్తవ జీవితమంటే ప్రధానంగా క్రీస్తుని జీవించడమే. పౌలు సందేశం కూడ యిదే. కనుక అతని బోధలు విశ్వాసులందరికీ శిరోధార్యాలు కావాలి.

ఐనా మన క్యాతలిక్ సమాజంలోని విశ్వాసులకు పౌలు జాబులను గూర్చిగాని, అతని భావాలను గూర్చిగాని అట్టే తెలియదు. మన సమాజం ఇంతవరకు ఆ భక్తుని మీద ఒక్క పుస్తకాన్ని కూడ ప్రచురించలేదు. ఇది పెద్దలోటు.

ఈ గ్రంథంలో పౌలు సందేశాన్నీ, అతని మౌలిక భావాలనూ క్లుప్తంగా తెలియజేసాం. ఇది పౌలు లేఖల్లో దేనిమీదకూడ వ్యాఖ్య కాదు. అతని ముఖ్యబోధలను సంగ్రహంగా తెలియజేసే పుస్తకం. పౌలు జాబులకు పరిచయప్రాయంగా వుంటుందన్న భావంతో దీన్ని తయారుచేసాం. ఒక్కో లేఖమీద వివరణం ఇకమీదట రావాలి.

పాఠకులు మా పూర్వగ్రంథాలవలె దీన్ని కూడ ఆదర భావంతో స్వీకరిస్తారని ఆశిస్తున్నాం.

ఈ గ్రంథముద్రణకు ఆర్థిక సహాయాన్ని అందించిన బి. సాంసన్ ఫాదరుగారిని ప్రభువు దీవించునుగాక.

-గ్రంథకర్త

# విషయసూచిక


పేజి నెం.

**1. పౌలు జీవితమూ, రచనలూ 5**

**2. పౌలు పూర్వరంగం 17**

**3. డమస్కు దర్శనం 19**

**4. రక్షణప్రణాళిక తండ్రినుండే 25**

**5. క్రీస్తు రక్షణం 28**

1. నరులను నీతిమంతులను జేయడం 28
2. నరులు రక్షణను పొందడం 30
3. నరులు దేవునితో రాజీపడ్డం 31
4. పాపాలకు ప్రాయశ్చిత్తం చేయడం 33
5. విమోచించడం 35
6. విశ్వాసులకు స్వేచ్ఛనీయడం 36
7. పవిత్రపరచడం 38
8. మార్చివేయడం 38
9. నూత్నస్వభావాన్ని ఈయడం 40
10. మహిమపరచడం 41

**6. క్రీస్తురాకముందు నరుల దౌర్భాగ్యస్థితి 42**

1. పాపం 42
2. శరీరం 44
3. ధర్మశాస్త్రం 45
4. మృత్యువు 50

పేజి నెం.

**7. క్రీస్తు వచ్చాక నరుల్లో కలిగిన మార్పు 52**

1. క్రీస్తు పట్ల విశ్వాసం 52
2. జ్ఞానస్నానం 56
3. క్రీస్తుతో ఐక్యత 60
4. తిరుసభ 70
5. సత్ప్రసాదం 74

**8. క్రైస్తవుడు -స్వేచ్ఛ 75**

**9. పౌలు ప్రేషితసేవ 79**

**10. నైతిక జీవితం 82**

1. అంతరాత్మ 83
2. ప్రార్థన 84
3. ఇంద్రియనిగ్రహం 85
4. కుటుంబధర్మాలు 86
5. సమాజ ధర్మాలు 88

**11. అంత్యగతులు 91**

1. నూత్నయుగం ప్రారంభమైంది 91
2. రెండవరాకడ 92
3. క్రీస్తుతో వుండిపోవడం 92
4. ఉత్థానజీవితం ఏలా వుంటుంది? 93

-ప్రశ్నలు 95

# 1. పౌలు జీవితమూ, రచనలూ

*ఈ యధ్యాయంలో ఐదంశాలు పరిశీలిద్దాం.*

## 1. పౌలు జీవితం

### బాల్యం

పౌలు క్రీస్తు జన్మించిన తర్వాత కొద్ది యేండ్లకే పుట్టాడు. జన్మనగరం సిలీష్యా రాష్ట్రంలోని తార్సు. అతనికి సౌలు, పౌలు అని రెండు పేర్లు వుండేవి. అతడు పరిసయుల శాఖకూ, బెన్యామీను తెగకూ చెందినవాడు. చిన్నప్పుడే మోషే ధర్మశాస్త్రం, మిష్నా అనబడే పూర్వుల సంప్రదాయం నేర్చుకొన్నాడు. తార్సు నగరం గ్రీకు సంస్కృతికి నిలయం. కనుక అతడు గ్రీకు భాషను క్షుణ్ణంగా నేర్చుకొన్నాడు. స్టోయిక్, ఎపిక్యూరియన్ తాత్వికుల భావాలను అర్థంజేసికొన్నాడు. పెరిగి పెద్దయిన తర్వాత యెరూషలేములో గమలియేలు వద్ద ధర్మశాస్త్ర వివరణను అభ్యసించాడు. తర్వాత రబ్బియిఐ గుడారాల బట్ట నేయడం వృత్తిగా పెట్టుకొన్నాడు. అతనికి రోమను పౌరసత్వం వుంది.

### పరివర్తనం

క్రైస్తవులు యూదమతానికి వ్యతిరేకులనీ, వారిని మొదటలోనే అణగద్రొక్కాలనీ నిర్ణయించుకొన్నాడు సౌలు. కనుక క్రైస్తవులను హింసించడానికి పూనుకొన్నాడు. వారి నాయకుల్లో ఒకడైన స్తెఫను హత్యలో చేతులు కలిపాడు. క్రీ.శ. 36లో డమస్కులోని క్రీస్తు భక్తులను హింసించడానికి వెళ్తుండగా సౌలుకి క్రీస్తు దర్శనం కలిగింది. దీనివల్ల అతని జీవితం క్రొత్త మలుపు

తిరిగింది. అతడు నూత్ననరుడు అయ్యాడు. క్రీస్తు విరోధి క్రీస్తు భక్తుడుగా మారిపోయాడు. ఇక క్రీస్తుని అనుభవానికి తెచ్చుకోవడం, అతన్ని ఇతరులకు బోధించడం తనధ్యేయంగా పెట్టుకొన్నాడు. క్రీస్తే తన్ను అన్యజాతులకు ప్రేషితుణ్ణిగా నియమించాడని గట్టిగా నమ్మాడు.

## ప్రేషిత సేవ

పరివర్తనం తర్వాత సౌలు మూడేండ్లపాటు దమస్కు ప్రక్కనేవున్న అరేబియాలో ఏకాంతంగా వుండిపోయి క్రీస్తుని ధ్యానం చేసికొన్నాడు-గల1,17. పూర్వం మోషే యేలియా క్రీస్తులకు ఎడారిలో దైవసాక్షాత్కారం కలిగింది. అటుపిమ్మట దమస్కులో క్రీస్తుని బోధించడం మొదలు పెట్టాడు. కాని అక్కడి యూదులు పగబట్టి అతన్ని చంపబోయారు. అతడు శత్రువుల బారినుండి తప్పించుకుని యెరూషలేము చేరుకొన్నాడు. అక్కడ బర్నబా అతన్ని అపోస్తుల బృందానికి పరిచయం జేసాడు. రెండు వారాలు క్రీస్తుని బోధించాడో లేదో, అక్కడి యూదులు కూడ అతనిపై పగబూని చంపబోయారు. సౌలు స్వీయనగరమైన తార్సుకి వెళ్ళిపోయాడు. అక్కడ క్రీస్తు మరణోత్థానాలను లోతుగా ధ్యానం చేసికొని ప్రార్థనలో మునిగిపోయాడు. క్రీస్తుని బోధించడానికి తన్ను తాను సిద్ధం జేసికొన్నాడు. అతనికి పలుసార్లు క్రీస్తు దర్శనాలు కలిగాయి-2కొరి 12,1-7.

అంతియొకయలో గ్రీకు ప్రజలు క్రీస్తుని అంగీకరించి విశ్వాసులు అయ్యారు. బర్నబా వారికి బోధకుడయ్యాడు. అతడు 45లో సౌలుని తార్సు నుండి అంతియొకయకు తీసికొని వచ్చాడు. ఆ యిద్దరు అక్కడ కొంతకాలం పాటు క్రీస్తుని బోధించారు.

చాలమంది గ్రీకులు క్రీస్తుని విశ్వసించారు. ఆ కాలంలో యూదయలో కరువురాగా అంతియొకయలోని గ్రీకు క్రైస్తవులు విరాళాలు ఇచ్చారు. బర్నబా సౌలులు ఈ సొమ్మును యెరూషలేముకు కొని వచ్చారు.

## మూడు ప్రేషిత యాత్రలు

అంతియొకయలోని క్రైస్తవ సమాజం బర్నబా సౌలులను ప్రేషిత యాత్రలకు పంపింది. యూదులకూ అన్యజాతి ప్రజలకూ గూడ క్రీస్తుని బోధించడం ఈ యాత్రల ఉద్దేశం. మొదటియాత్ర 47-49 సంవత్సరాల్లో జరిగింది. ఈయాత్రలో సౌలు పేరు పౌలుగా మారింది. బర్నబాకు బదులుగా పౌలు నాయకుడయ్యాడు. ఈ యాత్రలో సిప్రు, పిసిడియా అంతియొకయ, ఇకోనియా, లుస్త్ర, దెర్బె మొదలైన నగరాల్లో వేదబోధచేసారు. యూదులు పౌలుని కొట్టి హింసించారు. ఐనా చాలమంది గ్రీకులు క్రీస్తుని విశ్వసించారు.

యెరూషలేములోని యూదమతాభిమానులైన క్రైస్తవులు క్రొత్తగా చేరిన గ్రీకు క్రైస్తవులు మోషే ధర్మశాస్త్రాన్ని పాటించాలని పట్టుబట్టారు. అలాగైతే రక్షణం క్రీస్తునుండి గాక ధర్మశాస్త్రం నుండి వచ్చినట్లవుతుంది. పైగ యూద తిరుసభ, గ్రీకు తిరుసభ అని రెండు క్రైస్తవ సమాజాలు ఏర్పడతాయి. కనుక పౌలు ఈ వాదాన్ని ఖండించాడు. 49లో యెరుషలేములో మహాసభ జరిగింది. ఈ సభలో గ్రీకు క్రైస్తవులు ధర్మశాస్త్రాన్ని పాటించనక్కరలేదని నిర్ణయించారు.

రెండవ ప్రేషితయాత్ర 49-52. సంవత్సరాల్లో జరిగింది. పౌలు బర్నబాలు విడిపోయారు. ఈ సారి పౌలు ఫిలిప్పి, తెస్సలోనిక, బెరయ, కొరింతు పట్టణాల్లో బోధించి పలువురను క్రీస్తు శిష్యుల

నుగా జేసాడు. యూదులు పౌలుని ఎదిరించారు. కాని క్రీస్తు తన దర్శనాలతో అతనికి ధైర్యంచెప్పాడు. మొట్టమొదటిసారిగా యూరపులో వేదబోధ జరిగింది ఈ యాత్రలోనే.

మూడవ ప్రేషితయాత్ర 54-57 సంవత్సరాల్లో జరిగింది. ఈ సారి పౌలు ప్రధానంగా ఎఫెసు పట్టణంలో వేదబోధ చేసాడు. అక్కడే మూడేండ్లు వున్నాడు. తిరుగు ప్రయాణంలో తాను పూర్వం స్థాపించిన క్రైస్తవ సమాజాలను బలపరచాడు. మిలేతు వద్ద ఎఫెసు సమాజం పెద్దలను కలిసికొని వారికి ధైర్యం చెప్పాడు.

## చెరసాల, మరణం

యెరూషలేము యూదులు దేవాలయ సందర్శనానికి వచ్చిన పౌలుపై దౌర్జన్యం చేసారు. రోమను పాలకులు అతన్ని బందీని చేసి సీజరియాకు పంపారు. అక్కడ గవర్నరు ఫీలిక్సు అతన్ని రెండేండ్లు చెరలో వుంచాడు. తర్వాత వచ్చిన గవర్నరు ఫెస్తు అతన్ని రోముకి ఖైదీగా పంపాడు. దారిలో మాల్టావద్ద పౌలు ప్రయాణం చేస్తున్న వోడ తుఫానుకి చిక్కి నాశమైంది. పౌలు రోముకి చేరుకొని రెండేడ్లు చెరలో ఖైదీగా వున్నాడు. ఆ కాలంలో రోములోని యూదులకు క్రీస్తుని బోధించాడు. ఇంతటితో అపోస్తుల చర్యల గ్రంథం ముగుస్తుంది. ఆ పిమ్మట పౌలుకి ఏం జరిగింది మనకు రూఢిగా తెలియదు.

ఓ ప్రాచీన సంప్రదాయం ప్రకారం పౌలుకి రోము చెరనుండి విముక్తి లభించింది. అతడు స్పెయినుకు వెళ్లి అక్కడే వేదబోధ చేసాడు. తీతుని క్రీటుకు, తిమోతిని ఎఫెసుకు పెద్దలనుగా నియమించాడు. ఆ పిమ్మట పౌలుని మళ్లా బంధించి రోములో చెరలో పెట్టారు. అక్కడే అతన్ని 67 ప్రాంతంలో వధించారు. అతడు

30 ఏండ్ల పాటు సుదీర్ఘమైన ప్రేషితసేవచేసి నీరో చక్రవర్తి కాలంలో వేదసాక్షిగా మరణించాడు.

**పౌలు కాలపట్టిక**

జననం -క్రీ.శ. 10
పరివర్తనం - 36.
తార్సులో - 45
అంతియొకయలో - 47
మొదటి ప్రేషితయాత్ర - 47-49.
యెరూషలేము మహాసభ - 49.
రెండవ ప్రేషితయాత్ర 49-52.
మూడవ ప్రేషితయాత్ర 54-57
యెరూషలేములో ఖైదీ గావడం - 58
సీజరియాలో ఖైదీ 58-60
రోముకు ప్రయాణం - 60
రోములో ఖైదీ 61-63
వేదసాక్షి మరణం - 67.

## 2. పౌలు బోధలకు ఆధారాలు

పౌలు బోధలకు మూడు ప్రధానమైన ఆధారాలు వున్నాయి. మొదటిది, అతడు యూదరబ్బయి. కనుక పూర్వవేదంనుండి చాలభావాలు స్వీకరించాడు. దైవకారుణ్యం, పాపపరిహారం, పరలోకంలో శిక్షా బహుమతులు, ఉత్థానం, దేవదూతలు మొదలైన భావాలను పూర్వవేదంనుండే గ్రహించాడు.

రెండవది, అతనికి క్రీస్తు బోధలు తెలుసు. తొలినాటి ప్రేషితుల బోధలు, వారి సంప్రదాయాలు కూడా తెలుసు. ఇవికూడ అతని రచనలకు ఆధారమయ్యాయి.

మూడవది పౌలు డమస్కు త్రోవలో స్వయంగా క్రీస్తుని దర్శించాడు. ఇంకా వేరే దర్శనాలు కూడ పొందాడు. ఈ దర్శనాల్లో ఉత్థాన క్రీస్తు అతనికి నేరుగా వేదసత్యాలను తెలియజేసాడు. ఈయంశాలుకూడ అతని రచనలకు ఆధారమయ్యాయి. పౌలు ప్రధానంగా దైవానుభూతిగల రచయిత.

## 3. పౌలు జాబులు

పూర్వం ప్రజలు పౌలు 13 జాబులు వ్రాసాడు అనుకొన్నారు. కాని యిప్పుడు బైబులు పండితులు అతడు 7 జాబులు మాత్రమే వ్రాసాడు అని చెప్తున్నారు. ఆ జాబుల రచనా కాలాలు ఉజ్జాయింపుగా ఇవి.

| | |
|---|---|
| 1. తెస్సలోనీయులు | - 52 |
| గలతీయులు | - 54 |
| 1కొరింతీయులు | - 54 |
| 2కొరింతీయులు | - 55 |
| రోమీయులు | - 58 |
| ఫిలిప్పీయులు | - 61 |
| ఫిలెమోను | - 61 |

రెండు తెస్సలోనీయులు, కొలోస్సీయులు, ఎఫెసీయులు పౌలు శిష్యులు వ్రాసినవి. తీతు, రెండు తిమోతి జాబులు పౌలు అనుచరులు వ్రాసినవి. (హెబ్రేయుల జాబు ఎవరో పరోక్ష శిష్యుడు వ్రాసింది.) మనమట్టుకు మనం ఈ గ్రంథంలో పై 13 జాబుల నుండి భావాలను పరిశీలిస్తాం.

పౌలు రచనలు లేఖా రూపంలో వున్నాయి. ఈ జాబుల్లో కొన్ని అతడే స్వయంగా వ్రాసి వుండవచ్చు. కొన్ని అతడు నోటితో

చెప్తుండగా కార్యదర్శులు వ్రాసి వుంటారు. నూత్న వేదంలోని సువిశేషాలకంటె ముందుగా పౌలు రచనలే క్రైస్తవ సమాజాల్లో ప్రచారంలోకి వచ్చాయి. తొలిరోజుల్లోనే విశ్వాసులు పౌలు జాబుల సంకలనాలను తయారుచేసికొన్నారు.

ఈ లేఖల్లో క్రీస్తు పట్ల పౌలుకున్న గాఢమైన భక్తి అడుగడుగునా కన్పిస్తుంది. సాహిత్య దృష్ట్యా కాదుగాని భక్తి విశ్వాసాల దృష్ట్యా ఈ లేఖలు పలుసార్లు చదవదగినవి. "క్రీస్తునందు" అనేది అతని ప్రధాన భావం. భక్తుడు క్రీస్తుతో ఐక్యంగావాలి అనేది అతని ముఖ్యబోధ. ఈ యైక్యతనుగూర్చి వ్రాసేపుడు అతడు గ్రీకు భాషలో నూత్న పదాలనుగూడ సృష్టించాడు. అతని రచనల్లో శక్తి, వేగం, గాఢమైన ఉద్వేగాలు కన్పిస్తాయి.

అతడు గ్రీకుభాషలో వ్రాసినా యూదుడుగానే ఆలోచించాడు. అతని భావాలకు ఆధారం పూర్వావేదం. శరీరం, మనస్సు, ఆత్మ మొదలైన పదాలకు అతడు ఇచ్చేది గ్రీకు అర్థాలు కావు, హిబ్రూ అర్థాలు.

పౌలు దృష్టిలో పూర్వవేదానికి సార్థక్యం క్రీస్తే. ఈ క్రీస్తుని గూర్చి వ్రాయడం, బోధించడం అతని ధ్యేయం. అతడు క్రైస్తవ బోధకుడుగా మారిన యూదరబ్బాయి. కనుక అతని భావాలు, శైలి, ప్రత్యర్థితో వాదం చేసినట్లుగా వ్రాయడం మొదలైనవి అచ్చంగా రబ్బయుల పద్ధతిలోనే వుంటాయి.

అతడు వాడింది హిబ్రూ బైబులు కాదు, సెప్టువాజింత్ గ్రీకు అనువాదం. అతని గ్రీకు భాషకూడా ఈ సెప్టువాజింత్ గ్రీకుకు దగ్గరగానే వుంటుంది. అతని గ్రీకులో అక్కడక్కడ వ్యాకరణానికి లొంగని ప్రయోగాలు కన్పిస్తాయి. కొన్నిచోట్ల వాక్యాలు ముగియకుండ అర్థాంతరంగానే ఆగిపోతాయి. అతని రచనల్లో భావనాశక్తి కంటె బుద్ధిశక్తి యెక్కువ. లోతుతనం మెండు. కనుక

చాల తావుల్లో "అల్పాక్షరాల్లో అనల్పార్థరచన" అనే లక్షణం కన్పిస్తుంది.

క్రైస్తవ విశ్వాసాన్ని ఓ క్రమ పద్ధతిలో వివరించడం పౌలు ఉద్దేశంకాదు. కేవలం ఆయా అవసరాలను పురస్కరించుకొని అతడు జాబులు వ్రాసాడు. ఒక్కొజాబులో అప్పటికప్పుడు అవసరమైన వేదసత్యాలను మాత్రమే వివరించాడు. అందుచే అతని లేఖల్లో నేటి మన దైవశాస్త్ర గ్రంథాల్లోలాగ ఓ క్రమపద్ధతి గోచరించదు. కాని అతడు ఎత్తుకొన్న విషయాలను మాత్రం ఎవరూ చెప్పలేనంత లోతుగా చెప్పాడు.

## 4. పౌలు వ్యక్తిత్వం

పౌలు జాబులనుండీ అపోస్తుల చర్యలనుండీ అతని వ్యక్తిత్వాన్ని కొంతవరకు గ్రహించవచ్చు. అతడు గొప్ప ఉత్సాహశక్తి, కార్యదీక్ష, అంకిత భావం, విజయకాంక్ష గల నాయకుడు. అతని పట్టుదలకు అంతులేదు. 30 ఏండ్ల పొడుగున నిర్విరామంగా కృషిజేస్తూపోయాడు. యూదుడుగా వున్నపుడు ధర్మశాస్త్రాన్ని మక్కువతో పాటించాడు. క్రైస్తవులను ఘోరంగా హింసించాడు. క్రైస్తవుడు అయ్యాక నిద్రాహారాలు గూడ మాని నానా ప్రదేశాల్లో క్రీస్తుని బోధించాడు. బర్నబాని పేతురునిగూడ ఎదిరించాడంటే అతని ధైర్యాన్ని మెచ్చుకోవాలి.

ధైర్యం పట్టుదలగల నాయకుడైన పౌలులో మెత్తదనం గూడ లేకపోలేదు. కష్టాలు, శత్రువులు ఎదురైనపుడు ఉద్వేగాలకు గురయ్యేవాడు. భయం, బలహీనత, నిరుత్సాహభావాలు అతన్ని క్రుంగదీసేవి -1కొరి 2,3. 2కొరి 1,8. ఐనా ఆత్మప్రేరణంతో మళ్లా ఉత్సాహం తెచ్చుకొనేవాడు.

అతడు మంచి వక్త. తార్కికుడు. నిశితదృష్టి, వాదపటిమ కలవాడు. అతని లేఖల్లో తర్కం, వాదవివాదాల పట్ల ప్రీతి, ప్రత్యర్థితో సూటిగా వాదించడం మొదలైన లక్షణాలు కన్పిస్తాయి. యూదరబ్బయిగా వున్నపుడే అతనికి ఈ లక్షణాలు అలవడి వుండవచ్చు.

పౌలు గొప్పవ్యవస్థాపకుడు. చాలతావుల్లో క్రైస్తవ సమాజాలను స్థాపించి వాటిని సుసంఘటితం చేసాడు. తీతు, తిమోతి, సీలా మొదలైనవారితో పెద్ద శిష్యబృందాన్ని ఏర్పాటుచేసాడు. వారిద్వారా తన కార్యకలాపాలను కొనసాగించుకొని పోయాడు. అసలు అతడు ఓ వ్యక్తి కాదు, ఓసంస్థ. తన సమాజాల్లో క్రమశిక్షణను ఖండితంగా అమలు పరచాడు. కొరింతు విశ్వాసులు అదుపు తప్పగా వారిని నేర్పుతో దారికి తీసుకవచ్చాడు.

ఇంకా అతడు మహాప్రేషితుడు. కొన్నివేల మైళ్లు ప్రయాణాలు చేసి యూదులకూ గ్రీకులకూ గూడ క్రీస్తుని బోధించాడు. ఎన్నో నూత్నసమాజాలు స్థాపించాడు. అతడు మంచి సంఘకాపరి. తాను స్థాపించిన దైవసంఘాలను గూర్చి నిరంతరం జాగ్రత్తపడేవాడు, ఆందోళనం చెందేవాడు - 2కొరి 11,28.

పౌలు ప్రేషితసేవలో చాల విజయాలు సాధించాడు. దైవదర్శనాలు పొందాడు. జీవన్ముక్తుడు అయ్యాడు. ఐనా తన్ను గూర్చి గొప్పలు చెప్పుకోలేదు. వినయంతో తన విజయాలన్నిటినీ దేవునికే ఆరోపించాడు. దేవుని అనుగ్రహం వల్లనే నేనిప్పుడున్న స్థితిలో వున్నాను అని నిగర్వంగా చెప్పుకొన్నాడు - 1కొరి 15,10.

పౌలుని అతని విశ్వాసులు గాఢంగా ప్రేమించారు.

అనుచరులకు అతనిపట్ల అపారగౌరవం ప్రేమ వుండేవి. అతడు వారిని ఆదరంతో "తోడిపనివాళ్లు"అని పేర్కొనేవాడు. రోమా పౌరుల లేఖ 16వ అధ్యాయం ఈలాంటి పనివాళ్లను 27మందిని పేర్కొంటుంది. దీన్నిబట్టే పౌలు స్నేహస్వభావాన్ని అర్థంజేసికోవచ్చు. అతడు తన్ను తల్లితో తండ్రితో, దాదితో పోల్చుకొన్నాడు. ఐనా పౌలుకి చాలమంది విరోధులు కూడ వున్నారు. యూదులు, క్రైస్తవ యూదులు కూడ అతనికి శత్రువులు. అతడు మాత్రం వారిపట్ల గూడ ఉదాత్తంగానే మెలిగాడు.

పౌలుజీవితంలో చాల ఘర్షణలు వున్నాయి. అతడు గ్రీకుయూద సంస్కృతులు రెండిటినీ జీర్ణంచేసికొన్నవాడు. ఈ రెండిటికీ ఘర్షణం వుండేది. ఇంకా తన జీవితంలోను తోడి క్రైస్తవుల జీవితాల్లోను గూడ మంచిచెడుల మధ్య, శరీరం ఆత్మల మధ్య, విశ్వాసం సత్క్రియలమధ్య ఘర్షణ చూచాడు. అతని ప్రేషిత సేవలో కూడ నిరంతరం పోరాటాలు ఎదరయ్యేవి. ఇన్ని ఆటుపోటులు ఎదురైనా అతని హృదయం మాత్రం శాంతితో నిండివుండేది. దేవుణ్ణి ప్రేమించే వాళ్లకు అన్ని సంఘటనలు మంచినే చేసిపెడతాయి అని అతని నమ్మకం - రోమా 8,28. క్రీస్తు ప్రేమనుండి ఏశక్తీ తన్ను వేరుపరచలేదని అతని విశ్వాసం - రోమా 6,35.

అతడు క్రీస్తుసేవలో ఎన్నో శ్రమలు అనుభవించాడు - 2కొరి 11,23-29. క్రీస్తు తిరుసభ కొరకు పడిన బాధల్లో వున్న కొదవను తన శ్రమల ద్వారా తీర్చాడు - కొలో 1,24.

పౌలు సహజజ్ఞానం వల్లనే క్రీస్తు మరణోత్థానాలశక్తినీ, ఉత్థాన క్రీస్తు క్రైస్తవులను ప్రభావితంజేసే తీరునూ గ్రహించాడు. అతనికి క్రీస్తే ముఖ్యం. "క్రీస్తునందు" అనేది అతని మంత్రం. క్రీస్తే నాయందు జీవిస్తున్నాడు అనేది అతని పదం. అతడు క్రీస్తు దాసుడు,

క్రీస్తు భక్తుడు. ఉత్థాన క్రీస్తే అతనికి ప్రేరణం పుట్టించాడు. అతని విజయరహస్యం ఇక్కడే వుంది. పౌలు క్రీస్తుతో ఐక్యం చెందిన ద్రష్ట. దైవరహస్యాలు గ్రహించిన తాత్వికుడు. నేటికీ క్రైస్తవ ప్రపంచంలో అతన్ని మించిన వేదాంతి లేడు. యోగి, సర్వసంగ పరిత్యాగి. తన శరీరాన్ని నలగగొట్టి అదుపులోకి తెచ్చుకొన్నవాడు -1కొరి 9,27.

క్రీస్తుపట్ల గాఢమైన భక్తివున్నా పౌలుకి మతమౌఢ్యం లేదు. అతడు తన భావాలు మాత్రమే ఆచరణీయమైనవి అనుకోలేదు. మంచి యెక్కడవున్నా స్వీకరించమన్నాడు - ఫిలి 4,8.

అతడు క్రీస్తుని సన్నిహితంగా అనుసరించాడు. ఆ ప్రభువు మరణోత్థానాలను తన జీవితంలోగూడ అనుభవించి దివ్యశక్తిని పొందాడు. తాను క్రీస్తుని అనుసరించినట్లే తన సమాజాల్లోని విశ్వాసులు కూడ తన్ను అనుసరించాలని కోరుకొన్నాడు - 1కొరి 11,1. అతని లేఖలు ఇప్పుడూ మనలను ప్రభావితం చేస్తున్నాయి. కాని ఆ లేఖలను మించింది అతని జీవితాదర్శం. ఆ యాదర్శం నేడు మనలను కూడ కదిలించాలి.

## 5. పౌలు ప్రాముఖ్యం

1. తొలినాటి క్రైస్తవులు పౌలు జాబుల విలువను గుర్తించి వాటిని సేకరించుకొని మక్కువతో చదువుకొన్నారు. ప్రాచీన వేదశాస్త్రులు అందరు ఈ లేఖలమీద వ్యాఖ్యలు వ్రాసారు. ఇప్పటి మన దైవశాస్త్రంలోని అనేకాంశాలను పౌలే మొట్టమొదటిసారిగా వెలిబుచ్చాడు. అతడు బోధించిన వేదసత్యాలు విశ్వాసులను ఎల్లకాలం ఉత్తేజపరుస్తూనే వుంటాయి.

2. అతడు క్రీస్తుని యూదుల పరిధినుండి తప్పించి

విశ్వమానవాళికి రక్షకుణ్ణిగా ప్రకటించాడు. క్రీస్తుమరణోత్థానాల శక్తిని, ఉత్థాన క్రీస్తు తిరుసభను ప్రేరేపించే తీరునూ విశదం చేసాడు. పౌలునుండి నేడు మనం క్రీస్తుపట్ల భక్తి ఏలా చూపాలో నేర్చుకొంటాం. జ్ఞానస్నానం ద్వారా, సత్ప్రసాదం ద్వారా క్రీస్తుతో ఏలా ఐక్యంగావాలో తెలిసికొంటాం. రోజువారి జీవితంలో క్రీస్తునుండి ఏలా ప్రేరణం పొందాలో అర్థంజేసికొంటాం. క్రీస్తు మనలో ఏలా వసిస్తున్నాడో తెలిసికొంటాం. క్రీస్తుపట్లభక్తి అలవర్చుకోగోరేవాళ్ల కందరికీ పౌలు జాబులు దీపస్తంభంలాగ దారి జూపుతాయి.

3. పౌలు క్రీస్తు జీవితాన్ని బోధలనూ సమన్వయపరచి తొలినాటి క్రైస్తవ సమాజంలో కొన్ని ఆచరణ పద్ధతులూ, దైవార్చనా పద్ధతులూ ఏర్పాటు చేసిపోయాడు. ఇప్పటికీ మనం ఈ సంప్రదాయాలనే అనుసరిస్తున్నాం. అతడు నేర్పిపోయిన విశ్వాససత్యాలనుండి ఇప్పుడు గూడ ప్రేరణం పొందుతూనేవున్నాం. కొందరు బైబులు పండితులు అతన్ని క్రైస్తవ మతానికి "రెండవ స్థాపకుడు" అని పిల్చారు. కనుక మన విశ్వాస జీవితంలో పౌలు ప్రాముఖ్యం అంతా యింతా కాదు.

4. పౌలు ప్రేషితసేవ, వేదబోధ, క్రైస్తవ సమాజాలను నెలకొల్పి వాటిని వృద్ధిలోకి తీసికొని రావడం, శిష్యబృందంతో కలసి పనిచేయడం, వేదవ్యాపకంలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవడం మొదలైన అంశాలు ఇప్పుడూ మనకు ప్రేరణం పుట్టిస్తాయి. వేదబోధకులందరికీ పౌలు ప్రేషితపద్ధతులు, పరిష్కారమార్గాలు ఇప్పుడుకూడ మార్గదర్శకంగా వుంటాయి.

5. తన జాబుల రీత్యాగూడ పౌలు గొప్పవాడు. మొదట వ్రాసిన పవిత్రగ్రంథాలు సువిశేషాలు కాదు, పౌలు జాబులు. ఇప్పుడు మనం నూత్నవేదంలో సువిశేషాలు మొదట వుండడం వల్ల అవే

తొలిగ్రంథాలు అనుకొంటాం. తొలినాటి క్రైస్తవులు సువిశేషాలకంటె ముందే పౌలుజాబులు చదివి భక్తివిశ్వాసాలు పెంచుకొన్నారు - 2పేతు 3,15-16. తర్వాత వచ్చిన సువిశేషాలు క్రీస్తుబోధలనూ కార్యాలనూ వర్ణిస్తాయి. పౌలు జాబులైతే క్రీస్తు ప్రాముఖ్యాన్ని - అనగా అతని మరణోత్థానాలనూ, నేడు ఆ ప్రభువు మన జీవితాన్ని ప్రభావితం చేసే తీరునూ వర్ణిస్తాయి. అందుచే అతని జాబులు అందరికీ శిరోధార్యాలు. అసలు క్రీస్తు చెప్పిందేమిటో, చేసిందేమిటో సువిశేషాలనుండి మనకు రూఢిగా తెలియదు. ఆ గ్రంథాల్లోకి చాలా మార్పులు వచ్చాయి. వాటిల్లో అపోస్తలులు చేసిన మార్పులు, ఆదిమ క్రైస్తవపమాజాలు చేసిన మార్పులు, సువిశేషరచయితలు చేసిన మార్పులు కన్పిస్తాయి. పౌలు జాబులు ఈ లాంటి మార్పులకు గురికాకుండ నేరుగా అతని చేతినుండి వచ్చిన స్వచ్ఛమైన రచనలు. కనుక వాటి విలువ యెక్కువ.

ఐనా నేటిమన క్యాతలిక్ ప్రజలకు పౌలు జాబులు అట్టే తెలియవు. మన బోధకులుగూడ ప్రసంగాల్లో పౌలు బోధలను అట్టే వివరించి చెప్పరు. అడపాదడపా అతని జాబులనుండి ఒకటిరెండు వాక్యాలు ఉదాహరించి ఊరకుంటారు. ఇది చాలదు. క్రైస్తవ జీవితమంటే ప్రధానంగా క్రీస్తుని జీవించడమే. పౌలు ముఖ్యబోధకూడా యిదే. కనుక మన విశ్వాసులు పౌలు జాబులను శ్రద్ధతో చదివి మననం చేసికొని క్రీస్తుపట్ల భక్తిప్రపత్తులు పెంచుకోవాలి.

## 2. పౌలు పూర్వరంగం

పౌలు భక్తుని భావాలను అర్థంజేసికోవాలంటే అతని నేపథ్యం బాగా తెలిసి వుండాలి. ఇక్కడ రెండంశాలు అతిముఖ్యం.

మొదటిది, అతడు యూద సంస్కృతిలో పుట్టిపెరిగినవాడు రెండవది, అతడు గ్రీకు సంస్కృతికి కూడ అలవాటు పడినవాడు.

## 1. యూదసంస్కృతి

పౌలు స్వచ్ఛమైన హెబ్రేయుడు. యూదమతాన్ని నిష్ఠతో పాటించే పరిసయుల శాఖలో పుట్టినవాడు - ఫిలి 3,5-6. యూద మతాన్ని పాటించడంలోను, పూర్వుల సంప్రదాయాలను అనుసరించడంలోను తోడియూదులను మించిన ఆసక్తి కలవాడు - గల 1,14. అతని జన్మస్థలం సిలీష్యాలోని తార్సునగరం. ఆనాడు ఆ పట్టణం యూద సంస్కృతికీ గ్రీకు నాగరకతకూ కూడ నిలయం. అతడు యెరూషలేములో ఆనాటి గొప్ప రబ్బియైన గమలియేలు వద్ద ధర్మశాస్త్రం చదువుకొన్నాడు-అచ22,3. ఆరోజుల్లో ఆ గురువుదగ్గర చదువుకొన్న శిష్యులకు ప్రత్యేకమైన హోదావుండేది. యెరూషలేములో పౌలుకి ఒక సోదరీ, మేనల్లుడూ వుండేవాళ్లు -23,16.

పౌలు హిబ్రూ అరమాయిక్ భాషలు తెలిసినవాడైనా గ్రీకు పూర్వవేదాన్నే ఎక్కువగా ఉపయోగించాడు. అతని రచనల్లో ఈ గ్రంథం నుండి 90 ఉదాహరణలు కన్పిస్తాయి. అతని ఆలోచనలకూ భావాలకూ గ్రీకు బైబులే పునాది. పూర్వవేదంమీద అతడు చెప్పే వ్యాఖ్యలు రబ్బయుల వ్యాఖ్యల పద్ధతిలో వుంటాయి. యూదమతం క్షుణ్ణంగా తెలిసినవాడు కావడం చేత భగవంతుడు యూదులను క్రైస్తవమతంలోకి రాబట్టడానికి అతన్ని సాధనంగా వాడుకొన్నాడు.

## 2. గ్రీకు సంస్కృతి

పౌలు జన్మించిన తార్సునగరం గ్రీకుసంస్కృతికి నిలయం.

వ్యాపార కేంద్రం. ఆరోజుల్లో ఇక్కడ విశ్వవిద్యాలయం వుండేది. స్టొయిక్ శాఖకు చెందిన గ్రీకు తాత్వికులు వుండేవాళ్ళు. పౌలు మాతృభాష అరమాయిక్ ఐనా గ్రీకు భాషను క్షుణ్ణంగా నేర్చుకొన్నాడు. అతనికి గ్రీకు వక్తృత్వకళలో ప్రావీణ్యం వుంది. అతడు కొన్నిసార్లు "డియాట్రిబ్" అనే స్టొయిక్ వక్తృత్వ విధానాన్ని వాడుతుంటాడు. ఓ ప్రత్యర్థిని ఊహించుకుని అతనితో వాదిస్తున్నట్లుగా వ్రాయడమే ఈ విధానం. పౌలు తన ఆతెన్సు ఉపన్యాసంలో గ్రీకు కవులను గూడ ఉదాహరించాడు-అచ17,28. క్రీస్తు తన బోధల్లో గలిలీ రాష్ట్రపు వ్యవసాయానికి చెందిన పదాలు భావాలు వాడాడు. పొలం-విత్తనాలు, పూలు, చేపలు పట్టడం మొదలైనవి అతని పదాలు. పౌలు గ్రీకు పట్టణసంస్కృతికి చెందిన భావాలు వాడాడు. క్రీడలు, న్యాయశాస్త్రం, వ్యాపారశాస్త్రం, సద్గుణాలు, అంతరాత్మ మొదలైన భావాలు అతని జాబుల్లో వస్తాయి. అతని జాబుల చివరలో వచ్చే నీతిబోధలు స్టొయిక్ తాత్వికుల బోధలనుతలపిస్తుంటాయి. పౌలు గ్రీకు ప్రజలకు క్రీస్తుని బోధించాలి. పేత్రు యూదులకులాగే అతడు అన్యజాతివారికి ప్రేషితుడు-గల 2,7. కనుక భగవంతుడు అతనికి ముందుగనే గ్రీకు భాషతోను సంస్కృతితోను పరిచయం కలిగేలా చేసాడు. అతడు తన జాబుల్లో వాడింది కోయినే అనబడే వ్యావహారిక గ్రీకుభాష.

## 3. డమస్కు దర్శనం

పౌలు యెరూషలేములోని క్రైస్తవులను బాధించాడు. డమస్కులోని విశ్వాసులను గూడ హింసించడానికి ఆ పట్టణానికి వెళ్తున్నాడు. ఆ రెండు నగరాలకు మధ్యదూరం 140 మైళ్ళు. అది

క్రీ.శ. 36. డమస్కుత్రోవలో ఉత్థానక్రీస్తు గొప్ప వెలుగురూపంలో పౌలుకి దర్శనమిచ్చాడు. మిరుమిట్లుగొల్పే ఆ వెల్తురు తండ్రి తేజస్సే. అనగా తండ్రి సాన్నిధ్యం. తండ్రే క్రీస్తుని పౌలుకి ప్రత్యక్ష్యం జేసాడు-అచ 9,1-19. ఈ దర్శనం పౌలు జీవితాన్ని పూర్తిగా మార్చి వేసింది. మామూలుగా ఈ దర్శనాన్ని సౌలు "పరివర్తనం" అని పిలుస్తారు. కాని యథార్థంగా అతనికి యిక్కడ కలిగింది "పరివర్తనం" కాదు, మార్పు మాత్రమే. అతడు మనలాగ పాపియైయుండి పరివర్తనం చెందలేదు. పౌలు, యూదమతాన్ని ధర్మశాస్త్ర నియమాలనూ నిష్ఠతో పాటించినవాడు. యూదుల భావాల ప్రకారం పుణ్యాత్ముడు, పవిత్రుడు-గల1,14. ఈ దర్శనం వల్ల పౌలు యూదమతం నుండి క్రైస్తవమతంలోకి వచ్చాడు. క్రీస్తుకి ప్రత్యర్థియైనవాడు అతనికి సేవకుడు అయ్యాడు. అతనిలో కలిగిన మార్పు ఇదే.

పూర్వం పౌలు క్రైస్తవులను ఘోరంగా హింసించాడు -అచ8,3. కాని అతడు క్రైస్తవులను ఎందుకు హింసించాడో అర్థంజేసికోవాలి.

1. క్రైస్తవులు యేసు మెస్సియా అని వాదిస్తున్నారు-అచ 2,36. కాని ధర్మశాస్త్రం సిలువపై చనిపోయినవాడు శాపగ్రస్తుడు అని చెప్తుంది-ద్వితీ 21,22-23. శాపగ్రస్తుడైన యేసు మెస్సియా ఏలాగౌతాడు? కను యేసుని మెస్సియాగా ప్రకటించేవారిని పట్టి రూపుమాపాలి.

2. క్రైస్తవులు క్రీస్తుని "ప్రభువు" అంటున్నారు. ఈ పదం పూర్వవేదంలో యావే ప్రభువుకి బిరుదం. యేసు ప్రభువైతే యావేకు సరిసమానుడు, దేవుడు. యూదులకు దేవుడు ఒక్కడే. ఈ రెండవ దేవుణ్ణి ప్రచారం జేసే క్రైస్తవులు దేవదూషకులు. కనుక వారి శాఖను మొగ్గలోనే త్రుంచివేయాలి.

3. స్తెఫను క్రీస్తు దేవాలయాన్ని నాశం జేస్తాడనీ, ధర్మశాస్త్రాన్ని మార్చివేస్తాడనీ బోధించాడు-అచ 6,14. దేవాలయం ధర్మశాస్త్రం యూదులకు పరమపవిత్రమైనవి. ఈలాంటి బోధలు చేసే క్రైస్తవులను అడపొడ కానరాకుండా చేయాలి.

4. యూదులు మెస్సియా మహిమప్రతాపాలతో వచ్చి లోకాన్ని జయించి యూదసామ్రాజ్యాన్ని స్థాపిస్తాడు అనుకొన్నారు. కాని క్రీస్తు నీచాతినీచమైన సిలువ మరణాన్ని అనుభవించాడు. అతడు మెస్సియా కాలేడు. కనుక క్రైస్తవులది అసత్య ప్రచారం.

ఈలాంటి భావాలతో పౌలు విశ్వాసులను హింసించాడు. అతడు ధర్మశాస్త్రం పట్ల నిష్ఠ అభినివేశం కలవాడు. కనుక క్రైస్తవులను హింసించడంవల్ల తాను దేవునికి ప్రీతి కలిగిస్తున్నాను అనుకొన్నాడు - అచ 8,3.

డమస్కు దర్శనం వల్ల పౌలుకి చాలా నూత్నాంశాలు లోతైన భావాలు తట్టాయి. ఇక్కడ కొన్నిటిని పరిశీలిద్దాం.

1. యేసు మెస్సీయా, ప్రభువు. యావే ప్రభువుకి సరిసమానం. అతడు నరులకు పవిత్రాత్మను దయచేసేవాడు -అచ 9,17. వారి పాపాలను నిర్మూలించేవాడు-22,16. ఈ క్రియలను దేవుడు మాత్రమే చేయగలడు. కనుక అతడు దేవునికి సరిసమానం. అందుకే పౌలు అతనికి "ప్రభువు" అన్న బిరుదాన్ని తరచుగా వాడుతూంటాడు.

2. యూదులు మెస్సియా కొని వచ్చే నూత్నయుగం కొరకు ఎదురు చూస్తున్నారు. ఆ యుగంలో మెస్సీయా పాపాన్నీ మృత్యువునీ తొలగించి సకల సౌభాగ్యాలు చేకూర్చి పెడతాడు అనుకొన్నారు. పౌలు క్రీస్తు ఉత్థానంతో ఈ నూత్నయుగం ప్రారంభ మైందని గుర్తించాడు. కనుకనే యుగాంతం ఆసన్నమైందని వ్రాసాడు - 1కొరి 10,11.

3. పరిసయులు ధర్మశాస్త్రం ఆదేశించిన పుణ్యక్రియలు చేయడంద్వారా రక్షణం పొందుతామని భావించారు. తాము పుణ్యక్రియలు చేస్తున్నారు కనుక దేవుడు తమ్ము రక్షించి తీరాలనీ, అతడు తమకు ఋణపడి వున్నాడనీ ఎంచారు. అనగా రక్షణం నరులే స్వయంగా సాధించేది. పౌలు ఈ భావాన్ని ఖండించాడు. అతనికి క్రీస్తులోనికి జ్ఞానాస్నానం పొందడం ద్వారా పాపపరిహారమూ, ఆత్మ ప్రదానమూ, దత్తపుత్రత్వమూ మొదలైన భాగ్యాలు ఉచితంగానే లభించాయి. కనుక మనలను రక్షించేది క్రీస్తు పట్ల విశ్వాసమేగాని ధర్మశాస్త్రంలోనిఆజ్ఞలను పాటించడంగాదని బాహాటంగా ప్రకటించాడు. రక్షణం దేవుడిచ్చే ఉచితవరంగాని మన కృషిని బట్టీ మన యోగ్యతను బట్టీ సిద్ధించేది కాదు అని బోధించాడు.

4. యూదులు ధర్మశాస్త్రం పాటించేది తామే కనుక రక్షణం గూడ తమకే పరిమితం ఔతుందనుకొన్నారు. అన్యజాతి ప్రజలు నాశమైపోతారు అని భావించారు. పౌలు క్రీస్తుని నమ్మితేచాలు అన్యజాతులకు కూడ రక్షణం లభిస్తుందని తెలియజేసాడు. తాను అన్యజాతులకు ప్రేషితుడనని సగర్వంగా చెప్పుకొన్నాడు - రోమా 11,13.

5. పౌలు మొదట సిలువపై చనిపోయిన క్రీస్తు శాపగ్రస్తుడు అనుకొన్నాడు - ద్వితీ 21,23. కాని ఈ దర్శనం తర్వాత అతని ఆలోచన మారింది. క్రీస్తేమో శాపగ్రస్తుడే. కానీ తన పాపాల కొరకు గాక మన పాపాల కొరకు శాపగ్రస్తుడు అయ్యాడు. అతడు సిలువపై చనిపోవడం ద్వారా మన పాపాల శాపాన్ని తాను స్వీకరించి మనలను విముక్తులను చేసాడు-గల 3,13. ఆ విమోచనాన్ని పౌలు ఉత్సాహంతో బోధించాడు.

6. ఉత్థాన క్రీస్తు సౌలూ నీవు నన్నెందుకు హింసిస్తున్నావని ప్రశ్నించాడు-అచ 9,4. అతడు హింసించింది క్రైస్తవులని. కనుక క్రీస్తు క్రైస్తవ సమాజంలో నెలకొని వున్నాడని పౌలు గ్రహించాడు. క్రైస్తవ సమాజం (తిరుసభ) క్రీస్తుదేహం అనివ్రాసాడు. ఇక్కడ "దేహం" అంటే వ్యక్తి. క్రీస్తులోనికి జ్ఞానస్నానం పొందిన వాళ్లంతా అతనితో ఐక్యమై అతనితో పాటు ఏకవ్యక్తిగా తయారౌతారు. ఇదే జ్ఞానశరీరం. ఈ శరీరానికి క్రీస్తు శిరస్సు, విశ్వాసులంతా అవయవాలు. ఇది పౌలు బోధల్లో ఓ ముఖ్యాంశం.

7. రక్షణ చరిత్రలో మూడు దశలున్నాయి. మొదటిదశ, అబ్రాహామునుండి మోషే వరకు. ఈ దశలో ధర్మశాస్త్రం లేదు. అంతరాత్మ హెచ్చరికల ప్రకారం జీవించినవాళ్లంతా రక్షణాన్ని పొందారు. రెండవదశ, మోషేకాలం నుండి మెస్సీయా వచ్చేవరకు. ఈ దశలో ధర్మశాస్త్ర నియమాలను పాటించినవాళ్లు రక్షణం పొందారు. మూడవదశ మెస్సీయా కాలంనుండి లోకాంతం వరకు. ఈ దశలో మెస్సీయా ఆజ్ఞలను పాటించినవాళ్లు రక్షణం పొందుతారు. పౌలు మొదట్లో ఈ మూడవదశ ఎప్పుడో భవిష్యత్తులో వస్తుంది అనుకొన్నాడు. కాని డమస్కు దర్శనం వల్ల ఈ మూడవ దశ క్రీస్తు ఉత్థానంతోనే ప్రారంభమైందని గ్రహించాడు. కనుక తాను అవశ్యం క్రీస్తుని బోధించాలి. యూదులూ అన్యజాతి ప్రజలూ కూడ అతన్ని విశ్వసించేలా చేయాలి. అందుకే సువార్తను బోధించకపోతే నా పరిస్థితి దారుణమౌతుంది అని వ్రాసాడు-1కొరి 9,16.

8. పూర్వ నూత్న వేదాలకు సంబంధం వుంది. పూర్వవేదంలోని యావే ప్రభువే ఇప్పుడు క్రీస్తు ద్వారా రక్షణాన్ని ప్రసాదిస్తున్నాడు. ఆ తండ్రీకుమారులను విడదీయకూడదు. వాళ్లిద్దరు కలిసే పనిచేస్తారు.

9. యావే ప్రభువు మొదటిసారి వెలుగును కలిగించాడు -ఆది 1,3. అతడు మళ్లా రెండవసారి వెలుగును పుట్టించాడు. ఆ రెండవ వెలుగు ఉత్థానక్రీస్తు రూపంలో పౌలుపై సోకింది. అతడు నూత్ననరుడు అయ్యాడు. ఇదే డమస్కు దర్శనం భావం - 2కొరి 4,6.

10. డమస్కు దర్శనం ద్వారా పౌలు అపోస్తలుల వర్గానికి చెందినవాడు అయ్యాడు. ఉత్థాన క్రీస్తుని దర్శించి వుండడం, అతనిచే వేదబోధకు పంపబడ్డం అపోస్తలుడి లక్షణాలు - 1కొరి 15.5-8. ఈ రెండు లక్షణాలు పౌలులో నెరవేరాయి.

డమస్కు దర్శనానికి ముందు పౌలు క్రైస్తవులను హింసించాడు. కాని ఆదర్శనంవల్ల తాను క్రీస్తు భక్తుడై అతన్ని బోధించాడు. అందుచే యూదులు అతన్ని హింసించారు. అనగా హింసకుడు మార్పుచెంది హింసితుడు అయ్యాడు - అచ 9,23-30.

ఇక యీదర్శనంలో కొన్ని వ్యక్తిగతమైన అంశాలు కూడ వున్నాయి. అవి యివి.

1. పౌలు తనకు ఈలాంటి దర్శనం కలుగుతుందని ముందుగా ఊహించలేదు. అతడు క్రైస్తవులను మట్టుపెట్టే ప్రయత్నంలో వున్నాడు. దిడీలున క్రీస్తు దర్శనం కలిగింది. మనం ఊహించనపుడు భగవంతుని సహాయం లభిస్తుంది.

2. ఒకవైపు పౌలు క్రైస్తవులను వేటాడుతున్నాడు. మరోవైపు క్రీస్తు పౌలుని వేటాడుతున్నాడు. వేట వేటగానికి చిక్కినట్లుగా పౌలు క్రీస్తుకి చిక్కాడు - ఫిలి 3,12.

3. క్రీస్తుని హింసించేవాడు క్రీస్తు భక్తుడు అయ్యాడు. అతడు కొన్ని సిద్ధాంతాల పట్లగాక, క్రీస్తు అనే వ్యక్తి పట్ల ఆకర్షితుడు అయ్యాడు. అతనికి ప్రేరణం పుట్టించింది ఉత్థాన క్రీస్తు. ఆ క్రీస్తుతో

పోలిస్తే అతనికి లోకంలోని వస్తువులన్నీ పెంటప్రోవులాగ విలువలేనివి అన్పించాయి - ఫిలి 3,8.

4. ప్రభువు అతన్ని యూదులకూ అన్యజాతులకూ గూడ తన్ను బోధించమని ఆజ్ఞాపించాడు -అచ 9,15. అతని పిలుపు యిర్మీయా ప్రవక్త పిలుపు లాంటిది-యిర్మీ 1,5. బాధామయ సేవకుని పిలుపు లాంటిది - యెష 49,1.

5. డమస్కు పిలుపు పౌలుని బాగా ప్రభావితం చేసింది. అది మోషే పిలుపులాంటిది. అతని ప్రేషిత సేవకు ప్రేరణం ఈ పిలుపునుండే వచ్చింది. ఆ సేవలో అతనికి ఎదురైన కష్టాలను అనుభవించే శక్తి కూడ ఈ పిలుపునుండే వచ్చింది. దైవానుభూతి చెందిన నరులు ఆ దేవుని కొరకు మహాకార్యాలు సాధిస్తారు. మన పిలుపులో డమస్కు దర్శనం లాంటి లక్షణం ఏదైన వుందేమో పరిశీలించిచూచుకొందాం.

## 4. రక్షణప్రణాళిక తండ్రినుండే

మనం మామూలుగా క్రీస్తు మనలను రక్షించాడు అంటాం. కాని క్రీస్తు తనంతటతాను రాలేదు. తండ్రి పంపగా వచ్చాడు. ఆదాము పాపంవలన నాశమైపోయిన నరజాతిని రక్షించాలని కోరుకొందీ, ఆ రక్షణం రెండవ వ్యక్తియైన సుతునిద్వారా జరగాలని నిర్ణయించిందీ తండ్రి. ఆ తండ్రి నిర్ణయం ప్రకారం సుతుడు యేసుగా జన్మించి మనలను రక్షించాడు. కనుక రక్షణ చరిత్రను పరిశీలించేటప్పుడు తండ్రి ప్రాముఖ్యాన్ని గూడ గుర్తించాలి. పౌలు తన జాబుల్లో ఈ తండ్రిని పదేపదే పేర్కొంటూంటాడు.

కాలం పరిపక్వమైననపుడు దేవుడు మానవులను రక్షించడానికి తన కుమారుని పంపాడు - గల 4,4. అతన్ని

కరుణాఫలకంలాగ సిలువపై ప్రదర్శించాడు -రోమా 3,25. అనగా క్రీస్తు సిలువపై తన రక్తాన్ని చిందించి మనకు పాపపరిహారం చేసి పెట్టాడు. చనిపోయిన క్రీస్తుని ఉత్థానం చేసింది తండ్రే- 1 తెస్స 1,10. తండ్రి క్రీస్తు మరణం ద్వారా నరులందరినీ తనతో రాజీపరచుకొన్నాడు - 2కొరి 5,19. మనం పాపులమై యుండగా క్రీస్తు మనకొరకు చనిపోయాడు అంటే దేవునికి మనపట్ల ఎంత ప్రేమవుందో విశదమౌతుంది -రోమా 5,8. ఈ యాలోకనాలను బట్టి రక్షణం మొదట తండ్రినుండి కలిగింది అనుకోవాలి. ఈ తండ్రికి పౌలు మోకరిల్లి నమస్కారం చేసాడు - ఎఫె 3,14.

పౌలు తన జాబుల్లో దేవుని రహస్య ప్రణాళికను గూర్చి మాటలాడుతుంటాడు - ఎఫె 3,3-4. తండ్రి క్రీస్తుద్వారా పాపులైన నరులను రక్షించాలని సంకల్పించుకోవడమే ఈ రహస్య ప్రణాళిక. ఈ ప్రణాళిక క్రీస్తు రాకపూర్వం కొందరు భక్తులకు మాత్రమే తెలుసు. దేవుడు దాన్ని క్రీస్తు మరణోత్థానాలకాలం వరకు రహస్యంగా దాచివుంచాడు. ఇప్పుడు డమస్కు దర్శనంవల్ల పౌలు ఈ ప్రణాళికను లోతుగా అర్థంచేసికొన్నాడు. క్రీస్తుద్వారా మనకు పాపపరిహారమూ సంపూర్ణ రక్షణమూ లభించాయని తెలిసికొన్నాడు - రోమా 16,25-26.

## పౌలు సువార్త

పౌలు తరచుగా తాను బోధించే సువార్తను గూర్చి మాటలాడుతూంటాడు. అది క్రీస్తును గూర్చిన సువార్త. తాను దాన్ని బోధించాడు కనుక కొన్ని పర్యాయాలు దాన్ని "నా సువార్త" అని కూడ చెప్తుంటాడు- రోమా 2,16. ఈ సువార్త అంతా క్రీస్తుని గూర్చే. దానిలో ఆరు అంశాలు వున్నాయి. అవి క్రీస్తు శ్రమలు, మరణం,

భూస్థాపనం, ఉత్థానం, మోక్షారోహణం, మోక్షక్రీస్తు ప్రార్థనం. పౌలు క్రీస్తు జీవితంలోని ఈ సంఘటనలు అన్నిటినీ ప్రజలకు బోధించాడు. అవే యిప్పుడు మనకు రక్షణను చేకూర్చి పెట్టేది.

పౌలు ఈ సువార్తను బోధించే సేవకుడు-ఫిలి 2,22. అతడు యిర్మీయా మొదలైన పూర్వప్రవక్తల్లాగ సువార్త బోధకై ప్రత్యేకింపబడిన వాడు-గల1,15, రోమా 1,1. సువార్తను బోధించే భారం క్రీస్తు అతనిమీద మోపాడు - 1కొరి 9,16. అతని దృష్టిలో సువార్తబోధ యాజకుడు దేవళంలో నిర్వహించే దైవార్చనలాంటిది. అనగా గురువు పూజబలిని సమర్పించడం లాంటిదని భావం. అతడు తన సువార్త బోధ ద్వారా అన్యజాతి ప్రజలనే బలిని దేవునికి సమర్పించాడు - రోమా 15,16. ఆలాంటి పవిత్రమైన సువార్త సేవను గూర్చి అతడు ఏనాడు సిగ్గుపడలేదు - రోమా 1,16. అతడు దేవుని రహస్యసత్యాలను ప్రజలకు పంచిపెట్టే గృహనిర్వాహకుడు - 1కొరి 4,1. ప్రజలు ఈ సువార్త సందేశాన్ని ఆహ్వానించాలి, శ్రద్ధతో వినాలి, దానికి విధేయులు కావాలి - రోమా 1,5. ఈ సువార్త ఎల్లరికి రక్షణనిచ్చే దేవుని శక్తి - రోమా 1,16. నరులు విశ్వసిస్తే చాలు అది యూదులనైనా అన్యులనైనా రక్షించగలదు. యెరూషలేము సమాజానికి మూల స్తంభాలైన పేతురు యాకోబు యోహానులు దేవుడు పౌలుకి ఒసగిన ఈ సువార్త సేవావరాన్ని గుర్తించారు -గల 2,9. పౌలు ఈ సువార్తను ప్రకటించడమే తన జీవితధ్యేయంగా పెట్టుకొన్నాడు.

ఈ సువార్తనే పౌలు దైవరహస్యం లేక రక్షణ ప్రణాళిక అని పిలుస్తుంటాడు (Mystery). రోమా 16,25-26, కొలో 1,25-27, ఎఫె 3,12 ఆలోకనాలు పరిశీలిస్తే ఈ రహస్య ప్రణాళికలోని లక్షణాలు బోధపడతాయి. అవి యివి. పూర్వమే

దేవుడు ఈ ప్రణాళికను నిర్ణయించాడు. కాని ఆదిమకాలంలో దాన్ని గుప్తంగా వుంచాడు. అటుతర్వాత ప్రవక్తలద్వారా, అపోస్తులుల ద్వారా దాన్ని బయలుపరచాడు. యూదులు అన్యజాతివాళ్లు కూడ క్రీస్తు నుండి రక్షణం పొందాలనేదే ఈ ప్రణాళిక. ఇప్పుడు దేవుడు పౌలుకి ఈ రహస్య ప్రణాళికను తెలియజేసాడు. దాన్ని ఎల్లరికి బోధించడానికి అతన్ని నియమించాడు. కనుక నరులు పౌలు బోధను వినాలి.

# 5. క్రీస్తు రక్షణం

క్రీస్తు తన మరణోత్థానాల ద్వారా మనలను రక్షించాడు. ఈరక్షణాన్ని పౌలు నానావర్ణనలతోను ఉపమానాలతోను వివరించాడు. తండ్రి క్రీస్తురక్షణం మన మీద పలువిధాలుగా, సోకేలా చేసాడు. కనుక తండ్రీ క్రీస్తూ ఇద్దరూ మనకు రక్షకులే. పౌలు వివరించిన రక్షణకార్యాన్ని పది అంశాల క్రింద విభజించి చూడవచ్చు. ఇక ఈ విషయాలను క్రమంగా పరిశీలిద్దాం.

## 1. నరులను నీతిమంతులను జేయడం

క్రీస్తు రక్షణం నరులను నీతిమంతులనుగా, అనగా దోషరహితులనుగా చేసింది. ఈ భావాన్ని విపులంగా పరిశీలిద్దాం.

ఇక్కడ "నీతి" అంటే నిర్దోషత్వం, పాపరాహిత్యం. ఈ నీతికి హీబ్రూలో "సెడెకా"అనీ, గ్రీకులో "దికాయొసునీ" అనీ, ఇంగ్లీషులో Justification అనీ పేర్లు. మొదట పూర్వవేద భావాలను పరిశీలిద్దాం.. హీబ్రూ బైబుల్లో "నీతిమంతుడు" అంటే న్యాయస్థానంలో న్యాయాధిపతి నిర్దోషి అని తీర్పుచెప్పినవాడు. అలాంటి నరుడు దోషరహితుడు. ఈలాగే యావే ప్రభువు ధర్మశాస్త్ర ఆజ్ఞలను పాటించినవాళ్లను నిర్దోషులనుగా గణిస్తాడు. తన

నిబంధనను పాటించేవాళ్లను పాపరహితులనుగా ఎంచుతాడు. ఈ సందర్భంలో ఒకానొక కుమ్రాను భక్తుని ప్రార్థన యిది.

"నేను దుర్మార్గుల వర్గానికి చెందినవాణ్ణి
నా పాపాలవల్లనే నేను పురుగులకు మేత అయ్యాను
చీకటిలో నడచాను
ఏ నరుడూ స్వయంగా నీతిమార్గాన నడవలేడు
దేవుడే అతన్ని ధర్మమార్గాన నడిపించాలి
నేను బలహీనతవల్ల పాపంలో పడిపోతే
నీతిమంతుడైన దేవుడే నన్ను నిర్మలుణ్ణి చేయాలి".

ఇక, పౌలు ఈ నీతి అనే భావాన్ని క్రైస్తవులకు వర్తింపజేసాడు. డమస్కు దర్శనం అతనికి వెలుగును ప్రసాదించింది. దానివల్ల అతడు నరులంతా పాపులనీ క్రీస్తు వారి పాపాలను తొలగించి వారిని నీతిమంతులను చేస్తాడనీ గ్రహించాడు. నరుడు నీతిమంతుడు అయ్యాడు అంటే దేవుడు అతడు నిర్దోషి అని తీర్పు చెప్పాడు అని భావం. క్రీస్తు మరణోత్థానాలు అతని పాపాన్ని పరిహరించాయి. అతని పాపాలు తొలగిపోయింది ధర్మశాస్త్రాన్ని పాటించడం వల్ల కాదు, క్రీస్తు మరణోత్థానాల వల్ల. తండ్రి క్రీస్తురక్షణం మనకు వర్తించేలా చేసాడు. అతడు క్రీస్తుని మన పాపాల కొరకు మరణానికి అప్పగించాడు. మనలను నీతిమంతులను చేయడానికి అతన్ని మరల లేపాడు-రోమా 4,25. క్రీస్తుని విశ్వసించినవారిని తండ్రి నీతిమంతులను జేసి తన కుమారులనుగా గణించాడు - గల 3,26. మనంతట మనం నీతిమంతులం కాలేము. దేవుడే క్రీస్తుద్వారా మనలను పాపరహితులను చేయాలి. అది మనకు ఉచితంగా లభించే భాగ్యం -రోమా 10,3. ఆ భాగ్యం మన కృషివల్లగాక దేవుని మంచితనం వల్లనే లభిస్తుంది. మన తరపున మనకు కావలసింది

క్రీస్తుపట్ల విశ్వాసం - గల 2,15-16. ఈ విశ్వాసం లేందే పాపపరిహారాన్ని పొందలేం - రోమా 3,25.

## 2. నరులు రక్షణాన్ని పొందడం

రక్షణానికి హీబ్రూలో "యాషా" అనీ గ్రీకులో "సోతెరియా" అనీ పేర్లు. క్రీస్తు తన సిలువ మరణంద్వారా మనకు పాపవిముక్తిని కలిగించి రక్షకుడు అయ్యాడు.

పూర్వవేదంలో యావే యిస్రాయేలుకి దాస్యవిముక్తి కలిగించి రక్షకుడు అయ్యాడు -నిర్గ 14,13. ఇంకా అతడు గిద్యోను, సంసోను, యెఫ్తా మొదలైన న్యాయాధిపతుల ద్వారా యిస్రాయేలును అన్యజనుల నుండి రక్షించాడు. ఈ దృష్టిలో ఈ నాయకులు కూడ రక్షకులే.

పైగా, గ్రీకు రోమను మతాల్లో సేయస్ అపొల్లో, ఆర్టెమిస్, ఎస్క్లేపియస్ మొదలైన దేవతలను రక్షకులు అని పిల్చేవాళ్లు. వాళ్లు వ్యాధులు, తుఫానులు, కరువుకాటకాలు మొదలైన వాటినుండి తమ భక్తులను రక్షించేవాళ్లు. పౌలుకి ఈసంప్రదాయం తెలుసు. కాలక్రమేణ రక్షణం అంటే నరుడు ఒక దేవతద్వారా ఆపదనుండి తప్పించుకోవడం అనే భావం రూఢమైంది. ఈ యాపదలు శారీరకం, మానసికం, ప్రకృతి వైపరీత్యం, పాపసంబంధం మొదలైనవి ఏవైనా కావచ్చు.

ఇక పౌలు ఈ రక్షణభావాన్ని క్రీస్తుకి అన్వయించాడు. ఆ ప్రభువు తన సిలువమరణం ద్వారా మనలను రక్షించాడు. క్రీస్తు చిందించిన నెత్తురు ద్వారా మనకు పాపంనుండి విమోచనం కలిగింది. పౌలు బోధించే సువార్త మనలను పాపంనుండి రక్షిస్తుంది - రోమా 1,16. ఈ రక్షణం ఒక్క యూదులకే గాక క్రీస్తుని విశ్వసించే వాళ్లకు అందరికీ లభిస్తుంది. భూలోకంలో జీవించే మన రక్షణం

కొరకు క్రీస్తు స్వర్గంలో తండ్రిని మనవి చేస్తుంటాడు- రోమా 8,34. రక్షణం మన పుణ్యక్రియల వల్ల లభించదు. క్రీస్తు పట్ల మనకున్న విశ్వాసం వల్ల లభిస్తుంది. అది దేవుడు మనకు ఉచితంగా యిచ్చే వరం-ఎఫె 2,8-10.

రక్షణం క్రీస్తురాకడతోనే ప్రారంభమైంది. కాని అది పరలోకంలోగాని ముగియదు. ఇప్పుడు మనం పొందేది పాక్షిక మైన రక్షణం మాత్రమే. సంపూర్ణ రక్షణం ప్రభువు రెండవసారి విజయం చేసినపుడు లభిస్తుంది. కనుక మనం క్రీస్తు రెండవరాకడ కొరకు ఎదురుచూస్తుండాలి - ఫిలి 3,20. ఇప్పుడు మనం ఆశద్వారా మాత్రమే రక్షణం పొందుతాం. పూర్తిరక్షణం తర్వాత వస్తుంది.

రక్షణం దేవుడు ఇచ్చేదైనా మన సహకారం గూడ అవసరం. కనుకనే పౌలు మీరు భయంతో గడగడ వణుకుతూ మీ రక్షణాన్ని సంపాదించుకోండి అన్నాడు - ఫిలి 2,12. అందుచే మన తరపున మనం సోమరితనంగా కాలం గడపకూడదు. ఇప్పుడే రక్షణకాలం - 2కొరి 6,2. ఇక్కడున్న అవకాశాలను వినియోగించుకొని రక్షణాన్ని పొందాలి. దాన్ని సంపాదించుకోకపోతే మన జీవితం వ్యర్థమైనట్లే.

అన్ని మతాల్లో రక్షణం అనే భావంవుంది. హిందువులు దాన్ని "ముక్తి" అంటారు. అనగా పునర్జన్మను విడిపించుకొని దేవుణ్ణి చేరడం.

## 3. నరులు దేవునితో రాజీపడ్డం

రాజీ పడ్డానికి గ్రీకుమాట "కటల్లాగే". గ్రీకు రోమను మతాల్లో దేవతలు నరులు ఒకరితో ఒకరు సఖ్యపడ్డం కన్పిస్తుంది. దీనివలన విరోధులు మిత్రులౌతారు. దూరపువాళ్లు దగ్గరివాళ్లే ఔతారు.

పౌలు ఈ భావాన్ని క్రీస్తుకి అన్వయించాడు. దేవుడు పాపం

మూలాన తనకు విరోధులైన నరులను క్రీస్తు మరణం ద్వారా మళ్లా తనతో రాజీ పరచుకొన్నాడు -2కొరి 5,18-19. కుమారుని మరణం ద్వారా తండ్రి నరులను తన మిత్రులనుగా చేసికొన్నాడు. అనగా వారిని తనతో సమాధాన పరచుకొన్నాడు -రోమా 5,10-11. పాపులైన నరులు తమంతట తాము దేవునితో రాజీపడలేదు. కనుక దేవుడే ఆ పనికి పూనుకొని వారిని తనతో రాజీపరచుకొంటాడు. ఆ కార్యాన్ని ప్రారంభించేది నరుడు కాదు, దేవుడు.

ఈ సమాధాన క్రియ రెండు మెట్లుగా జరిగింది. మొదటి మెట్టులో ప్రజలు దేవునితో సమాధాన పడ్డారు. రెండవ మెట్టులో ప్రజలు తమతో తాము రాజీపడ్డారు. క్రీస్తు రాకముందు యూదులు అన్యజాతి ప్రజలు పరస్పరం విరోధులు. గ్రీకు రోమను ప్రజలు దేవుని ప్రజలు కారు. సీనాయి నిబంధనంలో వారికి పాలు లేదు. వాళ్లు యావేను పూజించలేదు. ఈ దృష్టిలో వాళ్లు యూదులకు విరోధులు. ఆ వుభయవర్గాలమధ్య అడ్డుగోడ వుంది. క్రీస్తు వచ్చి ఆయడ్డుగోడను పడగొట్టి ఉభయవర్గాలను కలిపివేసాడు. వారి మధ్య శాంతి నెలకొల్పాడు. ఈ శాంతి అతడు చిందించిన సిలువ రక్తం ద్వారా ఏర్పడింది. ఈరీతిగా ఓవైపు దేవునితో, మరోవైపు తోడినరులతో రాజీ యేర్పడింది -ఎఫె 2,14-16.

ఈ సఖ్యత ఒక్క నరజాతితోనే గాక లోకంలోని పశుపక్ష్యాది ప్రాణులతో గూడ కలిగింది. కనుక సృష్టి వినాశంనుండి తప్పించుకొని స్వాంతంత్ర్యాన్ని పొందింది. అనగా నరులతో పాటు భౌతిక ప్రపంచంగూడ దేవునితో రాజీపడిందని భావం-రోమా 8,21.

దేవుడు ఇప్పుడు నరులను తనతో సఖ్యపరచుకొనే పనిని, సఖ్యతా సందేశాన్ని పౌలుకి అప్పగించాడు. కనుక అతడు క్రీస్తుకి రాయబారి. అతడు మీరు దేవునితో రాజీపడండని ప్రజలను బ్రతిమాలుతున్నాడు -2కొరి 5,18-20.

ఈ సమాధాన ప్రక్రియలో మూడు దశలు వున్నాయి. మొదటిది, దేవుడే రాజీ ప్రక్రియకు పూనుకొన్నాడు. రెండవది, పౌలులాంటి బోధకులు దేవునితో సమాధానపడమని ప్రజలకు బోధించారు. వారి హృదయాలను సిద్ధం జేసారు. మూడవది, ఈ బోధవలన ప్రజలు పరివర్తనం చెంది దేవుని నుండి పాపక్షమాపణం వేడుకొన్నారు. దేవుడు వారిని కరుణించి క్రీస్తుద్వారా వారి పాపాలు మన్నించాడు.

ఇప్పుడు మనజీవితంలో కూడ ఇదే జరుగుతుంది. మనం దేవునితో సమాధానపడి తోడి నరులను కూడ ఆ ప్రభువుతో రాజీపరచాలి. వారితో వారిని ఐక్యపరచి దేవుని దగ్గరికి తీసికొని రావాలి. వారిలో వారికి తగాదాలు పెట్టి వారిని విభజించకూడదు. మన దురాదర్శం వల్ల తోడి నరులను గూడ పాపకార్యాలకు ప్రేరేపించి దేవునికి దూరం చేయకూడదు.

## 4. పాపాలకు ప్రాయశ్చిత్తం చేయడం

పూర్వవేదంలో పాపాలకు ప్రాయశ్చిత్తం చేసే కర్మ ఒకటుంది -లేవీ 16,14-16. గుడారంలోని గర్భాగారంలో మందసం వుండేది. దానిమీద కరుణా ఫలకం వుండేది. దానిమీద షెకీనా అనే పేరుతో దైవసాన్నిధ్యం నెలకొని వుండేది. ఈ ఫలకానికి గ్రీకులో ''హిలాస్తేరియోన్'' అనీ హిబ్రూలో ''కిప్పోరెట్'' అనీ పేర్లు. ప్రాయశ్చిత్తదినాన ప్రధానయాజకుడు గర్భాగారంలోనికి ప్రవేశించి ఈ కరుణా ఫలకం మీద కోడె నెత్తురు చిలకరించేవాడు. దాని ముందు నేలమీద కూడ ఏడుసార్లు నెత్తురు చిలకరించేవాడు. అటుపిమ్మట మేక నెత్తుటిని గూడ ఆలాగే చిలకరించేవాడు. దీని భావం ఏమిటి?

ప్రజల పాపాలవలన గుడారం, మందసం, కరుణా ఫలకం మొదలైన పవిత్రవస్తువులు మైలపడిపోయాయి. వాటిని మళ్ళా పవిత్రపరచి దేవునికి అర్పించాలి. వాటిని శుద్ధిచేస్తే ప్రజలను గూడ వారిపాపలనుండి శుద్ధిచేసినట్లే. ఇక వాటిని శుద్ధిచేయడం ఏలాగ? వాటిమీద పశువుల నెత్తురు చిలకరించడం ద్వారానే. కాని నెత్తురు వస్తువులను ఏలా శుద్ధిచేస్తుంది?

హీబ్రూ ప్రజల భావాల ప్రకారం ప్రతిప్రాణి ప్రాణం నెత్తురులో వుంటుంది - లేవీ 17,14. నెత్తురు ఊపిరి, జీవం. ఇక, నెత్తురులోని ప్రాణం దేవుని నుండి వచ్చిందే. అనగా నెత్తురు దైవసాన్నిధ్యం కలది. కనుక అది వస్తువులనుగాని నరులనుగాని శుద్ధిచేయగలదు. బలిలో సమర్పించే నెత్తుటికి ఈ శక్తి అధికంగా వుంటుంది. కరుణా ఫలకాన్ని శుద్ధిచేయడం ద్వారా ప్రజలను గూడ వారి పాపలనుండి శుద్ధి చేసినట్లవుతుంది. ఇది సాంకేతిక కార్యం.

పౌలు ఈ భావాలను క్రీస్తుకి అన్వయించాడు -రోమా 3,25. తండ్రి సిలువపై వ్రేలాడే క్రీస్తు దేహాన్ని కరుణా ఫలకం జేసాడు. దానిపై చిలకరించిన నెత్తురు క్రీస్తు నెత్తురే. సిలువపై వ్రేలాడుతూ నెత్తురులు ఒలుకుతున్న క్రీస్తుదేహం జంతువుల నెత్తురులో తడిసివున్న కరుణా ఫలకంలా వుందని పౌలు భావం. క్రీస్తు చిందించిన నెత్తురుద్వారా, దానిలోని దైవ సాన్నిధ్యం వలన నరుల పాపాలు పరిహారమయ్యాయి. పాపపు నరులు మళ్ళా దేవునికి సమర్పితులై అతనితో ఐక్యమయ్యారు. ఈలా క్రీస్తు మన కొరకు కరుణా ఫలకంగా తయారై మన పాపలకు ప్రాయశ్చిత్తం చేసాడు. ప్రాయశ్చిత్త కర్మ నరుల పాపాలను తొలగించి వారిని మళ్ళా దేవునితో ఐక్యపరుస్తుంది.

సిలువ మరణంలో తండ్రిప్రేమ, క్రీస్తుప్రేమ స్పష్టంగా

కన్పిస్తాయి. తండ్రి మన కొరకు క్రీస్తుని సిలువ మరణానికి అప్పగించాడు -రోమా 8,32. క్రీస్తు మన పాపాల కొరకు ఆత్మార్పణం చేసికొన్నాడు -గల 1,4. మనలను ప్రేమించి మనకొరకు ప్రాణత్యాగం చేసికొన్నాడు - గల 2,20.

## 5. విమోచించడం

పూర్వవేదంలో ఓ సంప్రదాయం వుండేది. ఎవడైనా యిస్రాయేలీయుడు పేదవాడై ఓ యజమానునికి బానిసగా అమ్ముడుపోతే అతని దగ్గరిచుట్టం ఆ యజమానునికి డబ్బు చెల్లించి అతన్ని బానిసంనుండి విడిపించాలి. ఆలా విడిపించేవాణ్ణి హీబ్రూలో "గోయెల్" అనీ, గ్రీకులో "లూట్రోటెస్" అని పిల్చేవాళ్లు. యజమానునికి చెల్లించే క్రయధనాన్ని గ్రీకులో "లూట్రోన్" అన్నారు -లేవీ 25,47-49. ఈ సంప్రదాయం ప్రకారం యావే ప్రభువు ఫరోకు బానిసలైన యిస్రాయేలీయులను దాస్యంనుండి విడిపించాడు. ఫరో వారిని పీడింపగా ఆ ప్రజలు దేవునికి మొరపెట్టారు. అతడు వారికి దగ్గరి చుట్టమై వారిని బానిసనుండి విడిపించాడు. ఇదే విమోచనం- అనగా విడిపించడం. దీని ద్వారా యిస్రాయేలీయులు యావే ప్రజలు అయ్యారు -నిర్గ 19,5. కాని యావే ఫరోకు క్రయధనం చెల్లించలేదు. అతని సైన్యాన్ని నడిసముద్రంలో ముంచివేసి సర్వనాశం చేసాడు.

యూదులు మళ్లీ బాబిలోనియా ప్రవాసంలో చిక్కుకొన్నారు. ప్రభువు వారిని ఆ దాస్యంనుండి కూడ విడిపిస్తానని బాస చేసాడు -యెష 51,11. మెస్సీయా వచ్చే అంత్యకాలంలో గూడ వారిని పరాయి దాస్యంనుండి విడిపిస్తానని మాటయిచ్చాడు -కీర్త 130,7-8.

పౌలు ఈ భావాలను క్రీస్తుకి అన్వయించాడు. క్రీస్తు మనకు విమోచనం సంపాదించి పెట్టినవాడు -1కొరి 1,30. అనగా మనం పాపం వలన పిశాచానికి దాసులమైతే క్రీస్తు మనలను ఆ దాస్యంనుండి విడిపించాడు. ఈ విమోచనం మనకు క్రీస్తు చిందించిన నెత్తురు ద్వారా లభించింది -ఎఫె 1,7.

ఈ విమోచనం ఇదివరకే జరిగినా అది అంత్యకాలంలో గాని పరిపూర్ణంగాదు. అప్పటిదాకా మనం శరీరం యొక్క విముక్తి కొరకు ఎదురుచూస్తూ మనలో మనం మూలుగుతూంటాం -రోమా 8,23.

ఇంకా క్రీస్తు మనలను వెలయిచ్చి కొన్నాడు -1కొరి 6,20. ఈవెల క్రీస్తు సిలువ మరణం, అతడు చిందించిన నెత్తురు. కనుక మనం ఆ యజమానునికి చెందిన వాళ్లం ఔతాం.

యావే ఫరోకు క్రయధనం చెల్లించకుండానే యూద బానిసలను దాస్యం నుండి విడిపించాడు. ఆలాగే క్రీస్తు పిశాచానికి క్రయధనం చెల్లించకుడానే మనలను పాపదాస్యంనుండి విడిపించాడు. యావే ఫరోను లాగే, క్రీస్తు పిశాచాన్ని నాశం చేసాడు. ప్రభువు మనలను విమోచించినందుకు, అనగా పిశాచ దాస్యం నుండి విడిపించినందుకు, మనం ఎల్లప్పుడూ అతనికి కృతజ్ఞలమై వుండాలి.

## 6. విశ్వాసులకు స్వేచ్ఛనీయడం

గ్రీకు రోమను ప్రజలు స్వేచ్ఛాప్రియులు. వారిసమాజంలో బానిసలకు స్వేచ్ఛలేదు. మిగతా పౌరులకు స్వేచ్ఛ వుండేది. స్వేచ్ఛగల పౌరులు గొప్పవాళ్లు. గ్రీకులో స్వేచ్ఛకు “ఎలుతేరియా” అని పేరు.

పౌలు గ్రీకులస్వేచ్ఛాభావాన్ని క్రీస్తుకి అన్వయించాడు. మనం పరలోక పౌరులం -ఫిలి 3,20. అనగా క్రైస్తవులకు పరలోకంలోను భూలోకంలోను గూడ స్వేచ్ఛ వుంటుందని భావం. క్రీస్తు తన మరణోత్థానాల ద్వారా మనకు స్వేచ్ఛను ప్రసాదించాడు. మనం స్వతంత్రులంగా వుండడానికి క్రీస్తు మనకు స్వేచ్ఛను దయచేసాడు. కనుక మనం మళ్లా దాస్యమనే కాడిక్రిందికి రాకూడదు -గల 5,1. యూదమతాభిమానులు గ్రీకు క్రైస్తవులు ధర్మశాస్త్రాన్ని పాటించాలని పట్టుబట్టారు. కాని అది వారి స్వేచ్ఛను అపహరిస్తుంది కనుక పౌలు ఈ వాదాన్ని అంగీకరించలేదు. మనం స్వతంత్రురాలైన సారా బిడ్డలంగాని బానిసయైన హాగరు బిడ్డలం కాదు అన్నాడు -గల 4,31.

క్రీస్తు రాక ముందు మనం పాపానికీ మృత్యువుకీ, ధర్మశాస్త్రానికీ, శారీరక వ్యామోహాలకూ బానిసలం. క్రీస్తు మరణోత్థానాలు వీటన్నిటినుండి మనకు స్వేచ్ఛను ప్రసాదించాయి.

ప్రభువు దయచేసే స్వేచ్ఛను ఆత్మ మన హృదయంలో వృద్ధిచేస్తుంది. ఆత్మ వున్నచోట స్వాతంత్ర్యం వుంటుంది -2కొరి 3,17. ఈ యాత్మ మనం కామం, క్రోధం, స్వార్థం మొదలైన శారీరక క్రియలను జయించేలా చేస్తుంది. క్రీస్తుకి చెందినవాళ్లు వ్యామోహాలతో కాంక్షలతో కూడిన తమ శరీరాన్ని సిలువ వేస్తారు -గల 5,24.

క్రీస్తు మనకు స్వేచ్ఛను ప్రసాదించింది ఎందుకు? విచ్చలవిడిగా ప్రవర్తించడానికి గాదు. ఒకరినొకరు ప్రేమించడానికీ, ఒకరికొకరు ప్రేమతో సేవలు చేసికోవడానికీని. కనుక సోదరప్రేమ, సేవ స్వేచ్ఛాఫలాలు అనాలి -గల 5,13.

## 7. పవిత్రపరచడం

పూర్వవేదంలో నరులూ వస్తువులూ కూడ పవిత్రతను పొందుతారు. మండుతూవున్న పొదకు దగ్గరి స్థలం, యెరూషలేము నగరం, యిస్రాయేలు ప్రజలు, యాజకులు, ప్రవక్తలు మొదలైన వాళ్లు పవిత్రులు. ఈ నరులు పవిత్రులైంది తమ పుణ్యక్రియలవల్ల కాదు. పవిత్రుడైన దేవునికి అంకితం కావడం వల్ల. బైబులు భావాల ప్రకారం పవిత్రతలో రెండంశాలువున్నాయి. మొదటిది ఓ వస్తువునిగాని నరునిగాని పాపపులోకంనుండి వేరుజేయడం. రెండవది ఆ వస్తువుని లేక నరుని పవిత్రుడైన దేవునికి అర్పించడం. అనగా దేవుని సేవకు వినియోగించడం. అన్నిటిని పవిత్రపరచేవాడు దేవుడే.

పౌలు ఈ భావాన్ని క్రీస్తుకి అన్వయించాడు. దేవుడు క్రీస్తుని మనకొరకు పవిత్రతనుగా చేసాడు -1కొరి 1,30. అనగా క్రీస్తు తన సిలువ మరణం ద్వారా మన పాపాలను తొలగించి మనలను దేవునికి సమర్పించాడని భావం. ఆలా దేవునికి అంకితమైన మనం ఎల్లప్పుడు దేవుని సేవలోనే వుంటాం.దేవుడు మనలను పవిత్ర జీవితం గడపడానికే పిల్చాడు -1తెస్స 4,7. దేవుని ఆత్మ కూడ మనలను పవిత్రులను చేస్తుంది -రోమా 15,16.

పౌలు తన జాబుల్లో క్రైస్తవులందరినీ పరిశుద్ధులు అనే పిలుస్తుంటాడు. క్రీస్తుని విశ్వసించి అతనిలోనికి జ్ఞానస్నానం పొందడం ద్వారానే మనం పరిశుద్ధులమౌతాం. కనుక క్రైస్తవభక్తుడు ఎప్పుడూ పవిత్రంగా జీవించాలి.

## 8. మార్చివేయడం

దేవతలు నరులను చెట్టుచేమలుగానో రాయిరప్పలుగానో మార్చివేసినట్లుగా గ్రీకు రచయితలు కథలు అల్లారు. ఈలా మార్పు చెందడాన్ని గ్రీకులో "మెటమోర్ఫోసిస్" అంటారు. పౌలు ఈ భావాన్ని

క్రీస్తుకి అన్వయించాడు. తండ్రి క్రీస్తు మరణోత్థానాల ద్వారా పాపపు నరులను పరిశుద్ధులనుగా మార్చివేసాడు. మనం చెడ్డనుండి మంచికి మారతాం.

పూర్వవేదంలో సీనాయికొండమీద యావే తేజస్సు సోకి మోషేముఖం ప్రకాశించింది -నిర్గ 34,29. నూత్నవేదంలో తండ్రి తేజస్సు వలన ఉత్థాన క్రీస్తు ప్రకాశించాడు. ఆ వుత్థాన క్రీస్తు తేజస్సు వలన అతని శిష్యులమైన మనం ప్రకాశిస్తాం. మనం క్రీస్తు పోలికను పొందుతాం. అనగా క్రీస్తు ఆర్జించిన రక్షణం మనలను పరిశుద్ధులనుగా మార్చివేస్తుందని భావం -2కొరి 3,18.

దేవుడు మొదట వెలుగును చేసాడు. ఆ వెలుగు ఉత్థాన క్రీస్తుపై ప్రసరించింది. ఉత్థాన క్రీస్తు డమస్కు త్రోవలో వెలుగురూపంలో పౌలుకి దర్శనమిచ్చాడు. దాని వలన అతడు పూర్తిగా మారిపోయి క్రీస్తు శిష్యుడు అయ్యాడు. ఆలాగే క్రీస్తు వెలుగు ఇప్పుడు మనలను కూడ మార్చివేస్తుంది -2కొరి 4,6.

క్రీస్తు బలహీనమైన మన మర్త్యశరీరాన్ని తేజోవంతమైన తన శరీరాన్ని పోలివుండేలా మార్చివేస్తాడు -ఫిలి 3,21. ఇది ఉత్థానం తర్వాత జరుగుతుంది.

క్రీస్తు తెచ్చే మార్పు వలన మనం నీతిమంతులమూ పరిశుద్ధులమూ ఔతాం. అనగా మనకు దివ్యత్వం లభిస్తుంది. కాని ఈ మార్పు దిడీలున వచ్చేది కాదు. ఇది చాల కృషి వలన, చాలకాలం తర్వాత సిద్ధించే ఫలితం. నరులు తమ బుద్ధులను మార్చుకోవడం ఎంత మాత్రం సులభం కాదు. ఒక్క దేవుడే గాని మనం మంచికి మారేలా చేయలేడు.

## 9. నూత్నస్వభావాన్ని ఈయడం

పూర్వవేదంలో దేవుడు సృష్టి చేసి నరులనూ భౌతిక ప్రపంచాన్ని పుట్టించాడు. అది పాత్రసృష్టి. దీని నుండి పౌలు నూత్న సృష్టి అనే భావాన్ని గ్రహించి ఆ భావాన్ని క్రీస్తుకి అన్వయించాడు. దేవుడు క్రీస్తు ద్వారా నరుల్లో నూత్నసృష్టిని తీసుకొనివచ్చాడు అని చెప్పాడు. అనగా క్రీస్తు మరణోత్థానాలు ప్రాత నరులను నూత్న నరులుగా మార్చివేస్తాయని భావం. దీన్ని గ్రీకులో "కాయినెక్తిసిస్" అంటారు. పూర్వవేదంలో ప్రాత ఆదాము వున్నాడు. అతనికి బదులుగా నూత్న ఆదామైన క్రీస్తు వచ్చాడు. ఈ క్రీస్తు ద్వారా మనం నూత్న నరులం ఔతాం. బైబుల్లో ప్రాత పాపానికీ, క్రొత్త పవిత్రతకూ చిహ్నాంగా వుంటాయి.

ఎవడైనా క్రీస్తునందుంటే అతడు నూత్న సృష్టి ఔతాడు -2కొరి 5,17. నూత్న ఆదామైన క్రీస్తు తన మరణోత్థానాల ద్వారా మనకు నూత్నత్వాన్ని ప్రసాదిస్తాడు. క్రీస్తు ద్వారా మనం దేవునికి పోలికగా సృజింపబడిన క్రొత్త స్వభావాన్ని పొందుతాం -ఎఫె 4,24. క్రీస్తు ద్వారా మనలోని ప్రాత స్వభావం అంతరించిపోయి క్రొత్త స్వభావాన్ని స్వీకరిస్తాం. నూత్నసృష్టి అంటే నూత్న స్వభావమే.

ఆదాము ప్రాత మానవజాతికి శిరస్సు. అతని భౌతిక స్వభావం మనకుకూడ వచ్చింది. క్రీస్తు నూత్న మానవజాతికి శిరస్సు. అతడు ఆర్జించిన రక్షణం మనకు నూత్న స్వభావాన్ని దయచేస్తుంది. మనం క్రీస్తు రూపాన్ని పొందుతాం -రోమా 8,29. జ్ఞానస్నానం ద్వారా, ఆత్మద్వారా మనలో ఈ మార్పు వస్తుంది. ఈ క్రొత్త స్వభావం మనలను నీతిమంతులనూ పరిశుద్ధులనూ చేస్తుంది -ఎఫె 4,24.

ఒక్క నరులేగాక భౌతిక ప్రపంచం గూడ ఉత్థానక్రీస్తు ద్వారా నూత్నత్వాన్ని పొందుతుంది. అది ఆ గడియకొరకు కాచుకొనివుంటుంది - రోమా 8,21-22.

# 10. మహిమపరచడం

పూర్వవేదంలో యావే ప్రభువు మోషే మొదలైన భక్తులకు తేజస్సుతో దర్శనమిచ్చేవాడు. ఈ తేజస్సు దైవసాన్నిధ్యమే. దీనికి హీబ్రూలో "కబోద్" అనీ, గ్రీకులో "డోక్సా" అనీ పేర్లు. ఈ తేజస్సునే ఇంగ్లీషులో Glory అని, తెలుగులో మహిమ అనీ అనువదించారు. మహిమ అంటే కీర్తిగౌరవాలు. యిస్రాయేలీయులకు కొండమీద ప్రభువు తేజస్సు కన్పించింది-నిర్గ 24,17. గుడారంమీద ప్రభువు తేజస్సు కన్పించింది -సంఖ్య 14,10.

పౌలు ఈ భావాన్ని క్రీస్తుకి అన్వయించాడు. తండ్రి తన తేజస్సుని ఉత్థాన క్రీస్తుకి ఇచ్చాడు. ఆ క్రీస్తు ద్వారా మనం కూడ తన తేజస్సులో పాలుపొందేలా చేసాడు. దేవుడు తాను ఎన్నుకొన్నవారిని పిల్చాడు. పిల్చినవారిని నీతిమంతులను చేసాడు. నీతిమంతులైన వారికి తన తేజస్సులో పాలు ఇచ్చాడు-రోమా 8,30. తండ్రి తేజస్సు అంటే తండ్రి కీర్తే. క్రీస్తుద్వారా మనం కూడ తండ్రి కీర్తిలో పాలుపొందుతాం.

ఈ భావాన్నే కొలోస్సీయుల జాబు, ఎఫెసీయుల జాబు ఇంకోవిధంగా వర్ణించాయి. తండ్రి మనలను అంధకారంనుండి తొలగించి తనకుమారుని రాజ్యంలోనికి చేర్చాడు-కొలో 1,13. తండ్రి మనలను క్రీస్తుతో పాటు లేపి పరలోక స్థలంలో క్రీస్తుతోపాటు కూర్చుండబెట్టాడు -ఎఫె 2,6. తండ్రి తేజస్సులో పాలుపొందడమన్నా తండ్రి రాజ్యంలో పాలుపొందడమన్నా ఒకటే. దేవుడు క్రీస్తుద్వారా మనం కూడ తన కీర్తి గౌరవాల్లో పాలుపొందేలా చేసాడు. మోక్షంలో దైవసాన్నిధ్యంలో వుండిపోయేలా చేసాడు. ఇది దేవుడు మనలను మహిమపరచడం.

# ౬. క్రీస్తు రాకముందు నరుల దౌర్భాగ్యస్థితి

పూర్వాధ్యాయంలో తండ్రి క్రీస్తుద్వారా మనకు సాధించి పెట్టిన రక్షణాన్ని పరిశీలించి చూచాం. అది క్రీస్తు తరపున రక్షణం. ఐతే ఆ రక్షణం మనతరపున ఏలా పనిచేస్తుంది? క్రీస్తురాకముందు నరుల పరిస్థితి ఏలా వుంది? అతడు వచ్చాక ఆ పరిస్థితి ఏలా మారింది? క్రీస్తు రక్షణాన్ని పొందడం వల్ల మనమేలా మారిపోయాం? ప్రస్తుతం ఈ విషయాలను పరిశీలించి చూద్దాం. ఇక్కడ నాల్గు అంశాలు వున్నాయి.

పౌలు దృష్టిలో క్రీస్తురాక ముందు పాపం నరులను ఓనియంతలా ఏలింది. శరీరం వాళ్లను లౌకిక వ్యామోహాల్లో బంధించివుంచింది. ధర్మశాస్త్రం వాళ్లను బానిసలను చేసింది. వీటన్నిటిఫలితంగా మృత్యువు వాళ్లను కబళించింది. కనుక ఈ నాల్గంశాలను క్రమంగా పరిశీలిద్దాం.

## 1. పాపం

పౌలు పాపాన్నిగూర్చి లోతుగా ఆలోచించాడు. క్రీస్తురాకముందు పాపం లోకమంతటా వ్యాపించి వుంది. జనులంతా ఆ విష వాయువుని పీల్చుకొన్నారు. నరులంతా పాపంచేసి దేవుని మహిమను కోల్పోయారు -రోమా 3,23. ఈ మహిమ నరుల్లో వున్న దేవుని రూపమే. ఈ సందర్భంలో కీర్తనకారుడు "నేను పుట్టినప్పటినుండి పాపత్ముడనే, మాయమ్మ కడుపున పడినప్పటి నుండి కిల్బిషాత్ముడనే" అని చెప్పుకొన్నాడు -51,5.

పాపం దేవుని నుండి గాక నరుని నుండే వచ్చింది. దేవుడు నరుణ్ణి అమరుని గాను తనవలె నిత్యునిగాను చేసాడు. కాని పిశాచం అసూయ వలన మృత్యువు లోకంలోనికి ప్రవేశించింది -సొలో.జ్ఞాన2,23-24.

పౌలు భావాల ప్రకారం పిశాచం ప్రేషితులకు ఆటంకాలు, విశ్వాసులకు హింసలు కలిగిస్తుంది. ప్రజల్లో విగ్రహారాధననూ, దేవునిమీద తిరుగుబాటునూ పురికొల్పుతుంది. పౌలు దాన్ని సైతాను, పాము, బేల్యాల్ అనే పేర్లతో పిలుస్తుంటాడు. ఇది కొన్నిసార్లు ఏకవ్యక్తి గాను కొన్నిసార్లు బృందంగాను దర్శనమిస్తుంది. చెడ్డను వ్యాపింజేయడం దానిపని. ఆకాశం, చీకటి దాని నివాసస్థలాలు. పిశాచరాజ్యం దైవరాజ్యానికి వ్యతిరేకమైంది. అది ఈ యుగానికి, ఈ లోకానికి నాయకుడు. ప్రజలను పాపంలో కూలద్రోయడం దానికి ఇష్టం.

తొలి తల్లిదండ్రులనుండి పాపం వచ్చింది. తరతరాల పొడుగున తండ్రులూ తనయులూ అందరూ పాపంలో పడిపోయారు. పౌలు పేర్కొనేది మన వ్యక్తిగతమైన పాపం గాదు, సామూహికపాపం. మన తండ్రియైన ఆదాము పాపానికి మూలకారణం. ఒక మనుష్యుని వలన మరణం ప్రవేశించినట్లే పునరుత్థానం కూడా ఒక మనుష్యుని మూలాన్నే వచ్చింది -1కొరి 15,21. ఈ "వొక మనుష్యుడు" ఆదాము. అతడు తెచ్చిపెట్టిన మరణం శారీరకమైందీ, ఆధ్యాత్మికమైందీ కూడ.

ఒక మనుష్యుని ద్వారా పాపం ఈ లోకంలోకి ప్రవేశించింది. బైబుల్లో పాపమంటే గురి తప్పడం, గమ్యాన్ని చేరుకోకపోవడం. ఇంకా పాపం దేవునిమీద తిరుగుబాటు చేయడం గూడ.

అన్యజాతి ప్రజలూ యూదులూ కూడ పాపంలో మునిగిపోయారు. అన్యజాతివారికి దేవుడు తెలుసు. ఐనా వాళ్లు అతన్ని పూజింపక విగ్రహాలను కొల్చారు. సృష్టివస్తువుల్లో చిక్కుకొన్నారు -రోమా 1,21-24. అది వారి తప్పు. ఇక యూదులకు ధర్మశాస్త్రంలోని ఆజ్ఞలు తెలుసు. ఐనా వాటిని పాటించనందున పాపం కట్టుకొన్నారు. ఈవిధంగా నరులంతా పాపులైపోయారు -

రోమా 3,9. దీనివల్ల వీళ్లు దేవునికి దూరమై పిశాచానికి దాసులయ్యారు -ఎఫె 2,2. ఫలితంగా దేవుని కోపం వారిపై రగుల్కొంది.

పౌలు పాపాన్ని ఓ వ్యక్తినిగాగూడ భావించాడు. అది ఓ నియంతలాగ నరులను క్రూరంగా ఏలింది. అది నరుల మధ్య వసించింది -రోమా 7,23. నరులను మోసగించి చంపివేసింది. అది ఓ దుష్టశక్తి, దుష్టస్థితి. నరులు తమంతటతాము ఆ దుష్టశక్తినుండి తప్పించుకోలేరు. క్రీస్తే వచ్చి వారిని పాపమనే నియంత దాస్యం నుండి విడిపించాలి.

## ౨. శరీరం

క్రీస్తురాకముందు పాపం నరులను బానిసలుగా ఏలింది అని చెప్పాం. కాని పాపానికి ఆ శక్తి ఏలా వచ్చింది.? "శరీరం" దానికి సహాయపడింది. పౌలు లేఖల్లో శరీరం పారిభాషికపదం. కనుక మనం మొదట ఈ పదం భావాన్ని పరిశీలించాలి.

పౌలు లేఖల్లో శరీరం అంటే మన కంటికి కన్పించే నరుడు, లౌకిక మానవుడు, ప్రాకృతిక నరుడు, వరప్రసాదం లేని జనుడు. అతని దృష్టి స్వర్గం వైపుగాక భూమివైపు తిరిగి వుంటుంది. అతడు దుర్బలుడు, క్షణమాత్రజీవి. ఇంకా అతడు దేవునికి వ్యతిరేకి. పాపపు నరుడు. శారీరక మానవుడు, జంతు ప్రవృత్తి కలవాడు. ఆధ్యాత్మిక నరునికి కేవలం భిన్నమైనవాడు. శరీరానుసారంగా జీవించేవాళ్లు దేవుణ్ణి సంతోషపెట్టలేరు -రోమ 8,8. పౌలు శరీరకార్యాలు 16 పేర్కొన్నాడు. ఇవన్నీ పాపకార్యాలే -గల 5,19-21. శరీరానికి హీబ్రూలో బసార్ అనీ గ్రీకులో సార్క్సు అనీ పేర్లు. నరుల్లో ఈ శరీరం వల్ల ఏర్పడిన సహజ బలహీనతను లౌకిక వ్యామోహాలనూ

ఆసరాగ తీసుకొని పాపం అతన్ని లొంగదీసికొంది. అతడు గూడ సులువుగానే పాపనికి వశుడైపోయాడు. ఈ శరీరాన్ని జయించే శక్తిని మనకు ప్రసాదించేది పవిత్రాత్మే.

## 3. ధర్మశాస్త్రం

పాపం నరులను దాసులనుగా ఏలడానికి రెండవ కారణం ధర్మశాస్త్రం. పౌలు ధర్మశాస్త్రం తెచ్చిపెట్టిన అనర్థాన్ని చాల విపులంగా వర్ణించాడు. అతని ప్రధాన అంశాల్లో ఇదికూడ వొకటి. కనుక ధర్మశాస్త్రాన్ని గూర్చిన అతని భావాలను సంగ్రహంగా పరిశీలిద్దాం.

### 1. పూర్వవేద భావం

యావే ప్రభువు యిస్రాయేలీయులతో సీనాయి కొండ దగ్గర నిబంధనం చేసికొన్నాడు. దీనితో వాళ్లు అతడు కాచికాపాడే ప్రజలయ్యారు. అతనికి సొంత జనం అయ్యారు. అతడు వాళ్లుకొల్చే దేవుడు అయ్యాడు. ఆ జనాన్ని ఫరో బానిసంనుండి విడిపించాడు కనుక వారిపై అతనికి సర్వాధికారమూ, అన్ని హక్కులూ కలిగాయి. ఈ సందర్భంలోనే ప్రభువు వారికి మోషే ధర్మశాస్త్రాన్ని ఇచ్చాడు. ప్రజలు ఆ ధర్మశాస్త్రంలోని ఆజ్ఞలు పాటించాలి. ఈ ధర్మశాస్త్రం ఓవైపు యావే అధికారాన్ని సూచిస్తుంది. దాన్ని పాటించకపోతే యావేను ధిక్కరించినట్లే. మరోవైపు అది ప్రజల క్షేమాన్ని గూడ సూచిస్తుంది. దాన్ని పాటిస్తే ప్రజలు క్షేమంగా వుండిపోతారు. అది వాళ్ల మేలు కొరకే ఉద్దేశింపబడింది.

దేవుడు తమ్ము బానిసం నుండి విడిపించాడు కనుక ప్రజలు కృతజ్ఞతాభావంతో, వినయవిధేయతలతో ధర్మశాస్త్రాన్ని పాటించాలి. దాని ఆజ్ఞలను ప్రేమతో అనుసరించాలి. కనుకనే మోషే మీ ప్రభువైన దేవుణ్ణి పూర్ణహృదయంతో, పూర్ణ మనస్సుతో, పూర్ణ శక్తితో ప్రేమించండి అని ఆజ్ఞాపించాడు -ద్వితీ 6,5.

సీనాయి నిబంధనం ద్వారా ప్రభువు యిస్రాయేలు ప్రజలందరితోను నిబంధనం చేసికొన్నాడు. దానివలన ప్రజలందరికి పరస్పర సంబంధం ఏర్పడింది. కనుక ఆ ప్రజలు ఒకరినొకరు అంగీకరించాలి. అందరూ కలిసి దేవుణ్ణి ప్రేమించాలి. కనుక దైవప్రేమ సోదరప్రేమ అనే రెండాజ్ఞలు ధర్మశాస్త్రంలో కెల్ల ప్రధానమైన ఆజ్ఞలయ్యాయి.

దేవుడు ధర్మశాస్త్రాన్ని రాతిపలకలపై వ్రాసియిచ్చాడు. దానిలోని ఆజ్ఞలు నరుల హృదయాలకు వెలుపల వున్నాయి. కనుక ప్రజలు వాటిని మక్కువతో పాటించకపోవచ్చు. ప్రవక్త యిర్మీయా నూత్న నిబంధనకాలం వస్తుందనీ, అప్పుడు ప్రభువు తన ఆజ్ఞలను నరుల హృదయాల మీదనే వ్రాస్తాడనీ, ఆ మీదట వాటిని పాటించడం తేలికౌతుందనీ వాకొన్నాడు -31,33. ఆలాగే యెహెజ్కేలు ప్రవక్త ప్రభువు ప్రజలకు నూత్న హృదయాన్ని దయచేస్తాడనీ, అందుచే ప్రజలు ధర్మశాస్త్రాన్ని శ్రద్ధతో పాటిస్తారనీ వాకొన్నాడు-36,26-27. ఈ రెండు ప్రవచనాలు నూత్న వేదంలో క్రీస్తువచ్చినపుడు నెరవేరాయి. అనగా నూత్నవేద కాలంలో ధర్మశాస్త్రం నరులకు ఆంతరంగికమైన శక్తి ఔతుందని భావం. ఫలితార్థం ఏమిటంటే యూదులు ధర్మశాస్త్రాన్ని పాటించడం వలన రక్షణం పొందరు. ప్రభువు వాళ్లను దాస్యం నుండి విడిపించాడు కనుక వాళ్లు కృతజ్ఞతా పూర్వకంగా ధర్మశాస్త్రాన్ని పాటించాలి. అది ప్రధానంగా రక్షణను ఇచ్చేది కాదు. రక్షణకు పర్యవసానం మాత్రమే. రక్షణకు కృతజ్ఞతను తెలియజేసేది, అంతే.

**2. కాలక్రమేణ వచ్చిన మార్పు**

కాలంగడిచే కొద్దీ యూదులు ధర్మశాస్త్రాన్ని అర్థంజేసికొనే రీతిలో మార్పువచ్చింది. వాళ్లు క్రీ.పూ. 587-537 మధ్యలో

బాబిలోనియా ప్రవాసంలో వున్నారు. ఆ కాలంలో వారికి రాజులు దేవాలయం, బలులు లేవు. కనుక వారి దృష్టి అంతా ధర్మశాస్త్రం మీదనే పడింది. విశ్రాంతి దినం, సున్నతి మొదలైన ఆచారాలకు ప్రాముఖ్యం పెరిగింది. ధర్మశాస్త్రానికి అత్యంత విలువ వచ్చింది. జ్ఞానులు ధర్మశాస్త్రమే జ్ఞానం అని బోధించారు. రబ్బయులు ధర్మశాస్త్రంలోని ఆజ్ఞలకు కొన్ని క్రొత్త నియమాలు కూడ చేర్చారు. వీటికి పితరుల సంప్రదాయాలు అని పేరు. మోషే ఆజ్ఞలే 613 వున్నాయి. పితరుల సంప్రదాయంలో ఇంకా చాల నియమాలు వున్నాయి. ఇవన్నీ కలసి కొండలాగ పెరిగిపోయాయి. పరిసయులు ధర్మశాస్త్రమే రక్షణసాధనం అన్నారు. దాన్ని పాటిస్తే రక్షణం, పాటించకపోతే దేవుని శిక్ష అన్నారు. పూర్వం అది యూదులు రక్షణం పొందినందున కృతజ్ఞతా సూచనంగా పాటించేది మాత్రమే. అనగా పర్యవసానం మాత్రమే. ఇప్పుడు దాన్ని పాటిస్తే రక్షణం కలుగుతుంది అనే భావం ప్రచారంలోకి వచ్చింది. పరిసయులు ధర్మశాస్త్రం ఆజ్ఞలను ఖండితంగా పాటించారు. కనుక వాళ్ళ తమకు రక్షణం తప్పకుండ కలుగుతుందనీ, తాము పుణ్యక్రియలు చేస్తున్నారు కనుక రక్షణ విషయంలో దేవుడు తమకు ఋణపడి వున్నాడనీఎంచారు. దేవుడు తమకు రక్షణాన్ని ఇచ్చితీరాలని వాదించారు. నరుడు తన పుణ్యక్రియలద్వారా తన్ను తానే రక్షించుకొంటాడు అనేకాడికి వచ్చింది వ్యవహారం. క్రీస్తునాడు, పౌలునాడు యూదుల్లో ఈలాంటి భావాలు ప్రచారంలో వుండేవి.

ఐతే పౌలు పై నూత్న భావాలను అంగీకరించలేదు. అతని బోధల ప్రకారం మనలను రక్షించేది ధర్మశాస్త్రం కానే కాదు. క్రీస్తుని విశ్వసించి అతని వరప్రసాదం ద్వారా మాత్రమే మనం రక్షణం పొందాలి. ఇక ఈయంశాన్ని విపులంగా పరిశీలిద్దాం.

## 3. పౌలు బోధ

గ్రీకు రోమను ప్రజలు కూడ ధర్మశాస్త్రాన్ని పాటించాలనీ సున్నతిని పొందాలనీ లేకపోతే వారికి రక్షణం లేదనీ యూద మతాభిమానులు వాదించారు. పౌలు ఈ వాదాన్ని ఖండించాడు. ధర్మశాస్త్రం ప్రాముఖ్యాన్ని జాగ్రత్తగా పరిశీలించి చూచి తన భావాలను ఈ క్రింది రీతిగా తెలియజేసాడు.

ధర్మశాస్త్రం దానంతట అది మంచిదే. దేవుడే యిచ్చాడు గాన అది పవిత్రమైంది, ఉత్తమమైంది -రోమా 7,12. ధర్మశాస్త్రం, నిబంధనం, వాగ్దానాలు యూదులకున్న ప్రత్యేక సదుపాయాలు. ఆ సదుపాయాలు అన్యజాతులకు లేవు - 9,4. ఐనా ధర్మశాస్త్రం నరులు పాపంలో పడ్డానికి కారణమైంది. ఏలాగ?

ధర్మశాస్త్రం పలానా కార్యం పాపమని తెలియజేస్తుందేకాని ఆ పాపకార్యాన్ని వారించే వరప్రసాదాన్ని మాత్రం నరులకు ఈయలేదు. దానివల్ల పాపజ్ఞానం కలుగుతుంది. కాని ఆ పాపంలో పడిపోవడానికి కూడ అదే అవకాశం కల్పిస్తుంది - రోమా 3,20. ధర్మశాస్త్రమే లేకపోతే నరులకు పాపజ్ఞానం కలిగేది కాదు. వాళ్ళ పాపం చేసినా అది పాపమయ్యేది కాదు. ధర్మశాస్త్రం పలానా పని పాపమని తెలియజేస్తుంది. ఆ కార్యాన్ని చేయడం ద్వారా మనలను పాపంలో కూలద్రోస్తుంది -7,7-8. అందుచే దానిద్వారా నరుల పాపాలు పెరిగిపోయాయి. ఆజ్ఞలు పాపాలను పెంచివేసాయి -7,13. ఇంకా ధర్మశాస్త్రం నరులను శాపగ్రస్తులను చేసింది - గల 3,10. యూదమతాభిమానులు మేము ధర్మశాస్త్రాన్ని పాటించడం ద్వారా, ఆజ్ఞలను అనుసరించి పుణ్యకార్యాలు చేయడం ద్వారా నీతిమంతులం అయ్యాం అనుకొన్నారు. ఆలాగైతే వాళ్లనువాళ్లే నీతిమంతులను చేసికొన్నట్లు ఔతుంది - రోమా 3,27.

ధర్మశాస్త్ర జ్ఞానం వల్ల ఇది పాపకార్యమని తెలిసికొంటాం. ఐనా బలహీనతవల్ల ఆ పాపకార్యాన్ని చేస్తాం. ఈ విధంగా పాపాలసంఖ్య పెరిగిపోతుంది. పాపాలు అధికం గావడానికే ధర్మశాస్త్రం వచ్చింది - రోమా 5,20. గల 3,19. ఈలాగైతే ధర్మశాస్త్రాన్ని దేవుడు ఎందుకు ప్రవేశపెట్టాడు? మోషే ధర్మశాస్త్రం పాపాలకు కారణమౌతుందని దేవునికి ముందుగానే తెలుసు. ఐనా అతడు దాన్ని అనుమతించాడు. ఎందుకు? పాపం ఎక్కడ పెరిగిందో అక్కడే దేవుని అనుగ్రహంకూడ ఇంకా అధికంగా పెరగడానికి. పాపం వల్ల నాశమయ్యే నరులను దేవుడు క్రీస్తుద్వారా శాశ్వత జీవానికి కొనిపోవడానికి - రోమా 5,20-21. ఇది లోతైన భావం. యూదమతాభిమానులు తలంచినట్లుగా ధర్మశాస్త్రం మనలను రక్షించదు. దానివల్ల మన దౌర్భగ్యం తొలగిపోదు. మన ప్రభువైన క్రీస్తుద్వారానే మనకు ఉద్ధరణం లభిస్తుంది. అతని మరణోత్థానాలు ఆ ప్రభువుపట్ల విశ్వాసం మనకు పాపపరిహారాన్ని ఆర్జించి పెడతాయి - రోమా 7,24-25.

ఈ సందర్భంలో పౌలు క్రీస్తు ధర్మశాస్త్రానికి అంతం అన్నాడు - రోమా 10,4. ఇది గొప్ప వాక్యం. ఇక్కడ అంతం అంటే ముగింపనీ, ఫలితమనీ రెండర్థాలు వున్నాయి. ఇక్కడ మనకు రెండవ అర్థం ముఖ్యం. అనగా ధర్మశాస్త్రం వల్ల యూదులు ఏ వరప్రసాదాన్ని, ఏ ఫలితాన్ని పొందగోరారో అది యిప్పుడు క్రీస్తు ద్వారా మనకు లభించిందని భావం. ఇంకా చెప్పాలంటే యూదులు ధర్మశాస్త్రంద్వారా పొందగోరిన ఫలితాన్ని కడన మనం క్రీస్తుద్వారా పొందామని భావం.

కనుక యూదులు మేము ధర్మశాస్త్రాన్ని పాటిస్తున్నాం గనుక దానివల్లనే నీతిమంతుల మౌతాం అని గొప్పలు చెప్పకోగూడదు. దాన్ని పాటించడం వలన ఏ నరుడూ దేవుని దృష్టిలో నీతిమంతుడు

కాడు - రోమా 3,19-20. మనలను నీతిమంతులను జేసేది క్రీస్తుపట్ల విశ్వాసం ఒక్కటే.

దేవుడే నరులకు ధర్మశాస్త్రాన్ని ఇచ్చాడు. ఐనా నరులు దానివల్ల నీతిమంతులు కావడం లేదు. ఆలాంటప్పుడు దేవునికృషి వ్యర్థమైపోలేదా? ధర్మశాస్త్రం దేవుని ప్రయత్నాన్ని వ్యర్థం చేయదు. సఫలీకృతమే చేస్తుంది. ఏలాగంటే క్రీస్తు వచ్చిందాకా ధర్మశాస్త్రం మనకు బాలశిక్షకుడుగా పని చేసింది. పౌలు నాడు గ్రీకు సమాజాల్లో సంపన్నుల పిల్లలను వారి బానిస బడికి తీసికొని పోయేవాడు. ఆ పిల్లల చదువును పర్యవేక్షించేవాడు. అతడే బాలశిక్షకుడు. అనగా క్రీస్తువచ్చిందాకా ధర్మశాస్త్రం మనకు సహాయకారిగా వుందని భావం. అతడు వచ్చాక అది తొలిగిపోయింది. అనగా దానిప్రయోజనం శాశ్వతమైంది కాదు, తాత్కాలికమైంది మాత్రమే - గల3,23-24. మనలను రక్షించేది మన ప్రభువైన యేసుక్రీస్తు మాత్రమే - రోమా 7,24.

పౌలు దృష్టిలో శరీరం పాపాల్లాగే ధర్మశాస్త్రంగూడ ఓ క్రూర నియంత లాంటిది. అది నరులను హింసించడానికే వుంది. శరీరం, పాపం దానికి ఊతమిచ్చి మనం కూలిపోయేలా చేస్తాయి. నరులకు మంచి యేదో తెలుసు. ఐనా చెడ్డనే చేస్తున్నారు. వారిలోని శరీరం, పాపం వారిని చెడ్డను చేయడానికి ప్రేరేపిస్తున్నాయి - రోమా 7,14-17. ఫలితాంశం ఏమిటంటే, ధర్మశాస్త్రంగాదు, క్రీస్తుపట్ల విశ్వాసం మనలను రక్షిస్తుంది.

## 4. మృత్యువు

శరీరమూ ధర్మశాస్త్రమూ పాపాన్ని బలపరుస్తాయి. పాపంవల్ల నరుడు దేవునికి దూరమైపోతాడు. అతనికి శత్రువౌతాడు - రోమా 5, 8-10. పాపం ద్వారా మృత్యువు సిద్ధిస్తుంది. పౌలు

దృష్టిలో మృత్యువు అంటే శారీరకమైన చావు, ఆధ్యాత్మికమైన చావు కూడ. ఒక నరునిద్వారా పాపంలోకంలోనికి ప్రవేశించింది. పాపంనుండి మరణం వచ్చింది. మానవులందరు పాపం కట్టుకొన్నారు కనుక అందరికీ మరణం వ్యాపించింది - రోమా 5,12. ఆదాము పాపంద్వారా అందరికీ మరణం దాపురించింది. కాని రెండవ ఆదామైన క్రీస్తు మరణం ద్వారా ఇప్పటి మన మరణం తన శక్తిని కోల్పోయింది. మరణం ముల్లు పాపం - 1 కొరి 15,56. అనగా మరణం పాపంనుండి శక్తిని తెచ్చుకొని పాము తేలులాంటి విషజంతువుల్లా మనలను కరుస్తుంది. మరణం మన తుది శత్రువు. ప్రభువు రెండవరాకడతోగాని అది గతించదు - 1కొరి 15, 26.

**ఉపసంహారం**

పైన క్రీస్తురాకముందు నరుల పరిస్థితిఎలావుందో పరిశీలించి చూచాం. నరులు పాపానికి దాసులయ్యారు. శరీరం క్రిందికి లాగింది. ధర్మశాస్త్రం క్రుంగదీసింది. మృత్యువు వారిని మ్రింగివేసింది. మనం శరీరానుసారంగా జీవించినపుడు ధర్మశాస్త్రం పురికొల్పిన పాపవాంఛలు మన శరీరంలో విజృంభించి మృత్యువుని తెచ్చిపెట్టాయి. -రోమా 7,5. నరుడు పడిపోయాడు. ఇక అతడు తన్నుతాను ఉద్ధరించుకోలేడు. శాస్త్రరంగంలో ఎంత ప్రగతిని సాధించినా ఆధ్యాత్మికరంగంలో కూలబడేవుంటాం. కనుక అతడు అయ్యో! నేనెంత దౌర్భాగ్యుణ్ణి! మరణకారకమైన ఈ శరీరం నుండి నన్ను విడిపించేదెవడు అని దీనంగా అరచాడు.

కాని నరుణ్ణి ఆ దౌర్భాగ్యస్థితినుండి విడిపించే ప్రభువు క్రీస్తు ఉన్నాడు - రోమా 7,24-25. అతని మరణోత్థానాలు మనకు రక్ష. క్రీస్తురాకముందు మనం ఎంత నిర్భాగ్యులమో అతడు వచ్చాక అంత ధన్యులమయ్యాం. తండ్రి దయతో క్రీస్తుద్వారా మన వెతలన్నీ

తొలగించాడు. మనలను నీతిమంతులను చేసాడు. తనకు శత్రువు లైనవారిని మిత్రులనుగా మార్చివేసాడు. మనం శక్తిలేని వాళ్లంగా వున్నపుడు ఉచితకాలంలో భక్తిహీనులకొరకై క్రీస్తు మరణించాడు - 5,6. మనమింకా పాపులంగానే వున్నపుడు క్రీస్తు మనకొరకు మరణించాడు అంటే దేవునికి మనపైవున్న ప్రేమ అర్థమౌతుంది -5,8. క్రీస్తురాకడ పాపులను పరిశుద్ధులను చేసింది.

## 7. క్రీస్తు వచ్చాక నరుల్లో కలిగిన మార్పు

పూర్వాధ్యాయంలో క్రీస్తు రాకముందు నరుల పరిస్థితి ఏలా వుందో పరిశీలించి చూచాం. ఇప్పుడు ఆ ప్రభువు వచ్చాక మన పరిస్థితి ఏలా మారిపోయిందో పరిశీలించాలి. క్రీస్తుద్వారా నరులు మళ్లా దేవునితో ఐక్యమయ్యారు. ఈ దశను పౌలు నూత్నసృష్టి అని పేర్కొన్నాడు. క్రీస్తు రాకడవల్ల నరుల పరిస్థితిని మార్చివేసిన అంశాలు ప్రధానంగా ఐదున్నాయి. అవి క్రీస్తుపట్ల విశ్వాసం, జ్ఞానస్నానం, క్రీస్తుతో ఐక్యత, తిరుసభ, సత్ప్రసాదం. ఈ యైదింటిద్వారా మనం క్రీస్తు రక్షణాన్ని సంపూర్ణంగా పొందుతాం. ఇక ఈ యైదు విషయాలను విపులంగా పరిశీలిద్దాం.

### 1. క్రీస్తుపట్ల విశ్వాసం

పౌలు భావాల ప్రకారం క్రీస్తుపట్ల విశ్వాసం అతి ముఖ్యమైన అంశం. అది లేందే మనకు రక్షణం లేదు. యూదమతాభిమానులు ధర్మశాస్త్రంలోని ఆజ్ఞలను పాటించడం ముఖ్యం అన్నారు. వారిదృష్టిలో అవి పుణ్యక్రియలు. వాటివల్లనే మనకు రక్షణం కలుగుతుందని వాళ్ల వాదం. పౌలు ఈ వాదాన్ని పూర్తిగా ఖండించి క్రీస్తు పట్ల విశ్వాసం ఒక్కటే మనకు రక్షణాన్ని ప్రసాదిస్తుంది అని బోధించాడు. నరుడు నీతిమంతుడు అయ్యేది విశ్వాసం వలనగాని

ధర్మశాస్త్రం ఆజ్ఞాపించే క్రియలను చేయడం వలన కాదు -రోమా 3,28.

కాని క్రీస్తు పట్ల విశ్వాసం అంటే యేమిటి? బోధకులు క్రీస్తుని బోధిస్తారు. ప్రజలు ఆ బోధను విని క్రీస్తుని నమ్ముతారు. తండ్రి అతన్ని పంపాడనీ, అతని మరణోత్థానాల ద్వారా మనకు రక్షణం కలుగుతుందనీ విశ్వసిస్తారు. దీనివల్ల వాళ్ళు జీవాన్ని పొందుతారు -10,8-10. మన భక్తివల్లా, మన పుణ్యక్రియలవల్లా మనం రక్షణం పొందం. తండ్రే క్రీస్తుద్వారా మనలను రక్షిస్తాడు. కనుక విశ్వాసమంటే దేవుణ్ణి నమ్మడం, అతనికి విధేయులం గావడం. నరుడు విశ్వాసానికి విధేయుడు కావాలి -1,5. దేవుని పలుకులను నమ్మాలి.

మన విశ్వాసానికి కర్త దేవుడే. మనంతట మనం విశ్వసించలేం. అది మననుండి రాదు, దేవునినుండే వస్తుంది. కనుక అది మనకు దేవుని వరం. విశ్వాసం ద్వారా దేవుని కృపచేతనే మీరు రక్షింపబడ్డారు. అది మీ వలన కలిగింది కాదు, దేవుని వరం -ఎఫె 2,8. ఐనా నరులు ఈ వరాన్ని నిరాకరించవచ్చు. దేవుని కుమారుడైన క్రీస్తుని అంగీకరించకపోవచ్చు. శతాబ్దాల పొడుగున చాలమంది ఈలాగే చేసారు గదా!

మనం విశ్వసించేది ఏవో కొన్ని నిర్జీవ సూత్రాలను కాదు, ఓ వ్యక్తిని. ఆ వ్యక్తి తండ్రి కావచ్చు, లేక క్రీస్తు గావచ్చు. వాళ్లిద్దరూ ఎప్పుడూ కలిసేవుంటారు. కనుక ఆ యిద్దరిలో ఎవరిని నమ్మినా యిద్దరినీ నమ్మినట్లే.

మనం మన పుణ్యకార్యాలద్వారా రక్షణాన్ని పొందలేం. క్రీస్తుని పంపిన తండ్రిని నమ్మి, క్రీస్తునినమ్మి రక్షణం పొందుతాం. ధర్మశాస్త్ర క్రియలు మనలను రక్షిస్తాయని వాదించేవాళ్ల మాటలు బడాయి మాటలు -రోమా 3,27.

విశ్వాసం ఓ రకమైన మనస్తత్వం. అది నిరంతరం మన హృదయంలో నిల్చివుంటుంది. నీ నోటితో యేసే ప్రభువని వొప్పుకొని, దేవుడు అతన్ని లేవనెత్తాడని హృదయంలో విశ్వసిస్తే నీవు రక్షణం పొందుతావు-10,9. విశ్వాసి క్రీస్తుతో ఐక్యమై అతడు ఆర్జించిన రక్షణంలో పాలుపొందుతాడు. విశ్వాసంగలవాడు పూర్తిగా క్రీస్తుతో కలసిపోతాడు. ఇక నేనుగాదు, నాయందు క్రీస్తే జీవిస్తున్నాడు. నన్ను ప్రేమించి నాకొరకు ప్రాణత్యాగం చేసికొనిన దేవుని పుత్రునియందలి విశ్వాసం చేతనే ఇప్పుడు నేను ఈ శారీరక జీవితాన్ని గడుపుతున్నాను అని చెప్పకొంటాడు -గల 2,20.

క్రీస్తుతో ఐక్యమైన విశ్వాసి ఆ ప్రభువు దేహంతో గూడ ఐక్యమైపోతాడు. ఆ దేహానికి క్రీస్తే శిరస్సు. ఆ దేహం క్రైస్తవ సమాజమే. క్రీస్తుపట్ల విశ్వాసం గలవాడు క్రీస్తు శరీరంలో అవయవాలైన తోడి క్రైస్తవులను గూడ ప్రేమిస్తాడు. వారికి ప్రేమతో సేవలు చేస్తాడు -గల 5,6. ఈ సేవాకార్యాలవల్ల మనకు రక్షణం కలగదు. రక్షణం పొందాం గనుక పర్యవసానంగా మనం సేవాకార్యాలు చేయాలి.ఈ సందర్భంలో పౌలు ఒకరినొకరు ప్రేమతో సేవించండి అన్నాడు -గల 5,13. అతనికి సోదరప్రేమ అతిముఖ్యమైన సూత్రం. 1కొరి 13వ అధ్యాయంలో ఆ ప్రేమలోని 11 లక్షణాలను వర్ణించాడు. ఈ ప్రేమవల్ల మన విశ్వాసం మృతవిశ్వాసంగాక సజీవవిశ్వాసం ఔతుంది -యాకో 2,14. మనచే ప్రేమ భావంతో సేవలు చేయించే మహాశక్తి పవిత్రాత్మే -రోమా 5,5.

మన విశ్వాసానికి గొప్ప ఆదర్శం అబ్రాహాము. అతడు ధర్మశాస్త్రం వలన రక్షణం పొందలేదు. అది అతడు గతించాక 400 ఏండ్లకు గాని రాలేదు. సున్నతి వలన రక్షణం పొందలేదు. దాన్ని

చేయించుకోకముందే అతడు పవిత్రుడు. అతడు కేవలం విశ్వాసం వల్లనే రక్షణం పొందాడు ఏలాగ? అతడు అతని భార్య వృద్ధులు. ఆ ముసలి ప్రాయంలో దేవుడు అబ్రాహాముకి నేను నీకొక కుమారుణ్ణి ప్రసాదిస్తాననీ, ఆ కుమారుని ద్వారా నీ సంతతి అనంతంగా వ్యాపిస్తుందనీ చెప్పాడు. అబ్రాహాము దేవుని వాక్కుని నమ్మాడు. ఆ నమ్మకం ద్వారా దేవుడు అతన్ని నీతిమంతునిగా గణించాడు. అనగా పుణ్యాత్ముణ్ణిగా ఎంచాడు -ఆది 15,6. ఇది అబ్రాహాము విశ్వాసం.

పౌలు ఈ విశ్వాసాన్ని రోమా 4,16-25లో విపులంగా వర్ణించాడు. అబ్రహాము నూరేండ్ల ముదుసలి. సారా గొడ్రాలు. ఐనా అతడు ఆ ప్రాయంలో గూడ దేవుని వాక్కు ప్రకారం తనకు సంతానం కలుగుతుందని నమ్మాడు. నమ్మకానికి ఆధారం లేనపుడు గూడ నమ్మాడు. దేవునికి తన వాగ్దానాన్ని నెరవేర్చే శక్తి వుందని నమ్మాడు. అతడు మృతులకు జీవమిస్తాడని నమ్మాడు. ఆ నమ్మకం వల్లనే దేవుడు అతన్ని నీతిమంతునిగా లెక్కించాడు. ఈ యబ్రాహాం విశ్వాసం నేడు మనకు కూడ అవసరం. తండ్రి క్రీస్తుని జీవంతో లేపినట్లే విశ్వాసం ద్వారా మనలను కూడ చావునుండి జీవానికి కొనిపోతాడు.

కనుక విశ్వాసమంటే దేవుని వాక్కునీ, అతని శక్తినీ నమ్మడం. ఆ దేవునికి ఆత్మనివేదనం చేసికోవడం. ఆ దేవుడు క్రీస్తుద్వారా మనలను రక్షిస్తాడని నమ్మి అతని అధీనంలో వుండిపోవడం. నూటికి నూరుపాళ్లు అతనిపై ఆధారపడి జీవించడం. విశ్వాసం లేకపోతే దేవునికి ప్రీతి కలిగించలేం -హెబ్రే 11,6. అది వుంటే చాలు రక్షణం పొందుతాం. ఇక్కడ చెప్పినదాన్ని బట్టి నేడు మన విశ్వాసంలో ఎంత గట్టితనంవుందో పరిశీలించి చూచుకొందాం.

## ౨. జ్ఞానస్నానం

పౌలు బోధల ప్రకారం విశ్వాసమూ జ్ఞానస్నానమూ కలసిపోతాయి. విశ్వాసానికి జ్ఞానస్నానం ముద్రలాంటిది. అనగా అది మన విశ్వాసాన్ని పదిలపరచేది. విశ్వాసం లోపల హృదయంలో వుంటుంది. బయటికి కన్పించదు. కాని జ్ఞానస్నానం సంస్కార రూపంలో వుండి బయటికి కన్పిస్తుంది. ఈ రెండిటిద్వారా మనం క్రీస్తుతో ఐక్యమౌతాం.

జ్ఞానస్నానం మనలను క్రీస్తుతోనే గాక క్రైస్తవసమాజంతో గూడ ఐక్యపరుస్తుంది. ఈ సమాజం క్రీస్తుదేహమే. మనమందరం ఒకే ఆత్మ ద్వారా ఒకే శరీరంగా జ్ఞానస్నానం పొందుతాం -1కొరి 12,13. దీని ద్వారా క్రీస్తు దేహంతో కలిసిపోతాం.

పౌలు జ్ఞానస్నానానికి కొన్ని ఉపమానాలు వాడాడు. నీరు మురికిని కడిగివేస్తుంది. ఆలాగే జ్ఞానస్నానం మన పాపమాలిన్యాన్ని కడుగుతుంది -1కొరి 6,11. ఈ సంస్కారం ద్వారా మనం క్రీస్తుని ఓ దివ్యవస్త్రంలాగ ధరిస్తాం -గల 3,27. ఆ రోజుల్లో గ్రీకు భక్తులు ఓ దేవత వస్త్రాలను ధరించి తామూ ఆ దేవతతో ఐక్యమైపోయామని చెప్పుకొనేవాళ్లు. కనుక ఇక్కడ క్రీస్తుని ధరించడమంటే అతనితో ఐక్యంగావడమని భావం. ఈ సంస్కారం ద్వారా మనకు మోక్షజీవితం ఇక్కడే ప్రారంభమౌతుంది -ఎఫె 2,5-6. ఇంకా ఈ క్రియద్వారా మనం నూత్న యిస్రాయేలు మౌతాం. పూర్వం యిస్రాయేలు ప్రజలు రెల్లు సముద్రం దాటి మోషే నాయకత్వాన జ్ఞానస్నానం పొందారు -1కొరి 10,1-2. కాని మనం క్రీస్తులోనికి జ్ఞానస్నానం పొందిన నూత్న యిస్రాయేలుమి.

కాని జ్ఞానస్నానాన్ని గూర్చిన పౌలు ముఖ్యభావం ఇది. ఈ సంస్కారం వలన మనం క్రీస్తుతోపాటు మరణించి, అతనితోపాటు

భూస్థాపితమై, అతనితోపాటు ఉత్థానమౌతాం -రో 6,3-5. తొలిరోజుల్లో పెద్దవాళ్లకు మాత్రమే జ్ఞానస్నానం ఇచ్చేవాళ్లు. వాళ్లను నీటి మడుగులో ముంచి బయటికి తీసికొని వచ్చేవాళ్లు. అది తొలినాటి జ్ఞానస్నానం. గ్రీకులో "బాప్టిజ్జో" అంటే నీటిలో ముంచడమనే అర్థం. క్రీస్తు చనిపోగా అతన్ని భూగర్భంలో పాతిపెట్టారు. ఇది క్రైస్తవుడు నీటి మడుగులోకి దిగడంలాంటిది. అది అతని మరణానికి పోలికగా వుంటుంది. క్రీస్తు ఉత్థానమై భూగర్భంనుండి వెలుపలికి వచ్చాడు. ఇది విశ్వాసి నీటిమడుగు నుండి వెలుపలికి రావడం లాంటిది. అది అతని వుత్థానానికి పోలికగా వుంటుంది. నేటి మన జ్ఞానస్నానంలో కూడ ఈ పోలికలు మనపై సోకుతాయి. ఈ పోలికలు మనలను క్రీస్తుతో ఐక్యపరచి మనం వరప్రనసాదం పొందేలా చేస్తాయి.

జ్ఞానస్నానం ద్వారా మనం క్రీస్తుతో చనిపోయి అతనితో ఉత్థానమౌతాం. పౌలు మనం క్రీస్తుతో పాటు చనిపోయామనీ, అతనితోపాటు భూస్థాపితమయ్యామనీ, అతనితోపాటు ఉత్థానమయ్యామనీ చాలాసార్లు చెప్తుంటాడు. ఈ భావాలను సూచించడానికి అతడు గ్రీకుమూలంలో "సున్" అనే ఉపసర్గను వాడుతుంటాడు. దీనికి "తోపాటు" అని అర్థం. అనగా క్రీస్తుతో పాటు అని అర్థం. ఇక్కడ ఈ "తోపాటు"ప్రయోగాలను కొన్నిటిని పేర్కొందాం.

మనం క్రీస్తుతోపాటు శ్రమలు అనుభవిస్తాం -రోమా 8,17
అతనితోపాటు సిలువ వేయబడతాం -6,6,
అతనితోపాటు మరణిస్తాం - 2తిమో 2,11.
అతనితోపాటు సమాధి చేయబడతాం -రోమా 6,4
అతనితోపాటు ఉత్థాన మౌతాం -కొలో 2,12

అతనితోపాటు జీవిస్తాం -రోమా 6,8.
క్రీస్తుతోపాటు అతని పోలికను పొందుతాం -ఫిలి 3,11.
అతనితోపాటు మహిమను పొందుతాం -రోమా 8,17.
అతనితోపాటు పరిపాలనాధికారం పొందుతాం -ఎఫె 2,6.
అతనితోపాటు పరిపాలిస్తాం -2తిమో 2,12.
అతనితోపాటు అతని రూపాన్ని పొందుతాం - రోమా 8,29.
అతనితోపాటు మోక్షానికి వారసులమౌతాం -రోమా 8,17.
క్రీస్తుతోపాటు భాగస్థులమౌతాం -ఎఫె 3,6.

ఈ ప్రయోగాలను బట్టి జ్ఞానస్నానం మనలను క్రీస్తుతో ఎంత గాఢంగా ఐక్యం జేస్తుందో అర్థంచేసికోవచ్చు.

తొలి ఆదాములాగే రెండవ ఆదామైన క్రీస్తు కూడ సామూహిక వ్యక్తి. అతడు మనలనందరినీ తనతో కలుపుకొని మనతోపాటు ఏకవ్యక్తి ఔతాడు. పౌలు మనం జ్ఞానస్నానం పొందింది క్రీస్తులోనికి అని చెప్తుంటాడు. ఇంకా క్రీస్తునామంలోనికి జ్ఞానస్నానం పొందామనిగూడ చెప్తుంటాడు -1కొరి 6,11. క్రీస్తు నామంలోనికి జ్ఞానస్నానం పొందడమంటే క్రీస్తు అనే వ్యక్తిలోనికి ప్రవేశించి అతనితో కలిసిపోవడం. అతని ఆస్తిగా మారి అతనికి సొంతమై పోవడం. ఈ సంస్కారం ద్వారా క్రీస్తుతో కలిసిపోయినపుడు అతని మరణోత్థానాలే మనకూ సంభవిస్తాయి. ఇంకా ఈ సంస్కారం ద్వారా మనం నూత్న సృష్టి ఔతాం -2కొరి 5,17. మొదటి సృష్టికి బదులుగా రెండవసృష్టి వస్తుంది. జ్ఞానస్నాన ఫలితాలు ఈలాగుంటాయి. ఈ క్రియద్వారా దేవుని ఆత్మ ఓ దేవాలయంలోలాగ మనలో వసిస్తుంది -1కొరి 6,19. ఈ క్రియవల్ల ఆత్మ మనలను దేవునికి దత్తపుత్రులను చేస్తుంది -గల 4,6.

తీతు జాబు 3,5-7 వచనాలు జ్ఞానస్నానాన్ని సంగ్రహంగా వర్ణిస్తాయి. ఇక్కడ మొత్తం ఐదంశాలు వున్నాయి. 1. జ్ఞానస్నానం స్నానం. మామూలు స్నానం భౌతికమైన మాలిన్యాన్ని లాగే ఇది మన పాపమాలిన్యాన్ని కడిగివేస్తుంది. 2. ఇది మనకు నూత్న జన్మనిస్తుంది. మనం మొదటి జన్మవలన పాపానికి దాసుల మయ్యాం. ఈ రెండవ జన్మ వలన దేవుని బిడ్డలమౌతాం. 3. ఇది మనకు నూత్నత్వాన్ని ఇస్తుంది. ఆత్మ అనుగ్రహం వల్ల నరుడు తనలోని ప్రాత మానవుణ్ణి విడనాడి నూత్న మానవుణ్ణి పొందుతాడు. అతడు పూర్తిగా మారిపోయి క్రొత్త నరుడు ఔతాడు. 4. ఈ సంస్కారంలో మనం ఆత్మను పొందుతాం. తండ్రి క్రీస్తుద్వారా ఆత్మను మన హృదయాల్లో కుమ్మరిస్తాడు. 5. ఈ సంస్కారం మనలను దత్తపుత్రులనుగా మార్చి మోక్షానికి వారసులను చేస్తుంది. ఈ మోక్షం మనకింకా లభించలేదు. కాని ఒకరోజు అది మనకు లభించడం ఖాయం.

తొలిరోజుల్లో పెద్దవాళ్లకే జ్ఞానస్నానం ఇచ్చేవాళ్లు. అదీ మడుగులో ఇచ్చేవారు. నీటిలోనికి పోవడం నీటినుండి బయటికి రావడం వారికి దివ్యమైన అనుభూతిని కలిగించేవి. కనుక వారికి జ్ఞానస్నానం మరపురాని సంఘటనంగా వుండేది. నేడు మనం శిశువులంగా జ్ఞానస్నానం పొందుతున్నాం. అదీ నొసటిమీద నీళ్లు పోయడం ద్వారా. కనుక పూర్వులకు కలిగిన దైవానుభూతి ఇప్పుడు మనకు కలగడం లేదు. క్రైస్తవ జీవితమంటే ప్రధానంగా జ్ఞానస్నాన జీవితమే. క్రీస్తుతో ఐక్యమై జీవించడమే. మనం జ్ఞానస్నానాన్ని మించిన పవిత్రతను ఏనాడు సాధించలేం.

## 3. క్రీస్తుతో ఐక్యత

*ఇక్కడ మూడంశాలను పరిశీలిద్దాం.*

**1. క్రీస్తుతో ఐక్యత**

నరుడు పాపాన్నీ, శరీరాన్నీ, ధర్మశాస్త్రాన్నీ త్యజించి క్రీస్తులోనికి జ్ఞానస్నానం పొందుతాడు. దాని వలన ఆ ప్రభువుతో ఐక్యమౌతాడు. అతని లోనికి ప్రవేశిస్తాడు. అతనితో కలిసిపోతాడు.

"క్రీస్తునందు" అనే ప్రయోగం పౌలు జాబుల్లో 200 సార్లు కన్పిస్తుంది. (గ్రీకులో ఎన్ క్రీస్తో). ఈ ప్రయోగానికి క్రీస్తు క్రైస్తవుడు కలిసి ఏకవ్యక్తిగా జీవిస్తారని, అనగా ఒకే జీవితం గడుపుతారని భావం. "ఎవడైన క్రీస్తునందు వుంటే అతడు నూత్న వ్యక్తి ఔతాడు" -2కొరి 5,17. ప్రాతసృష్టి, ప్రాత ఆదాము పాపానికి చిహ్నాలు. నూత్న సృష్టి నూత్న ఆదాము పవిత్రతకు చిహ్నాలు. పౌలు కొన్నిసార్లు నరుడు క్రీస్తునందు ఉంటాడు అని చెప్తాడు. కొన్నిసార్లు క్రీస్తే నరునియందు ఉంటాడు అని చెప్తాడు. రెండిటి భావం ఒకటే. "ఇక జీవించేది నేను కాదు నాయందు క్రీస్తే జీవిస్తున్నాడు" -గల 2,20. అనగా క్రైస్తవునికి ప్రత్యేకమైన మనుగడ లేదనీ, అతని జీవితం క్రీస్తుజీవితంతో కలిసిపోయిందనీ భావం.

పౌలు భావాల ప్రకారం "క్రీస్తునందు" అంటే ఓ స్థలంలో వుండడం కాదు. నరుడు క్రీస్తు శక్తికీ వరప్రసాదానికీ లోను గావడం. పౌలు జాబుల్లో క్రీస్తునందు అనే ప్రయోగానికి కనీసం మూడర్థాలు కన్పిస్తాయి. మొదటిది, క్రీస్తునందు అంటే నరులు నూత్నజీవాన్ని పొందడం. ఎవడైన క్రీస్తునందు వుంటే నూత్న సృష్టి ఔతాడు -2కొరి 5,17. క్రీస్తునందు వుండడం వల్ల నరులు దేవుని కుమారులు ఔతారు. పరిశుద్ధులు, వెలుగు ఔతారు. తీర్పుకి గురికారు.

రెండవది, క్రీస్తునందు అంటే నరులు నీతిమంతులు

కావడం. మనం నీతిమంతులం కావడానికి దేవుడు క్రీస్తుని పాపంలో పాలు పంచుకొనేలా చేసాడు -2కొరి 5,21.

మూడవది క్రీస్తునందు అంటే నరులు దివ్యశక్తిని పొందడం. నన్ను బలపరచేవాని శక్తిచే నేను ఏ కార్యాన్నయినా సాధించగలను -ఫిలి 4,13.

మనం ఐక్యమయ్యేది ప్రధానంగా ఉత్థానక్రీస్తుతో. పౌలుకి పాలస్తీనా దేశంలో జీవించిన క్రీస్తుకాక ఉత్థాన క్రీస్తు ముఖ్యం -2కొరి 5,16. ఉత్థానక్రీస్తు తన ఆత్మద్వారా మనకు దివ్యత్వాన్ని ప్రసాదిస్తాడు. మొదటి ఆదాము జీవించే ప్రాణి అయ్యాడు. కాని రెండవ ఆదామైన క్రీస్తు జీవమిచ్చే ఆత్మ అయ్యాడు -1కొరి 15,45. అనగా మొదటి ఆదాము తనకుతాను జీవించాడు. రెండవ ఆదామైన క్రీస్తు మనకు జీవాన్ని ప్రసాదించేవాడు అయ్యాడు. ఆత్మద్వారా అతడు మనకు జీవాన్ని ఇస్తాడు. అతడు మనలను తనకు సొంతం జేసికొంటాడు. ఇక మనం అతనికి చెందిన ఆస్తివంటివాళ్లమౌతాం. అనగా అతనికి ప్రీతిపాత్రులం, విలువగలవాళ్లం ఔతాం. అతడు మనలో వసిస్తూ మనకు తన రూపాన్ని దయచేస్తాడు. మనం అతనితో సారూప్యం చెందుతాం -రోమా 8,29. ఈ విధంగా మనం క్రీస్తు సంపూర్ణతకు సమానమైన సంపూర్ణతను పొందుతాం -ఎఫె 4,13.

పౌలు తరచుగా క్రైస్తవులను పరిశుద్ధులు అని పేర్కొంటాడు -రోమా 1,7. క్రీస్తుతో ఐక్యమై అతని సొత్తు కావడం వల్లనే క్రైస్తవులు పరిశుద్ధులు అయ్యారు. ఇది వారి ఘనత.

పౌలుకి మనం ఉత్థాన క్రీస్తుపట్ల విశ్వాసం వుంచడం ముఖ్యం. ఈ విశ్వాసం భక్తుని జీవితంలో ప్రతిక్షణం కన్పించాలి. అతడు జీవితాంతం క్రీస్తుపై ఆధారపడి, క్రీస్తుని నమ్మి జీవించాలి. విశ్వాస వాతావరణంలో వుండిపోవాలి. నిరంతరం క్రీస్తుతో చనిపోయి

అతనితో ఉత్థాన మౌతుండాలి. మనం క్రీస్తుతో శ్రమలు అనుభవిస్తే అతనితోపాటు మహిమను పొందుతాం -రోమా 8,17. ఈ భావం పౌలుకి చాల ప్రీతికరమైంది. అందుకే అతడు క్రీస్తుతోపాటు శ్రమలు అనుభవించి, మృత్యువునందు అతన్ని పోలివుండి, అతని పునరుత్థాన ప్రభావాన్ని అనుభవించాలని ఉవ్విళ్ళూరాడు. ఈ భాగ్యాలన్నీ తనకు క్రీస్తుపట్ల గల విశ్వాసంద్వారానే లభిస్తాయని నమ్మాడు. క్రీస్తుతో పోలిస్తే ఈ లోకవస్తువులన్నీ పెంటప్రోవులాగ విలువలేనివని భావించాడు -ఫిలి 3,8-11.

పౌలు తాను క్రీస్తుతో ఐక్యమయ్యాననీ క్రీస్తు శక్తిని పొందాననీ నమ్మాడు. ఈ యైక్యతను గూర్చి అతడు చాలాసార్లు చెప్పుకొన్నాడు. ఇక్కడ కొన్ని ఉదాహరణలు చూద్దాం. అతడు క్రీస్తుతో పాటు సిలువ వేయబడ్డాడు -గల 2,19. క్రీస్తుతోపాటు చనిపోయి భూస్థాపితుడు అయ్యాడు -రోమా 6,3-4. తన దేహంలో క్రీస్తుమరణాన్ని వహించాడు -2కొరి 4,10. క్రీస్తు శ్రమల్లో తానూ పాలుపంచుకొన్నాడు -2కొరి 1,5. క్రీస్తుతోపాటు తానూ ఉత్థానమై మహిమను పొందుతాడు -రోమా 6,8. క్రీస్తుతోపాటు తానూ మోక్షరాజ్యానికి వారసుడు ఔతాడు -రోమా 8,17. ఇంకా అతడు ఇప్పుడు నేను గాదు, నాయందు క్రీస్తే జీవిస్తున్నాడు అని చెప్పుకొన్నాడు -గల 2,20. నాకు జీవించడమంటే క్రీస్తుని జీవించడమే అన్నాడు -ఫిలి 1,21. క్రీస్తుతో పోలిస్తే లోకవస్తువులన్నీ పెంటప్రోవులాగ విలువలేనివని యెంచాడు -ఫిలి 3,8. క్రీస్తుని బోధించకపోతే తనకు పుట్టుగతులు వుండవనుకొన్నాడు -1కొరి 9,16. క్రీస్తుని ప్రేమించనివాడు శాపగ్రస్తుడు అని పలికాడు -1కొరి 16,22. డమస్కు త్రోవలో క్రీస్తు వేటకుక్కలాగ వచ్చి తన్ను పట్టుకొన్నాడు. తానిప్పుడు క్రీస్తుని పట్టుకోవాలని అతని వెంట పరుగెత్తుతున్నాడు -ఫిలి 3,12. తాను చనిపోయి క్రీస్తుని చేరుకోవాలని గాఢంగా

వాంఛించాడు -ఫిలి 1,23. తనశరీరంలో క్రీస్తు ముద్రలు లేక శ్రమలు ధరించాడు -గల 6,17.

ఇంకా పౌలు తనలాగే క్రైస్తవులు కూడ క్రీస్తుతో ఐక్యమైయుండాలని కోరుకున్నాడు. జ్ఞానస్నానం ద్వారా వాళ్లకు ఈ యైక్యత ఇదివరకే సిద్ధించింది. దాన్ని వాళ్లు సఫలీకృతం చేసి కోవాలి. కనుకనే అతడు మీయందు క్రీస్తురూపం ఏర్పడిందాకా నేను మిమ్ముగూర్చి ప్రసవవేదన అనుభవిస్తున్నాను అని గలతీయులను హెచ్చరించాడు -4,19. అనగా గర్భవతి బిడ్డను కన్నట్లుగా తాను గలతీయుల హృదయాల్లో విశ్వాసరీత్యా క్రీస్తు శిశువును కంటాడని భావం. వాళ్ల హృదయాలు క్రీస్తుతో ఐక్యమైయుండాలని ఫలితార్థం. ఇంకా, విశ్వాసంద్వారా క్రీస్తు మీ హృదయాల్లో నివసించుగాక అని ఎఫెసీయులను హెచ్చరించాడు -3,17.

ఉత్థాన క్రీస్తు తండ్రి కుడిచెంత ఆసీనుడై తన శక్తితోను బలంతోను విశ్వాసుల హృదయాలను నింపుతుంటాడు. వాళ్లు అతనివలన ప్రభావితులు ఔతారు. నడిపింపబడతారు. అతడు ఇచ్చేవాడు. వాళ్లు తీసికొనేవాళ్లు. పౌలుకీ క్రీస్తుకి వున్న ఐక్యతే మనకూ క్రీస్తుకూ కూడ వుండాలి. క్రీస్తులోనికి జ్ఞానస్నానం పొందిన మనం అతన్ని ఓ దివ్యవస్త్రంలా ధరించాలి -గల 3,27. సంగ్రహంగా చెప్పాలంటే, క్రీస్తుతో ఐక్యమైన క్రైస్తవులు ప్రాత జీవితాన్ని వదలుకొని క్రొత్త జీవితం గడపాలి. తండ్రి వారిని అంధకార శక్తి నుండి విడిపించి తన ప్రియపుత్రుని వెలుగు సామ్రాజ్యంలోనికి తోడ్కొనివచ్చాడు -కొలో 1,13.

**2. తండ్రితో ఐక్యత**

క్రీస్తుతో ఐక్యత సహజంగానే తండ్రితోగూడ ఐక్యతను చేకూర్చి పెడుతుంది. అసలు మన రక్షణ ప్రణాళికను సిద్ధం జేసింది

తండ్రే. అతడు తానెన్నుకొన్నవారిని తన కుమారుని రూపం పొందేలా చేసాడు. తానెన్నుకొన్నవారిని పిల్చి నీతిమంతులను జేసాడు. వారికి తన మహిమలో పాలిచ్చాడు -రోమా 8,28-30. లోకసృష్టికి పూర్వమే అతడు క్రీస్తు ద్వారా మనలను ఎన్నుకొన్నాడు. మనం పవిత్రులంగాను నిర్దోషులంగాను వుండాలని అతని కోరిక. క్రీస్తు ద్వారా మనలను తన పుత్రులనుగా చేసికొన్నాడు. క్రీస్తుద్వారా తన రక్షణ ప్రణాళికను మనకు తెలియజేసాడు -ఎఫె 14-7. ఈలాంటి తండ్రితో మనం ఐక్యమౌతాం.

దేవుని ఆత్మ మనచే దేవుణ్ణి అబ్బా- నాన్నా అని పిలిపిస్తుంది. మనలను దేవునికి దత్తపుత్రులను చేస్తుంది -రోమా 8,15-16. నరమాత్రుడు దేవునికి బిడ్డడు కావడం సామాన్య భాగ్యమా? క్రీస్తు ద్వారా మనం దేవునికి దత్తపుత్రులం ఔతాం. క్రైస్తవుడు ప్రధానంగా దేవునికి తనపట్లగల ప్రేమను అనుభవపూర్వకంగా తెలిసికొనినవాడు.

దేవుడు మన పక్షాన వుంటే మనకు కీడు చేసే విరోధి ఎవడూ వుండడు. తనసొంత కుమారునే మనకిచ్చిన తండ్రి ఇతర వస్తువులను కూడ యిస్తాడు. క్రీస్తుద్వారా తండ్రికి మనపట్ల గల ప్రేమనుండి బాధగాని హింసగాని మరణంగాని మనలను వేరు చేయలేవు -రోమా 8,31-35.

**3. ఆత్మతో ఐక్యత**

క్రీస్తుతో ఐక్యత ఆత్మతోగూడ ఐక్యతను సాధించి పెడుతుంది. తండ్రి రక్షణప్రణాళికను తయారు చేసింది నరునికి దివ్యత్వాన్ని ఈయడానికే. నరుణ్ణి దత్తపుత్రుని చేయడంద్వారా అతనికి ఈ దివ్యత్వం సిద్ధిస్తుంది. తండ్రి ఉత్థాన క్రీస్తుద్వారా నరునికి ఆత్మను ప్రసాదిస్తాడు. ఈయాత్మవలన నరుడు దత్తపుత్రుడు ఔతాడు. క్రైస్తవుడు ఒకసారి ఆత్మను పొందాక ఇక అతన్ని నడిపించేది ఆయాత్మే -రోమా 8,14.

ఆత్మ క్రీస్తుకలిసే క్రైస్తవుల్లో పనిచేస్తుంటారు. కనుక పౌలు ఈయిద్దరి పేర్లు పరస్పరం మారుస్తుంటాడు. మన చేత తండ్రిని నాన్న అనిపిలిపించేది ఆత్మ. మనచేత ప్రార్థన చేయించేది ఆత్మ. కాని పౌలు కొన్నిసార్లు ఈ రెండు పనులు క్రీస్తు చేయిస్తాడని చెప్తుంటాడు.

మనం జ్ఞానస్నానం పొందినపుడే దేవుడు తన ఆత్మను మనకు సంచకరువుగా (బయానాగా) ఇచ్చాడు -2కొరి 1,22. సంచకరువు క్రయవిక్రయాల్లో మొదట చెల్లించే కొద్దిపాటి సొమ్ము. ఇది తర్వాత పూర్తిసొమ్ము చెల్లిస్తారు అనడానికి సూచనంగా వుంటుంది. తండ్రి మొదట జ్ఞానస్నానంలో మనకు ఆత్మనిచ్చినపుడే మనకు రక్షణం కొంతవరకు వచ్చింది. తర్వాత ఈ రక్షణం పూర్తిగా సిద్ధిస్తుంది అనడానికి ఆత్మే సూచనంగా వుంటుంది. నరుడు క్రీస్తుని విశ్వసించడం ద్వారా ఆత్మమూలాన రక్షణం పొందుతాడు. సంపూర్ణ క్రీస్తుగా తయారౌతాడు -ఎఫె 4,13. మొదటి మహిమకంటె అధికమైన మహిమను పొంది క్రీస్తు పోలికను ధరిస్తాడు -2కొరి 3,18.

పవిత్రాత్మ తిరుసభకే ఆత్మ. మన ఆత్మ మన శరీరంలోని అవయవాలన్నిటిని ఒక్కటిగా బంధిస్తుంది. వాటికి జీవశక్తిని ఇస్తుంది. మనం ఒక్కవ్యక్తిగా పనిచేసేలా చేస్తుంది. ఈలాగే పవిత్రాత్మ తిరుసభలోని ప్రజలందరిని ఐక్యపరుస్తుంది. నిరంతరం మనలను విభజించే జాతి, కులం, లింగం మొదలైన భేదభావాలన్నిటినీ తొలగిస్తుంది.

ఆత్మ తిరుసభకూ, ఆ సభలోని సభ్యులు ఒక్కొక్కరికీ కూడ అతిథి. ఇప్పుడు మనలను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించేది ప్రధానంగా ఆత్మే. ఆత్ముడు మనకు సప్తవరాలు, సేవావరాలు,

నవఫలాలు దయచేస్తాడు. అంత మాత్రమేగాదు, తన్నే మనకు ప్రధాన వరంగా ఇచ్చుకొంటాడు.

ఆత్మ మనకు దేవుణ్ణీ దైవరహస్యాలనూ తెలియజేస్తుంది - 1 కొరి 2,10. తండ్రి క్రీస్తు ద్వారా నరులను రక్షిస్తాడనే రహస్యాన్ని పౌలుకి తెలియజేసింది ఈయాత్మే. ఇప్పుడు మనం వేదసత్యాలను లోతుగా అర్థంజేసికొనేలా చేసేది కూడ ఈ ప్రభువే. మన తరపున మనం ఆత్మ ప్రబోధాలను వినాలి. ఆత్మప్రేరణం ప్రకారం నడచుకోవాలి. దీన్నే పౌలు ఆత్మానుసారంగా జీవించడం అన్నాడు - రోమా 8,4. ఆత్మచే నడిపింపబడ్డం అనికూడ పేర్కొన్నాడు - రోమా 8,14.

పౌలుపవిత్రాత్మను గూర్చి చాల విషయాలు చెప్పాడు. వాటిల్లో ప్రస్తుతానికి 11 అంశాలను పరిశీలిద్దాం.

1. జ్ఞానస్నాన సమయంలో ఆత్మ మన హృదయం మీద క్రీస్తుని ముద్రవేస్తుంది. కనుకనే పౌలు "మీరు ఆత్మచేత ముద్రింప బడితిరి" అన్నాడు - ఎఫె 1:13. ఆరోజుల్లో బానిసల మీద యజమానుని ముద్ర, భక్తుల మీద దేవతలముద్ర వుండేవి. ఆ బానిసలు ఆ యజమానులకూ, ఆ భక్తులు ఆ దేవతలకూ చెందిన వాళ్లని ఈ ముద్రభావం. జ్ఞానస్నానానికి ముందు మనమీద పిశాచముద్ర వుంటుంది. జ్ఞానస్నానానంతరం క్రీస్తు ముద్రను పొందుతాం. అనగా మనం జ్ఞానస్నానంతో పిశాచ యాజమాన్యాన్ని తప్పించుకొని క్రీస్తుని యజమానునిగా పొందుతామని భావం.

2. ఆత్మ మనకు దైవపుత్రత్వాన్ని దయచేస్తుంది - రోమా, 8:14-16. ఆ యాత్మ అనుగ్రహంవలన దేవుణ్ణి అబ్బా - అనగా నాన్నా అని పిలుస్తాం. పూర్వవేదంలోని యూదులు దేవుణ్ణి

చూడటానికి భయపడ్డారు. తాము దేవునికి బానిసలమనుకొన్నారు. నూత్నవేదంలో మనం దేవునికి బానిసలంగాదు, దత్తపుత్రులం. కనుక దేవుని పట్ల మనకుండవలసింది చౌరవగాని భయంకాదు.

3. జ్ఞానస్నానం పొందినప్పటి నుండి ఆత్మమనలను దేవాలయాలనుగా మారుస్తుంది -1కొ 6:19. మందిరంలో దేవుళ్లాగ తాను మనలో నెలకొనివుంటుంది. మనలను పవిత్ర పరుస్తుంది. యెరూషలేం దేవాలయంలో గొర్రెపిల్లలను బలియిచ్చేవాళ్లు. ఆత్మమనలను నిర్మలమైన గొర్రెపిల్లలనుగా తయారుచేసి బలికి సిద్ధంచేస్తుంది - రోమా 15:16.

4. ఆత్మప్రేమశక్తిని మన హృదయాల్లో కుమ్మరిస్తుంది - రోమా 5:5. ఈ ప్రేమతోనే మనం దేవుణ్ణి తండ్రిగా ప్రేమిస్తాం. క్రీస్తుని రక్షకుణ్ణిగా ప్రేమిస్తాం. ఇంకా తోడి నరులను తోబుట్టువులనుగా ప్రేమిస్తాం. మన శరీరానికి ఆత్మవుంది. దేహంలోని అవయవాలన్నిటినీ ఐక్యపరచేది ఆత్మ. అలాగే తిరుసభ అనే జ్ఞాన దేహంలోని సభ్యులందరినీ ఐక్యపరచేది పావనాత్మ. పొడిపిండి ముద్దకాదు, తడిపిండి ముద్ద ఔతుంది. ఆత్మ మనలను తడిపిండి లాగ చేస్తుంది. ఆ దివ్యశక్తి లేకపోతే మనకు సోదరప్రేమ అలవడదు. దివ్యాత్మ క్రైస్తవ సమాజమంతటిని ఒక్కమందిరంగా నిర్మిస్తుంది.

5. ఆత్మ మనకు ప్రార్థనా శక్తిని దయచేస్తుంది. మనంతట మనకు ఏలా జపించాలో, ఏమి జపించాలో తెలియదు. ఆత్మమన హృదయాల్లో వుండి మనచేత జపం చేయిస్తుంది - రోమా 8:26-27. తల్లి తాను నడుస్తూ చిన్నబిడ్డను నడిపిస్తుంది. బిడ్డకు నడక నేర్పిస్తుంది. అలాగే ఆత్మ మనహృదయంలో తాను ప్రార్థనచేస్తూ మన చేత ప్రార్థన చేయిస్తుంది. మన ప్రార్థనను దేవునికి అర్పిస్తుంది.

భక్తులకూ పునీతులకూ ప్రార్థన నేర్పింది పవిత్రాత్మే. ప్రార్థనను నేర్పమని మనంకూడ ఆ యాత్మను అడుగుకోవాలి. ఉత్థాన క్రీస్తు మోక్షంలో వుండి మన కొరకు ప్రార్థన చేస్తుంటాడు - హెబ్రే 7:25. కాని ఆత్మ మన హృదయంలోనే వుండి మన కొరకు జపిస్తుంటుంది. మనం చేసిన కొద్దిపాటి జపాలు కూడ ఆయాత్మ ప్రేరణం లేందే చేసివుండం.

6. ఆత్మ మనకు నాయకుడు. దేవుని ఆత్మచే నడిపింపబడే వాళ్ళు దేవుని బిడ్డలు -రోమా 8:14. ఒకవైపు పిశాచంబిడ్డలను పిశాచం నడిపిస్తుంది. వాళ్ళచేత దుష్కార్యాలు చేయిస్తుంటుంది. మరోవైపు దేవుని ఆత్మ భక్తులను నడిపించి వారిచే సత్కార్యాలు, పుణ్యకార్యాలు చేయిస్తుంది. కాని ఆత్మ మనలను ఏలా నడిపిస్తుంది? దివ్యాత్ముడు మన మనసులో మంచి కోరికలు పుట్టిస్తాడు. ఈ కోరికలనే మనం క్రియలుగా మార్చుకొంటాం. ఇవే మన సత్క్రియలు. ఆత్మ వలననే మనం మంచి నిర్ణయాలు చేసికొంటాం. వీటి ప్రకారం మంచి పనులు చేస్తాం.

7. మనలో శరీర వాంఛలకూ ఆత్మ వాంఛలకూ మధ్య నిరంతరం పోరాటం జరుగుతూంటుంది. శరీరవాంఛలు పాపాన్ని, ఆత్మవాంఛలు పవిత్రతనూ కోరుకొంటాయి. ఈ పోరాటంలో ఆత్ముడు మన పక్షాన నిల్చి ఆత్మవాంఛలను గెలిపిస్తాడు. కావుననే మనం కొద్దిగానైనా పుణ్యక్రియలు చేయగల్గుతున్నాం. లేకపోతే అసలే రాక్షసులమై పోతాం -రోమా 8:5-9.

8. ఆత్మ మనకు ఫలాలనిస్తుంది. వీటి వలన దివ్యజీవితం గడుపుతాం -గల 5:22-23. శరీరవాంఛల వలన పుట్టుకు వచ్చే దుష్టకార్యాలను జయిస్తాం -గల 5:19-21. ఇంకా ఆత్మ మనకు

వరాలనిస్తుంది. వీటిద్వారా క్రైస్తవ సమాజానికి సేవలు చేసి దాన్ని ఓ భవనంలా నిర్మిస్తాం. ఈ వరాలనే శక్తిసామర్థ్యాలు అంటాం -1కొ 12,7-11. స్వార్థంకొద్దీ మనం ఇతరులకు సేవలు చేయం. కాని ఆత్మ మనలను సేవాపరులనుగా మార్చివేస్తుంది.

9. ఆత్మ మనకు ఉత్థాన భాగ్యాన్ని దయచేస్తుంది -రోమా 8:11. క్రీస్తుని ఉత్థానం చేసింది ఆత్మే. మనకు ఉత్థానాన్ని దయ చేసేది కూడ ఆ యాత్మయే. ఉత్థానంతర్వాత మోక్షభాగ్యంలభిస్తుంది. ఆ భాగ్యం మనకు తప్పక సిద్ధిస్తుంది అనడానికి ఆత్మ హామీగా వుంటుంది. బయానాగా వుంటుంది-ఎఫే 1:14.

10. ఆత్మ మనకు ఇన్ని పనులు చేసి పెట్టినా అవన్నీ ఒకటే పని అనుకోవాలి. ఆ వొక్కపని, మనకు క్రీస్తుని ఈయడమే. మనం జ్ఞాన స్నానంలోనే ఆత్మను పొందుతాం. అప్పటినుండి ఆత్మ చేసేపని మనలను క్రీస్తుతో జోడించడమే. ఆ యాత్మ వలన తప్ప మనం యేసే ప్రభువు అని అంగీకరించలేం -1 కొరి 12:3. ఇక్కడ ప్రభువు అంటే దేవుడు అని అర్థం. క్రీస్తుని దేవుణ్ణిగా విశ్వసించే భాగ్యం మనకు ఆత్మ నుండిగాని రాదు. విశ్వాస వరం ఆ యాత్మ పెట్టే భిక్ష.

11. ఆత్మ మనకు ఇన్ని మేళ్లు చేస్తుంటే మనం కూడ ఆత్మ పట్ల మనకున్న బాధ్యతలను పాటించాలి. ఆత్మను దుఃఖ పెట్టవద్దు అన్నాడు పౌలు -ఎఫే 4:30.మనం పాపం కట్టుకొన్న పుడల్లా ఆత్మను దుఃఖపెడతాం. దుష్టాత్మ పవిత్రాత్మకు శత్రువు. మనం పిశాచంతో చేతులు కలిపి పాపం చేసినపుడు ఆత్మకు బాధకలుగుతుంది. కనుక క్రైస్తవుడు పాపాన్ని మానుకోవాలి. ఇంకా, ఆత్మను ఆర్పివేయవద్దు అన్నాడు పౌలు - 1 తెస్స 5:19. (ఇక్కడ

మూలంలోని గ్రీకు మాటకు అడ్డగించడం, ఆర్పివేయడం అని రెండర్థాలు వున్నాయి). పవిత్రాత్మ అంతరంగంలో ఓ దీపంలా వెలుగుతూంటుంది. పాపం చేసినపుడు ఈ దీపాన్ని ఆర్పివేసి కొంటాం. హృదయాన్ని చీకటితో నింపుకొంటాం. చీకటి పిశాచానికి చిహ్నం. ఆత్మ మన హృదయంలో దీపంలా వెలుగుతూ మనకు సత్ ప్రేరణలను కలిగిస్తుంది. ఈ దివ్య దీపాన్ని ఆర్పివేసికొన్నపుడు దాని నుండి వచ్చే ప్రేరణలను కూడా అణచివేసికొంటాం. ఈ పని చేయకూడదు.

ఓరిజిన్ రెండవ శతాబ్దికి చెందిన వేదశాస్త్రి. అతడు జన్మించినపుడు అతని తండ్రి లియొనిడెస్ అతని రొమ్ముని ముద్దు పెట్టుకున్నాడు. బిడ్డ వక్షాన్నెందుకు ముద్దు పెట్టుకొన్నావని అడగ్గా లియోనిడెస్ ఈ బిడ్డకు ఇప్పుడే జ్ఞానస్నాన మిచ్చారు. దేవుని ఆత్మ ఇతని హృదయంలో ఓ దేవళంలో లాగా నెలకొని వుంది. కనుక నేను ఇతని వక్షాన్ని ముద్దుపెట్టుకొన్నాను అని చెప్పాడు. ప్రాచీన క్రైస్తవులకు ఆత్మపట్లవున్న భక్తి ఆలాంటిది. నేడు మనకు ఆత్మ పరిజ్ఞానం చాల తక్కువ. తనపట్ల అవగాహననూ భక్తినీ దయచేయమని ఆ దివ్యాత్మనే అడుగుకొందాం.

## 4. తిరుసభ

జ్ఞానస్నానం ద్వారా నరుడు క్రీస్తుకి సహవాసి ఔతాడు. అతనితో కలసి పోతాడు - 1 కొరి 1,9. తన భక్తులతో కలసి పోయిన క్రీస్తు వారికి సమకాలికుడు ఔతాడు. వారితో కలసి వసిస్తాడు. జ్ఞానస్నానం ద్వారా మనలో వుండే భేదభావాలు తొలగిపోతాయి. ఇక యూదుడని అన్యుడని లేదు. బానిస అని స్వతంత్రుడు అని లేదు. స్త్రీయని పురుషుడు అని లేదు. క్రీస్తు యేసునందు మీరందరు ఒక్కరే -గల 3,28. క్రీస్తు మనకు సమకాలికుడు

మాత్రమే కాదు. సామాజికుడు కూడ. అనగా అతడు మన సమాజంలో వసిస్తాడు.

పూర్వం సీనాయి నిబంధనం ద్వారా యిస్రాయేలు ప్రజలు ఒక్క సమాజం అయ్యారు. ఇప్పుడు క్రీస్తు సిలువ నిబంధనం ద్వారా మన మంతా ఒక్క సమాజమౌతాం. ప్రభువు తన ఆజ్ఞలను మన హృదయఫలకాలమీదనే వ్రాస్తాడు. దీనిద్వారా మనం నూత్నవేద ప్రజలం ఔతాం. ఇదే తిరుసభ.

పౌలు తిరుసభను క్రీస్తు దేహం అని పిల్చాడు -1 కొరి 12,12-13. ఇక్కడదేహం అంటే వ్యక్తి అని భావం. క్రీస్తు తిరుసభ కలసి ఏకవ్యక్తి ఔతారు. దేహం లేక శరీరానికి హీబ్రూలో బసార్ అనీ గ్రీకులో సోమ అనీ పేర్లు. రోమనులు తమ సమాజంలోని ప్రజలంతా కలసి ఒక్క దేహం అనుకొన్నారు. అందరూ కలసి ఒకే వ్యక్తిగా, ఒకే ఆశయ సాధనం కొరకు కృషి చేయాలి అనుకొన్నారు. ఈ యాశయం సామ్రాజ్యంలో శాంతిని స్థాపించడం, అభివృద్ధిని సాధించడం మొదలైనవి. పౌలు ఈ భావాన్ని క్రీస్తుకి అన్వయించాడు. క్రీస్తు క్రైస్తవులు కలసి ఒక్క శరీరంగా అనగా ఒక్క వ్యక్తిగా ఐక్యమౌతారు అన్నాడు -1కొరి 12,27. క్రీస్తు లోనికి ఐక్యమైన వాళ్లు పరస్పరం ఐక్యమైతారు. ఒకే శరీరంలోని వేరువేరు అవయవాల వలె మనమందరం పరస్పరం సంబంధం కలిగివుంటాం - రోమా 12,5. ఇంకా, ఒకే రొట్టెలో పాలు పొందే మన మందరం ఒకే శరీరం ఔతాం -1కొరి 10,17.

మనం క్రీస్తుతో ఐక్యంగావడం ఎంత ముఖ్యమో మనలో మనం ఐక్యంగావడం గూడ అంత ముఖ్యం. దేహంలోని అవయవాలన్నీ ఐకమత్యంగా పనిజేసినట్లే క్రైస్తవ సమాజమంతా

ఐకమత్యంగా వుండాలి. మనకు తోడివారితోను, తోడివారికి మనతోను ఎప్పుడూ అవసరం వుంటుంది. కనుక అందరం ఇచ్చి పుచ్చుకొంటుండాలి. కలిసి మెలసి జీవించాలి. ఒకేశరీరంలోని వేరువేరు అంగాల్లాగ మనమందరం పరస్పర సంబంధం కలిగివుంటాం - రోమా 12,5.

ఈ సందర్భంలోనే సోదరప్రేమను గూడ ప్రస్తావించాలి. క్రైస్తవులు స్వార్థంతోగాని అహంభావంతోగాని పనులు చేయకూడదు. ఒకరి పట్ల ఒకరు వినయంతో మెలగాలి. ఇతరులు మనకంటె అధికులు అనుకోవాలి. మామూలుగా మనం అహంకారంతో నేను గొప్పవాణ్ణి, ఇతరుడు తక్కువవాడు అనుకొంటాం - ఫిలి 2,3. ఇంకా తిరుసభ సభ్యులు ఒకరికొకరు ప్రేమతో సేవలు చేసికోవాలి - గల 5,13. వినయమూ ప్రేమభావమూలేందే సేవలు చేయలేం.

క్రీస్తు అవయవాలమైన మనం భేదభావాలతో విడివడిపోతే క్రీస్తే విభజనకు గురైనట్లు. తొలిరోజుల్లో క్రైస్తవులు రాత్రంతా జాగరణం చేసి ఉదయాన్నే పూజలో సత్ప్రసాదం స్వీకరించే వాళ్లు. వాళ్లు రాత్రి మామూలు అన్నం భుజించే వాళ్లు. దీనికి గ్రీకులో "అగపె" అని పేరు. ఈ భోజనాన్ని అందరూ కలసి ఐక్యభావంతో భుజించాలి. లేకపోతే వాళ్లు విభజనకు గురైనట్లే -1 కొరి 11,20-22. క్రైస్తవులు క్రీస్తు అవయవాలు కనుక వాళ్లు వేశ్యలను కూడితే క్రీస్తు అవయవాలను రంకులాడిపాలు చేసినట్లే -1, కొరి 6,15. ఎన్ని జాతులతో గూడినా తిరుసభ ఏకసమాజం అనేది పౌలు గొప్పభావాల్లో వొకటి. కనుక మనకు విభజనలు పనికిరావు. క్రీస్తు అతనిలోనికి ఐక్యమైన ప్రజలు కలసి ఒక్క దేహమౌతారు. ఒక్క వ్యక్తిగా ఒనగూడుతారు. దీనికే జ్ఞానశరీరం అని పేరు. ఈ శరీరంలోని వ్యక్తులందరూ కలసిమెలసి వుండేలా చేసేది, వారికి ఐక్యత నిచ్చేది

పవిత్రాత్మ. మన మందరం ఒకే ఆత్మయందు, ఒకే శరీరంగా జ్ఞానస్నానం పొందాం -1 కొరి 12,13.

పౌలు క్రీస్తు జ్ఞానశరీరానికి శిరస్సు అని చెప్పాడు. ప్రతి పురుషుని శిరస్సు క్రీస్తు. స్త్రీకి శిరస్సు భర్త. క్రీస్తుకి శిరస్సు దేవుడు 1 కొరి 11,3. ఇక్కడ శిరస్సు అంటే అధికారం నెరపేవాడు అని భావం. శిరస్సు మూలంగా శరీరమంతా పోషింపబడి దేవుని వలన కలిగే వృద్ధి ద్వారా పెంపు చెందుతుంది - కోలో 2, 19. కనుక క్రీస్తు జ్ఞానశరీరానికి అధికారియై దాన్ని అభివృద్ధిలోకి తెస్తాడని భావం.

ఈ జ్ఞానశరీరానికి లేక తిరుసభకు ఆత్మ నానావరాలు ఇస్తుంది. కొందరికి వ్యాధులు నయంజేసే శక్తి, మరికొందరికి ప్రవచనం చెప్పే శక్తి, ఇంకా కొందరికి భాషల్లో మాటలాడే శక్తి యిస్తుంది - 1 కొరి 12,4-11. ఇవి సేవా వరాలు. గ్రీకులో వీటికి "కరిస్మత" అనిపేరు. ఈ వరాలు తిరుసభ అభివృద్ధికి ఉద్దేశింప బడ్డాయి. క్రీస్తు శరీరమైన సంఘాన్ని అభివృద్ధి చేయడం వీటిపని - ఎఫె 4,12. కనుక ఈ వరాలు కలవాళ్లు గర్వింపకూడదు. సేవచేయడం వాళ్ల పని. ఇంకో విషయం కూడ. ఈ వరాలు కలవాళ్లు తప్పకుండ పవిత్రులై వుండనక్కరలేదు. క్రైస్తవ సమాజాల్లోని పెద్దలు విశ్వాసుల వరాలను గుర్తించి వాటిని వాడుకోవాలి. వాటిని దీపాన్నిలాగ ఆర్పివేయకూడదు - 1 తెస్స 5,19.

తిరుసభకు సోదరప్రేమ ప్రధాన లక్షణమై వుండాలి. ప్రేమ వరాలన్నింటినీ మించింది - 1 కొరి 13,13. ఇంకా తిరుసభ శ్రమలు అనుభవించి క్రీస్తు శ్రమల్లో వున్న కొదవను పూరించాలి. అనగా ఇప్పుడు మన శ్రమలు క్రీస్తు శ్రమలతో చేరి తిరుసభకు మేలు చేసి పెడతాయని భావం.

# 5. సత్ప్రసాదం

పౌలు దివ్యసత్ప్రసాద స్థాపనను -1కొరి 11,23-27 లో వర్ణించాడు. ఈ భాగం సువిశేషాల్లోని సత్ప్రసాద స్థాపన భాగాలకంటె ప్రాచీనమైంది. కనుక దీనికి విలువ యెక్కువ.

పౌలు దృష్టిలో సత్ప్రసాదం ప్రధానంగా ప్రభువు రాత్రిభోజనం -11,20.భక్తులు దీన్ని ఆధ్యాత్మికమైన భోజనంగాను పానీయంగాను స్వీకరించాలి. ఇది పూర్వవేదంలోని సీనాయి నిబంధనను జ్ఞప్తికి తెస్తుంది. ఈ భోజనం మనలను క్రీస్తుతో ఐక్యంజేస్తుంది. మనలను పరస్పరం ఐక్యంజేస్తుంది. ఒకే రొట్టెను భుజించిన వాళ్లు ఒక్క శరీరం, ఒక్కవ్యక్తి ఔతారు -1 కొరి 10,17. ఇంకా యిది క్రీస్తు మరణాన్ని జ్ఞప్తికి తెస్తుంది. అతని రెండవ రాకడ కొరకు భక్తిభావంతో వేచివుండేలా చేస్తుంది.

ఇక్కడ మనం ప్రధానంగా మూడంశాలను గమనించాలి -1. సత్ప్రసాదం క్రీస్తు సాన్నిధ్యాన్ని తెలియజేస్తుంది. అతడు అప్పరసాల రూపంలో ఇప్పుడు మన మధ్య నెలకొని వుంటాడని తెల్పుతుంది. ఎవడైన అయోగ్యంగా ప్రభువు రొట్టెను భుజించి అతని రక్తాన్ని పానం జేస్తే ప్రభువు శరీరరక్తాలకు వ్యతిరేకంగా పాపం జేసినట్లే -11,27. దీన్ని బట్టి అప్పరసాల్లో ప్రభువు సాన్నిధ్యం వుందని భావించాలి కదా!

2. మనం ఈ రొట్టెను రసాన్ని స్వీకరించినపుడెల్ల ప్రభువు మరణాన్ని ప్రకటిస్తాం. ఎవరికి ప్రకటిస్తాం? భక్త సమాజంలో ఒకరి కొకరం ప్రకటించుకొంటాం. ఇంకా, ఈ సత్ప్రసాద స్వీకరణం ప్రభువు జ్ఞాపకార్థం చేసేది -24. అనగా మనం తండ్రికి క్రీస్తుమరణాన్ని జ్ఞాపకం చేస్తాం. తన కుమారుని మరణాన్నిజూచి తండ్రి మన పాపాలను క్షమిస్తాడు.

3. సత్ప్రసాద స్వీకరణం క్రీస్తు రెండవ రాకడను గూడ జ్ఞప్తికి తెస్తుంది. ప్రభువు మరల వచ్చే వరకు అతని మరణాన్ని ప్రకటిస్తాం -26. రెండవ రాకడవల్లగాని మన రక్షణం పరిపూర్ణం కాదు. అందుకే తిరుసభ ప్రభూ రండి అని వేడుకొంటుంది- 1 కొరి 16,22. అతని రెండవరాకడకొరకు వేచివుంటుంది.

## 8. క్రైస్తవుడు - స్వేచ్ఛ

పౌలు పలుసార్లు క్రైస్తవుడు స్వేచ్ఛగా జీవించాలని చెప్తుంటాడు. స్వతంత్రులుగా జీవించడానికి క్రీస్తు మనకు విముక్తిని దయచేసాడు. కనుక దృఢంగా నిలవండి. మీరు మరల దాస్యమనే కాడికి లొంగవద్దు - గల 5,6.

గలతీయుల జాబులో ఈ స్వాతంత్ర్యం అనే భావం ఎక్కువగా వస్తుంది. గలతీయ క్రైస్తవులు గ్రీకులు. పౌలే వీరికి క్రీస్తుని బోధించాడు. క్రీస్తు మరణోత్థానాలు మనలను రక్షించాయనీ, ఇప్పుడు క్రీస్తుని విశ్వసించి అతని వరప్రసాదం ద్వారా మనం రక్షణం పొందాలనీ బోధించాడు. కాని తర్వాత యూదమతాభిమానులు ఈ ప్రజల దగ్గరికి వచ్చి ధర్మశాస్త్రాన్ని పాటిస్తేనేగాని మీరు రక్షణం పొందరని బోధించారు.

పౌలు వారి వాదాన్ని ఖండించి క్రీస్తు వరప్రసాదం వొక్కటే మనకు రక్షణను ప్రసాదిస్తుందని నొక్కిచెప్పాడు. క్రీస్తుని విశ్వసించి మనం రక్షణం పొందాలని నుడివాడు. ధర్మశాస్త్రం మనలను రక్షిస్తే క్రీస్తు సిలువమరణం నిష్ప్రయోజన మౌతుందని తెలియజేసాడు. క్రైస్తవునికి స్వేచ్ఛ వుండాలని వాదించాడు. ఈ స్వేచ్ఛ మూడు విధాలుగా వుంటుంది.

## 1. ధర్మ శాస్త్రం నుండి స్వేచ్ఛ

యూదులకు మోషే 613 ఆజ్ఞలతోగూడిన ధర్మ శాస్త్రాన్ని యిచ్చాడు. ఈ యాజ్ఞలకు రబ్బయులు మరికొన్నిటిని చేర్చారు. వీటికి పితరుల సంప్రదాయాలు అని పేరు. ఇవన్నీ కలసి చాల ఆజ్ఞలు అయ్యాయి. ఈ బాహిరమైన ఆజ్ఞలన్నీ పాటిస్తే యూదులకు రక్షణం, లేకపోతే నరకం అన్నారు. యూదులు తమకు ఇష్టం లేకపోయినా బానిసల్లాగ ఈ బాహిరమైన ఆజ్ఞలను పాటించాలి. ఈలా పాటించడంవల్ల వాళ్లు నిజంగానే బానిసల్లాగ తయారయ్యారు. కాని ఆంతరంగికమైన ప్రేరణంవల్ల ప్రేమభావంతో ఇష్టపూర్తిగా ఆజ్ఞలు పాటించేవాడు స్వేచ్ఛాపరుడు.

ధర్మశాస్త్రం వలన రక్షణం కలిగితే నరుడు తన పుణ్య క్రియలద్వారా తన్నుతానే రక్షించుకొన్నట్లు. కాని నరులను రక్షించేది క్రీస్తు సిలువమరణం వలన కలిగిన వరప్రసాదం. నరుడు క్రీస్తుని విశ్వసించి ఈ వరప్రసాదాన్ని పొంది దానిద్వారా రక్షణానికి పాత్రుడు ఔతాడు. కనుక ధర్మశాస్త్రంతో అతనికి అవసరం లేదు. అతడు దానికి బానిస కానక్కరలేదు. ఇది పౌలు బోధ.

## 2. పాపంనుండి స్వేచ్ఛ

క్రీస్తు తన సిలువమరణం ద్వారా పాపానికి చనిపోయాడు. అనగా అతని మరణం ద్వారా పాపం శాశ్వతంగా అంతరించింది -రోమా 6,10. మనం ఈ క్రీస్తు లోనికి జ్ఞానస్నానం పొందుతాం. అతని మరణం మనమీదసోకి మనకు పాపపరిహారం చేసిపెడుతుంది. మన పాపాలకొరకు అతడు మరణించాడు. మనలను నీతిమంతులను చేయడానికి మరల లేవనెత్త బడ్డాడు- రోమా 4,25. క్రీస్తు మరణం మనలను పాపం నుండి విముక్తులను చేస్తుంది. ఈలా మనకు పాపం నుండి స్వేచ్ఛ లభిస్తుంది.

### 3. శరీరం నుండి స్వేచ్ఛ

ఇక్కడ శరీరం అంటే శారీరక వాంఛలు. మనం జ్ఞానస్నానం ద్వారా క్రీస్తుతో ఐక్యమైనపుడు అతని ఆత్మ మనలో వసిస్తుంది. దానివలన శరీరం మన అదుపులోకి వస్తుంది. -రోమా 7,5. మనం ఆత్మానుసారంగా జీవిస్తాం. ఆత్మమనలను నడిపిస్తుంది. మనం క్రీస్తు మీద ఆధారపడి జీవిస్తాం. అతనికి లొంగివుంటాం. అతని అడుగు జాడల్లో నడుస్తాం.

### బాహిరమైన నియమాలు కూడ అవసరం

క్రైస్తవుణ్ణి ఆంతరంగికంగా ఆత్మే నడిపిస్తుంది. అతడు ఆత్మానుసారంగా జీవిస్తాడు. ఐనా అతడు నూత్నవేదకాలంలో గూడ కొన్ని నియమాలు ఆజ్ఞలు పాటించాలి. ఎందుకు? ఆత్మ మనలను నడిపించినా మనం ఆత్మకు పూర్తిగా వశులంగాము. శరీరం మనలను ఈలోక వస్తువుల వైపు లాగుతుంటుంది. మనలో శరీరం ఆత్మ నిత్యం ఘర్షణ పడుతుంటాయి. శరీరం కోరేది ఆత్మకోరేదానికి విరుద్ధం గాను, ఆత్మకోరేది శరీరం కోరేదానికి విరుద్ధం గాను వుంటాయి. ఈ రెండిటికి బద్ధవైరం. అందువలన మీరు చేయగోరిన దానిని చేయలేకున్నారు -గల 5,17. ఫలితంగా నరుడు దేవుణ్ణి విడనాడి లోకాశల్లో పడిపోతుంటాడు. అందుచే మనకు కూడ కొన్ని వెలుపలి ఆజ్ఞలు అవసరమే. రోజువారి జీవితంలో ఇవి మనం దేవుని చెంతకు తిరిగిరావడానికి ఉపయోగపడతాయి.

ఉత్థాన క్రీస్తు మనలను ఆంతరంగీకంగా నడిపించాలి. క్రీస్తు నియమాలు మనలను బాహిరంగా నడిపించాలి. క్రీస్తు అతని జీవితమూ బోధలూ మనకు ఆదర్శం కావాలి. నాకు జీవించడమంటే క్రీస్తుని జీవించడమే -ఫిలి 1,21. మనకు నియమాలంటే ప్రధానంగా క్రీస్తే.

మన బాహిర నియమాలు క్రీస్తు బోధలు మాత్రమేకాదు. పౌలు జీవితమూ బోధలూకూడ మన బాహిర నియమాల్లోకి వస్తాయి. కనుకనే అతడు ఫిలిప్పీయులకు వ్రాస్తూ మీరందరు నన్ను అనుసరించండి అని చెప్పాడు -3,17. కొరింతీయులకు వ్రాస్తూ మీరు క్రీస్తుని అనుసరించినట్లే నన్ను కూడ అనుసరించండి అని ఆదేశించాడు -1 కొరి 11,1.

*స్వేచ్ఛ సేవలు చేయడానికి*

క్రైస్తవునికి స్వేచ్ఛవుందంటే అతడు విచ్చల విడిగా తిరగ వచ్చని కాదు. స్వార్థంతోను వ్యామోహాలతోను జీవించవచ్చని అర్థం కాదు. అతన్ని నడిపించేది పవిత్రాత్మ. అతడు నడిచేది చీకటిలో కాదు, వెలుగులో. అతడు క్రీస్తులోనికి జ్ఞానస్నానం పొంది అపర క్రీస్తుగా తయారౌతాడు. అతనిలో క్రీస్తు వసిస్తున్నాడు కనుక అతని క్రియలు కూడ క్రీస్తు క్రియలు కావాలి. ఆ ప్రభువు నేను సేవలు చేయడానికి వచ్చానుగాని సేవలు చేయించుకోవడానికి రాలేదు అన్నాడు - మత్త 20,28. కనుక ఆ క్రీస్తుని అనుసరించి క్రైస్తవుడు కూడ తోడివారికి సేవలు చేయాలి. స్వతంత్రులుగా వుండడానికి దేవుడు మిమ్ము పిల్చాడు. కాని ఈ స్వేచ్ఛ మీరు శారీరక వ్యామోహాలకు లొంగిపోవడానికి కాదు. ఒకరి కొకరు ప్రేమతో సేవలు చేయండి -గల 5,13. కనుక స్వేచ్ఛకుఫలితం ప్రేమతో గూడిన సేవ. ఆత్మ మనకు దయచేసే వరాలన్నిటిలోను శ్రేష్ఠమైంది ఈ ప్రేమ -1 కొరి 13,13. ఈ ప్రేమ వల్లనే పౌలు ఎవరివద్దకు పోయినపుడు వారికి అనుకూలంగా మెలిగేవాడు. నేను కొందరినైన రక్షించడానికి అందరికొరకు అన్నివిధాలుగా తయారయ్యాను -1 కొరి 9,22. ఈ సందర్భంలో మన స్వేచ్ఛను మన మేలా వినియోగించు కొంటున్నానూ అని పరిశీలించి చూచుకోవాలి. మన

కాలంలో మదర్ తెరెసా ప్రేమతో గూడిన సేవకు మంచి నిదర్శనం. ఆమెలా జీవిస్తే మనం పౌలు బోధలను పాటించినట్లే.

## 9. పౌలు ప్రేషిత సేవ

పౌలు భక్తుడు మహాప్రేషితుడు. అతని ప్రేషిత సేవ నేడు మనకు కూడ ప్రేరణం పుట్టిస్తుంది. ఇక్కడ అతని సేవలోని ముఖ్యాంశాలను కొన్నిటిని పరిశీలిద్దాం.

1. ప్రేషితసేవ నరునినుండి కాక దేవుని నుండి వస్తుంది. పౌలుని వేదబోధకు పిల్చింది దేవుడు - గల 1,15. అతనికి శక్తి నొసగి అతనిచే వేదబోధ చేయించింది దేవుడు. ప్రభువు తన్ను వేదబోధ చేయమని ఆజ్ఞపించాడనీ, కనుకనే తానా పనిని చేస్తున్నాననీ పౌలు గాఢంగా నమ్మాడు.

2. తొలిరోజుల్లో సువార్త అంటే పుస్తకం గాదు, బోధ. క్రీస్తు మరణోత్థానాలను వాక్కుతో బోధించడం. ఈ సువార్తలోనే అద్భుతమైన శక్తివుంది - రోమా 1,16. దేవుడు బోధకుణ్ణి పంపుతాడు. అతడు సువార్తను బోధిస్తాడు. ఆ బోధ విని నరులు క్రీస్తుని విశ్వసిస్తారు - రోమా 10,14-17. పౌలు వక్తృత్వకళను ఆశ్రయించలేదు. సువార్తలోని శక్తి మీదనే ఆధారపడ్డాడు. అదే అతనికి విజయాన్ని చేకూర్చిపెట్టింది. బోధకుని నోటినుండి వచ్చే దేవుని వాక్కులోనే బ్రహ్మాండమైన శక్తి వుంటుంది. శ్రోతల హృదయాలను కదిలించేది అదే.

3. పౌలు నోటితోనేగాక అద్భుతాల ద్వారా కూడ బోధించాడు. అతడు చాల అద్భుతాలు చేసాడు - రోమా 15,18-19. కాని అతడు చేసిన గొప్ప అద్భుతం క్రీస్తుకొరకు శ్రమలు

అనుభవించడమే. అతడు క్రీస్తు ముద్రలను (శ్రమలను) ధరించాడు - గల 6,17. పౌలు క్రీస్తు సిలువను బోధించడం మాత్రమేకాదు, స్వయంగా మోసాడు. అపోస్తులచర్యల గ్రంథంలో లూకా పౌలు చరిత్రను చెప్పినప్పుడు సగభాగాన్ని అతని శ్రమలకే కేటాయించాడు. మా భౌతికశరీరంలో మేము సర్వదా యేసు మరణాన్ని మోస్తున్నాం. దీనివలన మా శరీరంలో యేసుజీవం ప్రత్యక్షమౌతుంది - 2కొరి 4,10. బాధలు లేకుండ ఏ ప్రేషితుడు విజయాన్ని సాధించాడు?

4. క్రీస్తు మరణోత్థానాల శక్తివల్లనే పౌలు ప్రేషితసేవ ఫలించింది. డమస్కుత్రోవలో క్రీస్తు ఉత్థానశక్తి పెద్దవెలుగు రూపంలో పౌలుపై ప్రసరించింది. ఆ వెల్తురు అతన్ని వెలిగించి అతని ద్వారా ఇతరులను కూడ వెలిగించింది -2 కొరి 4,6. ఆ వెల్తురు అతని నుండి రాలేదు, క్రీస్తు నుండి వచ్చింది. ఉత్థానక్రీస్తు శక్తే పౌలు గెలుపుకి కారణం.

5. బైబుల్లో ప్రేషితసేవకు ఆధారం ఓ ప్రత్యేక వ్యక్తి కాదు, భక్తసమాజం. పౌలుకూడ వంటరిగాగాక విశ్వాస సమాజంతో గలసి వేదబోధచేసేవాడు. మొదట అతన్ని వేదబోధకు నియమించింది అంతియొకయసమాజం - అచ 13, 1-3. పౌలు ఎప్పుడూ యెరూషలేము లోని పెద్దలైన పేతురు, యోహాను, యాకోబులతో సత్సంబంధం కలిగి వుండేవాడు. వాళ్లు అతని ప్రేషితసేవను అంగీకరించారు - గల 2,9. అతడు ఎల్లప్పుడు తిమోతి, తీతు, సీలా మొదలైన శిష్యబృందంతో కలసి పనిచేసేవాడు. దేహంలోని అవయవాలు ఐకమత్యంగా పనిచేసినట్లుగా ప్రేషితులు కలసి పనిచేయాలనేది అతని సూత్రం.

6. యిస్రాయేలు రక్షణం పౌలుకి పెద్ద సమస్యగా తయారైంది. అతడు మొదట వారితోనే బోధప్రారంభించాడు. వాళ్లు

విననందున అన్యజాతి ప్రజల దగ్గరికి వెళ్లాడు. మరి వారికి రక్షణం లభిస్తుందా? కట్టకడన దేవుడు యిస్రాయేలును రక్షిస్తాడని అతడు గట్టిగా నమ్మాడు - రోమా 11,26. వారి నుండే రక్షణం ప్రారంభమైంది. మెస్సీయా వారి నుండే పుట్టాడు. కడన రక్షణం వారితోనే ముగుస్తుంది. తాను స్వయంగా ఎన్నుకొని దీవించిన వారి విషయంలో దేవుడు మనసుమార్చుకోడు - రోమా 11,29.

7. పౌలు తానుయుగాంతంలో వున్నాననీ, దేవుడు సువార్త బోధను తనకు ఒప్పజెప్పాడనీ రూఢిగా నమ్మాడు. క్రీస్తుద్వారానే రక్షణమనీ, దేవునికీ నరునికీ నడుమ మధ్యవర్తి యేసు ఒక్కడేననీ గట్టిగా విశ్వసించాడు - 1 తిమో 2,5. కనుక క్రీస్తుని బోధించకపోతే తనకు పుట్టుగతులు వుండవని భావించాడు -1 కొరి 9,16. ఈ ప్రేరణంతోనే అతడు వేదబోధ చేసాడు. శ్రమలు అనుభవించాడు -అచ20,24.

8. పౌలుకి సాంఘిక స్ఫూర్తి వుంది. అతడు ఆనాటి ఆర్థిక సాంఘిక పరిస్థితులను పట్టించుకొన్నాడు. గ్రీకు క్రైస్తవుల నుండి విరాళాలు ప్రోగు జేసి యెరూషలేములోని కరువు బాధితులకు పంపాడు -2 కొరి 9,13. క్రైస్తవుల్లో జాతి, వర్గ, లింగ భేదాలు వుండకూడదని బోధించాడు - గల3,28. ఒనేసిము అనే బానిసకు యజమానునుండి స్వాతంత్ర్యం ఇప్పించాడు. స్త్రీలనుగూడ తన ప్రేషితబృందంలో చేర్చుకొన్నాడు.

9. పౌలుకి ప్రార్థన అతిముఖ్యమైంది. ప్రార్థన చేసేవాళ్లంతా రక్షణాన్ని పొందుతారు అనేది అతని సూత్రం -రోమా 10,13. ఆత్మ మనచే ప్రార్థన చేయిస్తుందని స్పష్టంగా చెప్పాడు -రోమా 8,26-27. అపోస్తుల చర్యల పుస్తకంలో లూకా పౌలుని నానాసందర్భాల్లో ప్రార్థనచేస్తున్నట్లుగా చిత్రించాడు -అచ 20,36. పౌలుకూడ

ప్రార్థననుగూర్చి ఎన్నోవిషయాలుచెప్పాడు. సదా ప్రార్థించండి. సర్వావస్థలయందు కృతజ్ఞులై వుండండి. క్రీస్తునందు దేవుడు మిమ్ము కోరుకొనేది యిదే -1 తెస్స 5,17-18. ప్రార్థనాభ్యాసంలేని దైవభక్తుడు బైబుల్లో అసలు కన్పించడు.

10. పౌలుకి ఆత్మపట్ల అచంచలమైన విశ్వాసంవుంది. మొదట అతన్ని ప్రేషిత సేవకు పిల్చిచింది పవిత్రాత్మే -అచ 13,2-3. అడుగడుగున అతన్ని ఆ సేవలో నడిపించింది కూడ ఆత్మే -అచ 20,23. దేవుని బిడ్డలను దేవుని ఆత్మేనడిపిస్తుందని అతని నమ్మకం -రోమా 8,14. ఈనాడు మనలను ప్రేషిత సేవకు పురికొల్పేదికూడ ఆత్మే.

## 10. నైతిక జీవితం

పౌలు జాబులప్రకారం మనకు క్రీస్తుపట్ల గాఢమైన విశ్వాసంవుండాలి. క్రీస్తు మనలను పాపం నుండి రక్షించాడు. కనుక మనం కృతజ్ఞతాపూర్వకంగా నైతిక జీవితం గడపాలి. కావుననే అతడు దేవుడు మీకు దయచేసిన పిలుపునకు తగినట్లుగా జీవించండి అన్నాడు - ఎఫె 4,1. మీరు క్రీస్తుతోపాటు సజీవులుగ లేవనెత్తబడ్డారు. కనుక మీ హృదయాలను పరలోక వస్తువులవైపు మరల్చుకోండి అన్నాడు -కోలో 3,1. మనం ఈలోక ప్రమాణాలను అనుసరించకూడదు. మానసికమైన మార్పును చెందాలి -రోమా 12,2. భయంతో వణకుతూ మన రక్షణకార్యాన్ని కొనసాగించు కొనిపోవాలి -ఫిలి 2,12. కాని మనం క్రీస్తుని విశ్వసించి నైతిక జీవితం గడిపేది మనశక్తి వల్ల కాదు, దేవుని శక్తివల్ల. మీరుఇచ్ఛగించడానికీ, పనిచేయడానికీ మీ యందు కార్యసిద్ధిని కలిగించేది దేవుడే -ఫిలి 2,13.

నరులు నైతికజీవితం గడిపేలా చేసేది ప్రధానంగా పవిత్రాత్మ. దేవుని బిడ్డల్ని దేవుని ఆత్మే నడిపిస్తుంది -రోమా 8,14. ఆయాత్మ మన హృదయాల్లో ఓ దీపంలా వెలుగుతూంటుంది. మనం ఈ యాత్మ దీపాన్ని ఆర్పివేసుకోగూడదు - 1 తెస్స 5,19.

మనలను నడిపించే ఆత్మ ప్రేమాత్మ. కనుక మన నైతిక జీవితంగూడ ప్రేమతో నిండివుండాలి. తోడివారిని ప్రేమతో ఆదరించాలి. తోడివారిని ప్రేమించినవాడే ధర్మశాస్త్రాన్ని నెరవేర్చిన వాడు -రోమా 13,8. అందుచేత ఒకరిభారాన్ని ఒకరు భరించాలి -గల 6,2.

మామూలుగా పౌలుజాబుల్లో మొదటి భాగంలో దైవశాస్త్రాంశాలూ, చివరి భాగంలో నైతికాంశాలూ వస్తాయి. ఈయంశాలు పౌలుకి ముందే క్రైస్తవ బోధకులు బోధించేవాళ్ళు. వీటిల్లో కొన్నిటిని క్రైస్తవేతరులైన గ్రీకుతాత్వికులు కూడ బోధించారు. పౌలు ఈ రెండు ఆధారాలనుండి తన నైతిక బోధలను ఎన్నుకొన్నాడు. ప్రస్తుతం ఇక్కడ ఐదంశాలను పరిశీలిద్దాం.

## 1. అంతరాత్మ

ధర్మశాస్త్రం లేనికాలంలో అన్యజాతి ప్రజలు వాళ్ళఅంతరాత్మ ప్రకారం జీవించి రక్షణం పొందారు. పౌలు తన విశ్వాసులను అంతరాత్మ ప్రబోధాలను పాటించమని ఆదేశించాడు.

జ్ఞానంగల కొందరు క్రైస్తవులు విగ్రహాలకు అర్పింపబడిన మాంసాన్ని భుజిస్తున్నారు. అదివారికి పాపంగాదు. కాని బలహీనమైన అంతరాత్మ గల మరికొందరు అది పాపకార్యం అనుకొన్నారు. ఐనా మొదటివర్గం వాళ్ళను చూచి వీళ్ళు కూడ ఆ మాంసాన్ని భుజించారు, పాపంగట్టు కొన్నారు. ఈ విధంగా జ్ఞానంగల క్రైస్తవులు బలహీనమైన

అంతరాత్మగల క్రైస్తవులు పాపంలో పడ్డానికి కారణమయ్యారు -1కొరి 8,7-12.

పవిత్రత్మా మన అంతరాత్మ ద్వారా మనమీద పనిచేస్తుంది -రోమా 9,2. దేవుని ఆత్మే మన అంతరాత్మలో వుండి మనలను హెచ్చరిస్తుంది. ఏదిమంచో ఏది చెడ్డో మనకుతెలియజేస్తుంది. మనతరపున మనం ఈయంతరాత్మ ప్రకారం జీవించాలి.

## ౭. ప్రార్థనం

పౌలు దృష్టిలోప్రార్థనమంటేదేవుని సన్నిధిలో వుండిపోవడం. జపంజేసికొనేవాళ్లు దేవుణ్ణి ఆరాధించాలి, స్తుతించి కీర్తించాలి. అతనికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి. తమ మనవులను అతనికి తెలియజేసికోవాలి. అతడు తన విశ్వాసులను ప్రార్థనలో మునిగివుండమని చాలసార్లు హెచ్చరించాడు. "సదా ప్రార్థించండి. ప్రతి సంఘటనకు దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించండి" -1 తెస్స 5,17-18. మన ప్రార్థనలోదేవుణ్ణి చనువుతో అబ్బ-నాన్న అని పిలువాలి -గల 4,6. మనచే ప్రార్థన చేయించే మహాశక్తి పవిత్రాత్మే. ఆయాత్మ మనచే దేవుణ్ణి నాన్న అని పిలిపిస్తుంది. -రోమా 8,15-16. ఇంకా ఆత్మ మన తరుపున ప్రార్థన చేస్తుంది. మనచే ప్రార్థన చేయించి దాన్ని తండ్రికి సమర్పిస్తుంది -8,26-27.

పౌలు ప్రార్థనానుభవంగల గొప్ప భక్తుడు. అతడు ప్రతి జాబులోను తాను విశ్వాసుల కొరకు ప్రార్థనం చేస్తున్నట్లుగా వ్రాస్తుంటాడు. వారిని తన కొరకు, తన తోడిపనివారికొరకు ప్రార్థన చేయుమని వేడుకొంటూంటాడు. అతడు ఆత్మ సహాయంతో క్రీస్తుద్వారా తండ్రికి ప్రార్థన చేస్తుంటాడు -రోమా 1,8. ఇంకా అతడు తన సువిశేషబోధను కూడ దైవార్చనగానే భావించాడు. అతడు

సువార్తను బోధించడం ద్వారా యాజకుడు అయ్యాడు. అతడు దేవునికి సమర్పించే అర్పణం అన్యజాతి ప్రజలే -రోమా 15,16-17.

## 3. ఇంద్రియ నిగ్రహం

పౌలు అడుగడుగున ఇంద్రియ నిగ్రహాన్ని పాటించాడు. బోధకుల బోధలకు గాను విశ్వాసులే వారిని పోషించాలి. ఇది బోధకులహక్కు. కాని పౌలు ఈ హక్కును వదలుకొని ఉచితంగానే బోధన సేవ చేసాడు - 1 కొరి 9,12. ఇది అతని త్యాగానికి నిదర్శనం.

అతడు స్వతంత్రుడై కూడ దాసుల్లాగ మెలిగాడు. యూదులతో పనిజేసేపుడు యూదుల్లాగ, గ్రీకు ప్రజలతో పని జేసేపుడు గ్రీకునరుల్లాగ ప్రవర్తించాడు. కొందరినైన రక్షించడానికి అందరిపట్ల అన్ని విధాలుగ మారాడు. ఈలా ఎల్లరిమనస్తత్వాలకు తగినట్లుగా మారాలంటే అతడు తన వ్యక్తిత్వాన్ని త్యజించుకొని వుండాలి. ఈ త్యాగం అతనికి బాధ కలిగించి వుండాలి -1 కొరి 9,19-22.

పౌలు తన్ను పందెంలోపాల్గొనే క్రీడాకారునితో పోల్చుకొన్నాడు. వాళ్ల అశాశ్వతమైన కిరీటాన్ని సంపాదించడానికి ఎన్నో శ్రమలు పడతారు. నిద్రాహారాలు మానతారు. తమ శరీరాన్ని నలగగొట్టుకొని అదుపులోకి తెచ్చుకొంటారు. ఎన్నోరోజులు అభ్యాసం చేస్తారు. కాని పౌలు శాశ్వత కిరీటాన్ని పొందడానికి కృషిచేస్తున్నాడు. అదే మోక్షబహుమానం. కనుకతాను ఓ క్రీడా కారుల్లాగ పరుగెత్తుతున్నాడు. గమ్యంవైపు పరుగుతీస్తున్నాడు. ముష్టియుద్ధంజేసే క్రీడాకారులు ఒకరి శరీరంపై ఒకరు దెబ్బలు కొట్టుకొంటారు. కాని పౌలు తన శరీరాన్ని తానే నలగగొట్టుకొని అదుపులోకి తెచ్చుకొంటున్నాడు. మోక్షబహుమతి కొరకు నానా శ్రమలు అనుభవిస్తున్నాడు - 1కొరి 9,24-27.

పౌలు ప్రేషిత సేవలో తానుఅనుభవించిన శ్రమలద్వారా క్రీస్తు శ్రమల్లోని కొరతనుతీరుస్తున్నాడు - కోలో1,24. యథార్థంగా క్రీస్తుశ్రమల్లో కొరతయేమీలేదు. తిరుసభ తరపున మాత్రం కొరతవుంది. అతడు తనవంతు శ్రమలను తాను అనుభవించి తిరుసభలోని కొరతను తీరుస్తున్నాడు. పౌలుక్రీస్తుతో ఐక్యమయ్యాడు కనుక క్రీస్తు శ్రమల్లో తానూ పాలుపొందాలని తండ్రి నిర్ణయించాడు. అతని శ్రమలు తిరుసభకు ఉపయోగ పడతాయి. కనుక అతడు ఎల్లపుడు తన భౌతిక శరీరంలో క్రీస్తు సిలువ మరణాన్ని మోసాడు - 2 కొరి 4,10. తన శరీరంలో యేసు ముద్రలు ధరించాడు -గల 6,17. ఈ ముద్రలు అతని శ్రమలే -గల 6,17. తాను ఇదివరకేసాధించిన ప్రాతకార్యాలను మరచిపోయి ముందున్నదానిని చేరడానికి తీవ్రంగా కృషిచేస్తున్నాడు. మోక్ష బహుమతిని గెల్చుకోవడానికి తన ధ్యేయంవైపు సూటిగా పరుగెత్తు తున్నాడు - ఫిలి 3,13-14.

## 4. కుటుంబ ధర్మాలు

పౌలు వివాహం, బ్రహ్మచర్యం, వైధవ్యం మొదలైన అంతస్తులనుగూర్చి -1కొరి 7లో సలహాలు ఇచ్చాడు. అతని ప్రధానసూత్రం ఇది. ప్రతివాడు దేవుడు తన కిచ్చిన వరాన్నిబట్టి తానున్న అంతస్తులో వుండిపోవాలి - 1కొరి 7,17.

1. వివాహ జీవితాన్ని గూర్చి అతనిభావాలు ఇవి. వివాహం బ్రహ్మచర్యం గూడ దేవుడిచ్చే వరాలు. క్రైస్తవులకు ఒకే భార్య ఒకే భర్త వుండాలి. జారత్వం ప్రచురంగా వుందికనుకను, కామంవలన కాలిపోవడం కంటె పెండ్లియాడ్డం మంచిది కనుకను వివాహ వ్యవస్థ చేపట్టదగింది -1కొరి 7,2. 9.దంపతులు ఒకరినొకరు పవిత్రపరచు కోవాలి. ఇద్దరూ కలసి బిడ్డలను పవిత్రపరచుకొంటారు. విడాకులు

చెల్లవు. ఇది ప్రభువు ఆజ్ఞ-7,10-11. క్రైస్తవులు క్రైస్తవేతరులను పెండ్లిచేసికొన్నపుడు అవసరమైతే విడాకులు తీసికోవచ్చు -7,15. దీనికే పౌలు గారి అనుమతి అని పేరు.

భార్యకు శిరస్సు (అధికారి) భర్త -1 కొరి 11,3. అనగా భార్య పెనిమిటి చెప్పుచేతల్లో వుండాలి. ఆకాలపు సమాజంలోని స్త్రీల పరిస్థితిని పురస్కరించుకొని పౌలు ఈలా వ్రాసివుండవచ్చు.

ఎఫెసీయులజాబు పౌలు శిష్యుడు వ్రాసింది. ఆజాబు 5,21-33లో రచయిత వివాహధర్మాలను విపులంగా పేర్కొన్నాడు. భార్య భర్తకు విధేయురాలై వుండాలి -5,22. భర్త భార్యను ప్రేమించాలి -5,25. ఇవి కూడ రచయిత తననాటి సమాజంలోని పరిస్థితులను బట్టి చేసిన సూచనలు అనుకోవాలి. పురుషుని కంటె స్త్రీ తక్కువది అని పౌలు భావం కాకపోవచ్చు. భర్త ప్రేమకు ఆదర్శం క్రీస్తుకి తిరుసభ పట్ల వుండే ప్రేమే -5,25. భార్యాభర్తల ఐక్యత క్రీస్తుకి తిరుసభకు వుండే ఐక్యతలాంటిది అనే భావం చాల ఉన్నత మైంది. నేటి మనక్రైస్తవివాహానికి విలువనూ వరప్రసాదాన్నీ ఇచ్చేది ఈ పోలికే-5,22.

పూర్వవేదంలో యావే ప్రభువు భర్త, యిస్రాయేలు ప్రజలు భార్య అనే భావం వుంది. నూత్నవేదంలో క్రీస్తు వరుడు,తిరుసభ వధువు ఔతారు. మన జ్ఞానవివాహంలో ఈ పోలిక వధూవరుల మీద సోకి వారిని పవిత్రులను చేస్తుంది. దంపతులను గూర్చిన పౌలు ముఖ్యభావం ఇదే.

దంపతులు కొన్నిసార్లు శారీరకమైన కలయికను మానుకొని ఆ కాలాన్ని ప్రార్థనకు ఉపయోగించడం మంచిది -1కొరి 7,5.

పౌలు తల్లిదండ్రులకూ బిడ్డలకూ వుండవలసిన సంబంధాన్ని గూడ వివరించాడు. ''బిడ్డలారా! మీరు తల్లిదండ్రులకు

విధేయులుగా వుండండి. ఇది దేవునికి ప్రీతి కలిగిస్తుంది" -కోలో 3,20. ఇది పదియాజ్ఞల్లోని నాల్గవఆజ్ఞ. పిల్లలకు తల్లిదండ్రులను మించిన ఆప్తులెవరూ లేరు. కనుక వారిపట్ల గౌరవం విధేయంత చూపాలి. ఇక తల్లిదండ్రులు పిల్లలకుకోపం రప్పించకూడదు. దానివలన పిల్లలకు నిరుత్సాహం కలుగుతుంది -కొలో 3,21. అమ్మానాన్నలు తప్పకుండ వారి పిల్లలను ప్రేమిస్తారు. ఐతే వారిని క్రైస్తవధర్మంలో పెంచాలికూడ. పెద్దలు పిల్లలను నియంతల్లాగ శాసించకూడదు. దానివలన పిల్లల్లో పిరికితనం ఏర్పడుతుంది. వాళ్ళ క్రుంగిపోతారు. పెద్దలు ఎప్పుడూ ప్రోత్సాహకులుగా మెలగాలి.

2. బ్రహ్మచర్యాన్ని గూర్చిన పౌలు భావాలు ఇవి. ఈయంశంమీద పౌలు వెలిబుచ్చిన భావాలు అతనివి, క్రీస్తువి కావు -1 కొరి 7,25. అందరూ తనలాగే వుండాలని పౌలు కోర్కె -1 కొరి 7,7. బహుశః ఇక్కడ "తనలాగే" అంటే అవివాహితులుగా అని భావం కావచ్చు. ఆలాయెందుకుండాలంటే రెండవరాకడ త్వరలోనే వస్తుంది కనుకనూ, లౌకికమైన శ్రమల నుండి తప్పించుకోవచ్చు కనుకనూ -7,26-29. ఇంకా అవివాహితులు తమహృదయాలను పుర్తిగా దేవునికే సమర్పించుకోవచ్చు కనుక -7,32-35.

3. విధవలు మరల వివాహం చేసికోవచ్చు. కానివాళ్ళ అదే అంతస్తులో వుండిపోవడం మెరుగు -7,8. రెండవరాకడ త్వరలో రానుంది కనుకనూ, లౌకిక శ్రమలను తప్పించుకోవచ్చు కనుకనూ పౌలు ఈ సూచన చేసాడు.

### 5. సమాజ ధర్మాలు

పౌలు ఆనాటిసమాజంలోని వ్యత్యాసాలను గుర్తించాడు. సమాజంలో యూదులు గ్రీకులు వున్నారు. స్వతంత్రులు బానిసలు

వున్నారు. స్త్రీలు పురుషులు వున్నారు. ఇన్ని వ్యత్యాసాలు వున్నా జ్ఞానస్నానం ద్వారా క్రీస్తుతో ఐక్యంగావడం వలన నరులంతా సరిసమానం ఔతారు. యూదులమైనా అన్యులమైనా స్వతంత్రుల మైనా మనమందరం ఒకే ఆత్మయందు ఒకే శరీరంగా జ్ఞానస్నానం పొందాం -1 కొరి 12,13. ఐనా ఒక్కొక్కడు దేవుడు తనకు నియమించిన అంతస్తులో వుండి పోవాలనేది పౌలుసూత్రం -1 కొరి 7,17.

పౌలుకి ఓ వైపు క్రైస్తవసమాజమూ దాని ఆశయాలూ తెలుసు. మరో వైపు లౌకిక సమాజమూ, అనగా రోమను ప్రభుత్వమూ దాని ఆశయాలు తెలుసు. ప్రభుత్వం ఆశయాలు క్రీస్తు ఆశయాలు కావు. ఐతే క్రైస్తవులు పరలోక పౌరులైనా రోమను ప్రభుత్వానికి లొంగివుండాలని పౌలు కోరాడు. అతడు తన భావాలను రోమా 13,1-7 లో తెలియజేసాడు.

ప్రతివ్యక్తి ప్రభుత్వాధికారులకు లోపడివుండాలి -13,1. ఎందుకు? పౌలు మూడు కారణాలు చూపాడు. 1. ప్రభుత్వాధికారం దేవుని నుండే వస్తుంది. కనుక అధికారులను ధిక్కరించేవాళ్లు దేవుని దండనకు గురౌతారు -13,2. 2. ఇంకా అధికారులు దుష్టులను శిక్షించి సజ్జనులను రక్షిస్తారు. వాళ్లు చేసేది మంచిపనే. అందుచేత మన అంతరాత్మ మనం ప్రభుత్వఅధికారులకు లొంగివుండాలని చెప్తుంది -13,5. 3. పైగా అధికారులు సమష్టి శ్రేయస్సుకొరకు కృషి చేస్తారు. కనుక మనం వారికివిధేయులంగావాలి. ఇందుకే క్రైస్తవులు కూడ ప్రభుత్వానికి పన్నులు చెల్లించాలి. అధికారులను గౌరవించాలి కూడ -13,7.

పౌలు రోమనుప్రభుత్వం ఎప్పుడూ ధర్మయుక్తంగానే పరిపాలిస్తుంది అనుకొన్నాడు. కాని ఆలా జరగలేదు. అతడు

గతించాక అదే ప్రభుత్వం క్రైస్తవులను క్రూరంగా హింసించింది. కనుక పౌలు బోధించిన సమాజ ధర్మాలు ఇప్పుడు మన కాలానికి సరిపోవు.

పౌలు బానిసలు బానిసలుగానే వుండాలని చెప్పాడు. "దేవుడు నిన్ను పిలిచినప్పుడు నీవు బానిసవా? విచారించకు" 1 కొరి 7,21. పైగా వారిని "దాసులారా! దేవునియందు భక్తికలిగి ఎప్పుడూ మీ యజమానుల ఆదేశాలను చిత్తశుద్ధితో పాటించండి" అని బోధించాడు - కొలో 3,22. అందుకే తన్నాశ్రయించిన ఒనేసిము అనే బానిసను తిరిగి యజమానుని వద్దకు పంపించాడు. అనగా అతడు బానిసగానే వుండిపోవాలని పౌలు ఉద్దేశం. కాని అతన్ని సోదరునిగా చూచుకొమ్మని మాత్రం ఆ యజమానునికి హితబోధ చేసాడు -ఫిలేమోను 1,16. పౌలుకి ఆనాటి సమాజాన్ని మార్చాలన్న కోరిక యేమీలేదు. అతడు సంఘసంస్కర్త కాదు. ఎవరి అంతస్తులో వాళ్లు ఉండాలన్నదే అతని సూత్రం.

కాని అతడు క్రీస్తు బోధలు, క్రైస్తవజీవితం క్రమేణ రోమను సమాజాన్ని మార్చి వేస్తాయని నమ్మాడు. క్రైస్తవమతం పాలలోవేసిన తోడు లాగ సమాజాన్ని మారుస్తుందనీ, మనం తొందర పడనక్కరలేదనీ అతని తలంపు. క్రీస్తు దేవుని రూపం. నరులు కూడ ఈ క్రీస్తు రూపాన్ని పొందాలి. భువినుండి పుట్టినవానిని పోలివున్న మనం దివినుండి వచ్చినవానిని అనగా క్రీస్తుని పోలివుండాలి. నరుల్లో ఈమార్పు క్రమేణ వచ్చి ప్రజల్లోని అంతరాలు నశించిపోయి సమసమాజం ఏర్పాడుతుందని పౌలు ఆశించాడు. మొత్తం మీద సమాజాన్ని గూర్చిన అతని నీతిబోధలు ఈ కాలానికి సరిపోవు. ఆనాడు అతడు ఊహించని మార్పులు ఇప్పుడు ఎన్నో వచ్చాయి.

# 11. అంత్యగతులు

## 1. నూత్నయుగం ప్రారంభమైంది

పౌలు మొదట క్రీస్తు రెండవరాకడ తన జీవితకాలంలోనే జరుగుతుంది అనుకొన్నాడు. కనుక దేవదూతల బాకాలు విన్పిస్తాయి. క్రీస్తు మేఘాలమీద యెక్కి వస్తాడు అని వ్రాసాడు -1 తెస్స 4, 6. కాని అతని జీవితాంతం వరకు రెండవ రాకడ జరగలేదు. కనుక అతడు చివరి కాలంలో తన భావాలను కొలదిగా మార్చుకొన్నాడు. విశ్వాసులకు మోక్షజీవితం ఇక్కడే ప్రారంభమౌతుంది కనుక వాళ్ళు క్రీస్తుపై మనసుపెట్టి జీవించాలని బోధించాడు. ఈయంశాన్ని కొంచెం విపులంగా పరిశీలిద్దాం.

క్రీస్తు ఉత్థానంతోనే నూత్నయుగం ప్రారంభమైంది. ఉత్థానక్రీస్తు తండ్రికుడిపార్శ్వాన ఆసీనుడై తిరుసభనూ లోకాన్నీ కూడ పరిపాలిస్తుంటాడు. కాని అతని రాజ్యాధికారం కంటికి కన్పించేది కాదు. క్రీస్తుతో పాటు క్రైస్తవులు కూడ మోక్షవారసత్వాన్ని పొందుతారు. ఈలోకంలో వుండగానే తండ్రి వారిని చీకటినుండి అద్భుతమైన వెలుగులోకి పిల్చాడు. దేవుడు వారిని నీతిమంతులను చేసాడు. ఇక వాళ్ళు తీర్పుకి భయపడనక్కరలేదు. ఇక్కడ వుండగానే పవిత్రాత్మ వారికి సంచకరువుగా లభిస్తుంది. వాళ్ళు ఎప్పుడు కూడ భయభక్తులతో తమ రక్షణకార్యాన్ని కొనసాగించుకొని పోవలసిందే పిశాచశక్తులతో పోరాడ వలసిందే. కాని వాళ్ళు ఉత్థాన క్రీస్తుతో ఐక్యమై ఆత్మశక్తి వలన ఈ లోకంలో శాంతి సమాధానాలతో జీవిస్తారు. ఇప్పుడు వాళ్ళు క్రీస్తు స్థాపించిన దైవరాజ్యంలో అంత్యకాలంలో వున్నారు. ఇదే నూత్నయుగం.

## 2. రెండవ రాకడ

ప్రభువు తన జీవితకాలంలో రెండవ పర్యాయం వేంచేయడని పౌలు జీవితాంతంలో గుర్తించాడు -ఫిలి 1,23. కాని క్రీస్తు రెండవ పర్యాయం వచ్చినపుడు ఏంజరుగుతుంది? నరులంతా ఉత్థానమౌతారు. వారికి న్యాయనిర్ణయం జరుగుతుంది. ప్రస్తుత లోకం ముగుస్తుంది. క్రీస్తు రాజ్యాన్ని తండ్రికి అప్పగిస్తాడు. తదనంతరం దేవుడే సమస్తాన్ని పరిపాలిస్తాడు - 1 కొరి 15,24-28. ఇక్కడ మనకు మూడంశాలు ముఖ్యం.

మొదటిది, దేవుడు క్రీస్తుద్వారా అందరికీ తీర్పుతీరుస్తాడు -రోమా 2,16. కాని క్రీస్తుని నమ్మినవాళ్లు ఖండనకు గురికారు. రెండవది,విశ్వాసులంతా మోక్షంలో కలసివుంటారు. క్రీస్తు తోడి సోదరుల్లో జ్యేష్ఠుడు ఔతాడు - రోమా 8,29. అంత్యకాలంలో ఒక్క నరులేగాక సృష్టిఅంతా నూత్నత్వాన్ని పొందుతుంది -8,21. మూడవది, రెండవ రాకడ అంటే క్రీస్తు విజయమే. దానితోలోకంలోని దుష్టశక్తులన్నీ నశిస్తాయి. ఆలా నాశమయ్యే చివరి శత్రువు మృత్యువు -1 కొరి 15,25-26.

## 3. సదా క్రీస్తుతో వుండిపోవడం

మోక్షంలో మనం సదా క్రీస్తుతో వుండిపోతాం. ఉత్థానమయ్యేవారిలో క్రీస్తు ప్రథమఫలం. అతనిలాగే మనంకూడ ఉత్థాన మౌతాం. మనం క్రీస్తుకి తోడివారసులం - రోమా 8,17. మనం క్రీస్తుతోపాటు మరణిస్తే అతనితోపాటు జీవిస్తాం గదా! కనుక మనం సదా ప్రభువుతోనే వుండిపోతాం -1 తెస్స 4,17. మోక్షంలో క్రీస్తుతో కలసి వుండడం, ఆ ప్రభువుతో కలసి జీవించడం మహాభాగ్యం. ఒక్క క్రీస్తుతో కలసి వుండడం మాత్రమేకాదు, మనం కూడ అతనిలాగే మారిపోతాం. దేవుని కుమారుని పోలికను పొందడమే నరులమైన మన ధ్యేయం - రోమా 8,29.

కాని క్రీస్తుని నిరాకరించినవాళ్ల గతియేమిటి? మొదటలో పౌలు క్రీస్తుని నారాకరించిన యూదులు నాశమై పోతారు అని వ్రాసాడు -2 తెస్స 1,9. కాని చివరలో వ్రాసిన రోమా పౌరుల జాబులో దేవుడు అందరిపై కృపజాపుతాడు అని నుడివాడు -11,32. ఇది ఆనాటి యూదులనుగూర్చి చెప్పిన వాక్యం. ఐతే ఇక్కడ అతడు యూదజాతిని గూర్చి సమష్టిగా మాట్లాడుతున్నాడు. ఆ జాతిలోని ప్రతివ్యక్తిని గూర్చి చెప్పడం లేదు. కనుక లోకాంతంలో ప్రతివ్యక్తి రక్షణం పొందుతాడని పౌలు బోధించలేదు.

## 4. ఉత్థాన జీవితం ఏలా వుంటుంది?

మనకు ఈ లోకంలో భౌతిక శరీరాలు వుంటాయి. కాని మోక్షంలో ఈ భౌతిక శరీరం ఆధ్యాత్మిక శరీరంగా మారిపోతుంది. గ్రీకులు పరలోక జీవితంలో ఆత్మ మాత్రమే వుంటుంది, శరీరం వుండదు అనుకొన్నారు. పైగా మోక్షజీవితం మనకు అప్రయత్నంగాను సహజసిద్ధంగాను లభిస్తుంది అనుకొన్నారు. దీనికి భిన్నంగా పౌలు మోక్షజీవితం మనకు దేవుని దయవల్ల మాత్రమే లభిస్తుంది అని చెప్పాడు. పైగా పరలోక జీవితంలో మన దేహమూ ఆత్మ కలసివుంటాయని చెప్పాడు.

కాని మోక్షజీవితంలో వుండే దేహం ఈ లోకంలో వుండే దేహంకాదు. రక్తమాంసాలు దేవుని రాజ్యాన్ని పొందలేవు -1 కొరి 15,50. మోక్షంలోగూడ మనం ఈ లోకంలో ఏవ్యక్తులమో ఆ వ్యక్తులంగానే వుంటాం. కాని మన దేహస్వభావం మాత్రం మారిపోతుంది. ఈలోకంలోని మన దీనశరీరాలు పరలోకంలో ఉత్థానక్రీస్తు దివ్య శరీరంలాగ మారిపోతాయి -ఫిలి 3,21. ఈ లోక జీవితానికి ఈ మర్త్యశరీరం సరిపోతుంది. పరలోక జీవితానికి దివ్యశరీరం కావాలి.

ఈ సందర్భంలో పౌలు విత్తనాన్నీ దానినుండి వచ్చే మొలకనూ ఉపమానంగా పేర్కొన్నాడు. విత్తనానికి సంబంధించిన మొలకే మెలుస్తుంది. మామిడి విత్తనంనుండి నారింజ మొలకరాదు కాని విత్తనం రూపంవేరు, మొలకరూపం వేరు. మన లౌకిక దేహాలు విత్తనాలు. మన ఉత్థాన దేహాలు వాటినుండి వచ్చే మొలకలు -1 కొరి 15,44.

ఫలితార్థం ఏమిటంటే, మన ఆత్మలు శరీరాలు కూడ ఉత్థాన జీవితంలో వుంటాయి. కాని అక్కడి శరీరాలు ఇక్కడి వాటిల్లాగ క్షయమైనవి కావు, అక్షయమైనవి. భౌతికమైనవి కావు, దివ్యమైనవి.

పౌలు త్వరగా చనిపోయి క్రీస్తుని చేరుకోవాలని ఉవ్విళ్లూరి పోయాడు. అతనికి తన విశ్వాసుల అవసరాలు తీర్చడం కొరకు తాను ఇంకా కొంతకాలం జీవించివుండడం మేలనిపించింది. కాని తనమట్టుకుతాను ఈ జీవితాన్ని త్యజించి క్రీస్తుని చేరాలనిగాఢంగా వాంఛించాడు -ఫిలి 1,23-25. ఇంకా తాను ఈ భౌతిక శరీరాన్ని త్యజించి క్రీస్తు సన్నిధిని చేరడమే మేలని యెంచాడు -2కొరి 5,8. క్రీస్తుపట్ల అతనికున్న గాఢమైన ప్రేమ ఆలాంటిది.అతని దృష్టిలో నరునిగమ్యం క్రీస్తే. రెండవ రాకడ అంటే ప్రధానంగా మనం క్రీస్తుని చేరుకొని అతనితో సదావుండిపోవడమే. ఈలోకంలో మనం పయనించే బాట మనలను ఆ క్రీస్తువైపే తీసికొనిపోవాలి. అది మనలను ఆ క్రీస్తు దగ్గరికే చేర్చాలి. మనం చేరవలసిన రేవు క్రీస్తే.

## ఉపసంహారం

తండ్రి క్రీస్తుద్వారా మనకు నూత్న జీవాన్ని ఈయగోరాడు. మనం ఈ క్రీస్తుని విశ్వసించి రక్షణం పొందాలి. క్రీస్తు వరప్రసాదం

మన హృదయాలను మార్చి మనలను నూత్న మానవులనుగా తయారుచేస్తుంది. అప్పుడు మనం అన్యాయాలకూ మోసాలకూ పాల్పడం. మనలోని స్వార్థం అంతరిస్తుంది. దానివలన సమసమాజం ఏర్పడుతుంది. కనుక పౌలు బోధించిన క్రీస్తు సువార్త అన్నిదేశాలవారికీ, అన్ని కాలాలవాళ్లకూ ప్రేరణం పుట్టిస్తుంది. పేదరికంతో, అన్యాయాలతో, ఘర్షణలతో అణగారిపోతున్న భారత దేశానికి గూడ ఈ సువార్త అవసరం వుంది. పౌలు బోధలు అజరామరమైనవి.

# ప్రశ్నలు

## అధ్యాయం - 1

1. పౌలు చేసిన మూడు ప్రేషిత యాత్రలను వివరించండి.
2. పౌలు వ్యక్తిత్వాన్ని వివరించండి.
3. ఇప్పుడు మనకు పౌలు రచనల ప్రాముఖ్యం ఏమిటి?
4. మన ప్రజలకు పౌలు జాబుల్లోని భావాలు ఎంతవరకు తెలుసు?

## 3

5. పౌలు క్రైస్తవులను ఎందుకు హింసించాడు?
6 డమస్కు దర్శనంవల్ల అతడు గ్రహించిన నూత్నాంశాలు ఏమిటివి?

## 4

7. రక్షణప్రణాళిక తండ్రినుండే - వివరించండి.
8. "పౌలు సువార్త" అంటే యేమిటి?

## 5

9. దేవుడు నరులను నీతిమంతులను చేయడం అంటే యేమిటి?
10. రక్షణం అనే భావాన్ని వివరించండి.
11. నరులు దేవునితో రాజీపడ్డం అనే భావాన్ని వివరించండి.

12. తండ్రి క్రీస్తు దేహాన్ని కరుణా ఫలకంగా జేసాడు -వివరించండి.
13. నరులు దేవునితో రాజీపడ్డం అనే భావాన్ని వివరించండి.
14. మార్చివేయడం అనే భావాన్ని వివరించండి.

## 6

15. పాపాన్ని గూర్చిన పౌలు భావాలను తెలియజేయండి.
16. పౌలు జాబుల్లో కన్పించే "శరీరం" అనే మాటకు అర్థం ఏమిటి?
17. ధర్మశాస్త్రాన్ని గూర్చిన పూర్వవేద భావాలనూ, కాలక్రమేణ ఆ భావాల్లో వచ్చిన మార్పులనూ తెలియజేయండి.
18. ధర్మశాస్త్రాన్ని గూర్చిన పౌలు అభిప్రాయాలను వివరించండి.

## 7

19. విశ్వాసాన్ని గూర్చిన పౌలు భావాలను వివరించండి.
20. జ్ఞానస్నానాన్ని గూర్చిన పౌలు భావాలను సంగ్రహంగా తెలియజేయండి.
21. పౌలు జాబుల్లో కన్పించే "క్రీస్తునందు" అనే ప్రయోగానికి అర్థమేమిటి?
22. ఆత్మను గూర్చిన పౌలు భావాలను వివరించండి.
23. తిరుసభను గూర్చిన పౌలు భావాలను తెలియజేయండి.

## 8

24. ధర్మశాస్త్రం, శరీరం, పాపం అనే మూడింటినుండి మనకు స్వేచ్ఛ ఏలా లభిస్తుంది.

## 9

25. పౌలు ప్రేషిత సేవను గూర్చి ఐదంశాలు తెలియజేయండి.

## 10

26. పౌలు పాటించిన ఇంద్రియ నిగ్రహాన్ని వివరించండి.
27. వివాహ జీవితాన్ని గూర్చిన పౌలు భావాలను వివరించండి.